www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 30-11-2025 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 242 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.9.30 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.1.11 తదుపరి రేవతి, వర్జ్యం: ఉ.11.29-1.00, దుర్ముహూర్తం: సా.4.06-4.50, అమృతఘడియలు: రా.8.37-10.08, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రేపట్నుంచి సీఎం పట్టణ బాట!

వారం రోజుల పాటు ప్రజల మధ్యనే..

రోజుకో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పంచాయతీ ఎన్నికల కోడ్‌తో ఇబ్బంది లేకుండా పట్టణాల్లోనే కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం (డిసెంబరు 1) నుంచి పట్టణ బాట పడుతున్నారు. ఏడో తేదీ వరకు ఏడు రోజుల పాటు కేవలం పట్టణ ప్రాంతాల్లో కొనసాగే ఈ పర్యటనలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొం టారు. తొలిరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

మిగతా 12వ పేజీలో...

మెస్సీతో సీఎం ఫుట్‌బాల్!

స్టార్ ప్లేయర్‌తో తలపడనున్న రేవంత్‌రెడ్డి 12

13న ఉప్పల్ స్టేడియంలో విద్యార్థులతో ఆట

పోటెత్తిన పోటీ

చివరి రోజే 20 వేలకు పైగా నామినేషన్లు.. తొలి రెండు రోజులతో పోలిస్తే 4 రెట్లు

ఓటు కోసం క్యూలో నిలబడ్డ ఓటర్లలా..

నామినేషన్ కోసం రాత్రి కూడా లైన్‌లో అభ్యర్థులు

నామినేషన్ల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

మండల స్థాయి నేతలతో ఎప్పటికప్పుడు చర్చలు

సొంత పార్టీలో పోటీ ఉన్న చోట్ల సర్దుబాట్లు

పార్టీ రహితమైనా.. సై అంటే సై అంటున్న పార్టీలు

పట్టున్న చోట్ల ఏకగ్రీవాల కోసం నేతల మంతనాలు

పెద్ద సంఖ్యలో పంచాయతీల ఏకగ్రీవం

నేటి నుంచి రెండో విడత ఎన్నికలకు నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో తొలి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచా యతీలకు నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. నామినే షన్ల స్వీకరణకు శనివారం చివరిరోజు కావడంతో అభ్య ర్థులు పోటెత్తారు. తొలి రెండు రోజులతో పోలిస్తే దాదాపు నాలుగు రెట్ల నామినేషన్లు వచ్చాయి. అభ్యర్థులు రాత్రి వరకు లైన్‌లో ఉండి మరీ.. నామినేషన్ పత్రాలు సమ ర్పించారు. ఇది.. పోలింగ్ రోజు ఓటు వేసేందుకు ఓటర్లు సాయంత్రం 6 గంటల తర్వాత కూడా లైన్‌లో ఉన్న తీరును తలపించింది. నామినేషన్ల గడువు సాయంత్రం 5 గంటలతో ముగియగా.. ఆ లోపు నామినేషన్ కేంద్రాల లోపలికి వచ్చినవారిని ఎంత ఆలస్యమైనా అనుమతించా లన్న నిబంధన ఉంది. దీంతో గడువు సమయం లోపు నామినేషన్ కేంద్రాల్లోకి వచ్చినవారు రాత్రి వరకు లైన్‌లో ఉండడం పలుచోట్ల కనిపించింది. ఒకేసారి వంద మంది వరకు రావడంతో మండల స్థాయిలోని అధికారులు ఊపిరి సలపని పనిలో పడిపోయారు. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 189 మండలాల్లోని 4,236 గ్రామపంచా యతీలకు ఎన్నికలు జరుగుతుండగా.. ఆయా

మిగతా 13వ పేజీలో...



మెదక్ జిల్లా అల్లాదుర్గంలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు

అయ్యో.. సర్పంచ్ సాబ్!

సొంత డబ్బులతో అభివృద్ధి పనులు

బిల్లులు రాక రూ.లక్షల్లో అప్పులు

భూములు అమ్ముకొని ఇల్లు గుల్ల

పొట్టకూటి కోసం ఉన్న ఊర్లోనే కూలీలుగా కొందరు

ఉపాధి కోసం హైదరాబాద్ బాట

వేతనం రూ.6,500 మాత్రమే..

ఎన్నిక కోసం లక్షల్లో ఖర్చు 12

అన్నీ తెలిసినా సర్పంచ్ పదవికి సై.. నేనంటే నేనంటూ పోటీ



నిబంధనలు పాటించని..

స్లీపర్ బస్సులను పక్కన పెట్టండి 10

అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు

వరుస బస్సు ప్రమాదాలపై కమిషన్ ఆందోళన

మానవ హక్కుల రక్షణ చట్టం కింద విచారణ



సిమ్ ఉన్న ఫోన్లోనే

వాట్సాప్ లాగిన్!

ఇకపై వాట్సా‌ప్‌కు సిమ్ బైండింగ్ నిబంధన

6 గంటల తర్వాత వెబ్ వాట్సాప్ దానంతటదే లాగౌట్.. మళ్లీ క్యూఆర్ స్కాన్ చేస్తేనే లాగిన్

సైబర్ నేరాల్ని అరికట్టేందుకు కేంద్రం నిర్ణయం

మెసేజింగ్ యాప్‌లకు వర్తింపు 14

90 రోజుల్లో అమల్లోకి తేవాలని ఆదేశం

ఇప్పటికే యూపీఐ, బ్యాంకింగ్ యాప్‌లలో..



గిన్నిస్ రికార్డు డ్రోన్ షో

సదస్సులో 9న ప్రదర్శన

'తెలంగాణ రైజింగ్.. రండి, భాగస్వాములు కండి' అనే ఆహ్వానం కనిపించేలా..

మూడు వేల డ్రోన్లతో షో ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

12

పెట్టుబడులు 'రైజింగ్'!



రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేటలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు'కు జరుగుతున్న ఏర్పాట్లు

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు'లో ఒప్పందాలకు ముందుకొస్తున్న కంపెనీలు

భారీగా పెట్టుబడులు పెట్టనున్న సింగపూర్ సంస్థ సెంబ్‌కార్ప్

దాదాపు వెయ్యి ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం

హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ కొత్తగా ప్లాంట్ల ఏర్పాటు

పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్న దేశ, విదేశీ సంస్థలు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు'తో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు దూసుకెళ్లనున్నాయి. సదస్సు వేదికగా పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకునేందుకు పలు దేశ, విదేశీ సంస్థలు ముందుకొ స్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆసక్తి వ్యక్తం

మిగతా 12వ పేజీలో...



గగనయానం గందరగోళం 14

ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యలు.. నిలిచిపోయిన 6 వేల విమానాలు

భారత్‌లోనూ 250 వరకూ నిలిపివేత

సౌర రేడియోధార్మికతతోనే సమస్యలు

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌కు ఎయిర్‌బస్ సూచన

షెడ్యూల్‌లో మార్పులు.. గందరగోళం

ముంచుకొస్తున్న 'దిత్వా'

తమిళనాడులోని 9 జిల్లాలకు రెడ్ అలర్ట్

ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళలోనూ.. 3

చెన్నైలో కుండపోత.. 54 విమానాల రద్దు

ఇప్పటికే శ్రీలంకలో 'దిత్వా' విధ్వంసం

153మంది మృతి.. 191మంది గల్లంతు

కర్ణాటకానికి తెర!

సిద్దరామయ్య, శివకుమార్ అల్పాహార భేటీ

మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాల్లేవు 14

2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం: సిద్దూ

అధిష్ఠానం ఆదేశాలు పాటిస్తాం: శివకుమార్

'సర్'పైనే సమరం!

రేపటి నుంచి డిసెంబరు 19వ తేదీ వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు 14

నేడు అఖిలపక్ష, బీఏసీ భేటీలు

గ్రిడ్ రక్షణకు

థర్మల్ విద్యుత్ అవసరం

రామగుండం, పాల్వంచలో థర్మల్ కేంద్రాలు

బీఆర్ఎస్ హయాంలో అవగాహనలేని నాయకుల వల్ల విద్యుత్ రంగంలో సరైన ప్రణాళికలు అమలు కాలేదు

పిట్‌హెడ్ ప్లాంట్లే కడతాం.. బీఆర్ఎస్‌లా తప్పులు చేయం

2035కల్లా థర్మల్‌లో రాష్ట్ర వాటా 6 వేల మెగావాట్లు ఉండాలి

పూర్తిగా సంప్రదాయేతర వనరులపై ఆధారపడడంతో స్పెయిన్, పోర్చుగల్ వంటి దేశాల్లో గ్రిడ్ కుప్పకూలింది

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

రెండు ప్లాంట్లకు అయ్యే ఖర్చే రూ.22 వేల కోట్లు

50 వేల కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది?: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయో జనాలే ప్రామాణికంగా విద్యుత్ రంగంలో నిర్ణయాలు తీసు కుంటున్నామని, వ్యక్తిగత ప్రయోజనాలకు తావులేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. బీఆర్ ఎస్ హయాంలో అవగాహన లేని నాయకుల వల్లే విద్యుత్ రంగంలో సరైన ప్రణాళిక అమలు కాలేదన్నారు. దీనికోసం రాష్ట్రంలో రామగుండం, పాల్వంచలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు కట్టాలని నిర్ణయించామని చెప్పారు. గ్రిడ్ రక్షణకు

మిగతా 2వ పేజీలో...

విద్యుత్‌పై పొంతన లేని లెక్కలు

గ్రీన్ ఎనర్జీ పాలసీలో ఓ మాట.. పీపీటీలో మరోమాట

రూ.50 వేల కోట్లలో కమీషన్ల కోసమే థర్మల్ ప్లాంట్లపై ముందుకెళ్తున్నారా?.. హరీశ్‌రావు 2



గ్రేటర్‌లో రూ.4,051 కోట్లతో భూగర్భ విద్యుత్ వ్యవస్థ

నాలుగు సర్కిళ్లలో ఏర్పాటు 2

3 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్

పోటీ బిడ్డింగ్‌లో టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతి 2

భట్టి ఆదేశాలతో ఉద్యోగుల బిల్లులు.. రూ.707.30 కోట్ల విడుదల

గ్రిడ్ రక్షణకు

థర్మల్ విద్యుత్ అవసరం

(మొదటిపేజీ తరువాయి)



థర్మల్ విద్యుత్ కూడా అవసరమని, పూర్తిగా సంప్రదాయేతర ఇంధన వనరులపై ఆధారపడటంతో ఏప్రిల్‌లో గ్రిడ్ కుప్పకూలి స్పెయిన్, పోర్చుగల్ వంటి దేశాల్లో చీకట్లు అలుముకున్నాయన్నారు. గ్రిడ్ కుప్పకూలితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రోజుకు రూ.1500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల దాకా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం ప్రజా భవన్‌లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, తీసుకోనున్న చర్యలపై భట్టి.. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం బాగుపడి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు రావడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదని, అందుకే సంకుచిత స్వభావంతో ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక విజన్ లేకుండా రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేశారని, వారు రాజకీయాలకు పనికి రారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో మునిగిపోయామని, ప్రజల్లో కనుమరుగు అవుతున్నామని బీఆర్ఎస్ నాయకులు బట్టకాల్చి మీద పడేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో థర్మల్ వాటా 2035 కల్లా 3.50 లక్షల మెగావాట్లు ఉండాలని సీఈఏ అంచనా వేసిందని, ఇందులో రాష్ట్రం వాటా 5 వేల నుంచి 6 వేల మెగావాట్లు ఉండాలని తెలిపారు. పిట్‌హెడ్ (బొగ్గు గని ఉపరితలం) భాగంలోనే ప్లాంట్లు కడతామని తెలిపారు. థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో తొలి ప్రాధాన్యం జాతీయ థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టీపీసీ)కే ఇస్తున్నామని, ఎన్‌టీపీసీ, జెన్‌కోల్లో ఏదీ తక్కువ ధరకు కడితే వాటికే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను నిర్మించడం ప్రభుత్వ ఉద్దేశమని, దీని కోసం శ్రేయోభిలాషుల సహకారం తీసుకుంటామని, బీఆర్ఎస్‌లా తప్పిదాలు చేయబోమన్నారు. బీఆర్ఎస్ హయాంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో కాకుండా కాలంచెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ప్లాంట్ చేపట్టారని, ఇండియాబుల్స్ కోసం కొని వదిలేసిన టర్బైన్లు, జనరేటర్లు వినియోగించారని విమర్శించారు. దీనివల్ల బొగ్గు వినియోగంతో పాటు కాలుష్యం పెరగడం, నిర్వహణ సమస్యలతో జెన్‌కోపై ఏటా భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. 2014లో రాష్ట్ర అత్యధిక డిమాండ్ 6,755 మెగావాట్లు ఉంటే 2024-25 కల్లా 17,162 మెగావాట్లకు చేరిందన్నారు. కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ) నివేదిక ప్రకారం 2034-35 కల్లా రాష్ట్ర డిమాండ్ 38,229 మెగావాట్లకు పెరుగుతుందని తెలిపారు. 2047 కల్లా 1.38 లక్షల మెగావాట్లకు చేరే అవకాశం ఉందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశాల ప్రకారం మొత్తం విద్యుత్‌లో సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా 43.33శాతం ఉండాలని, అదే 2030కల్లా 50 శాతం, 2070కల్లా నెట్ జీరో (కర్బన ఉద్గారాలు లేని విద్యుత్) లక్ష్యం సాధించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టలేదన్నారు. రాష్ట్రంలో 10-12 చోట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలకు అనుకూలత ఉందన్నారు. ఈ కేంద్రాల నిర్మాణం చేపడితే పూర్తి కావడానికి ఆరేళ్లు పడుతుందన్నారు. ముందుచూపు లేనందువల్లే ఏపీ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు కట్టుకుందని, మార్కెట్‌లో దొరికే చవకైన విద్యుత్‌ను నిల్వ చేసుకోవడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. 'విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ నివేదికపై ఏం చేశారు? ఆ నివేదికలో ఏముందని ప్రశ్నించగా నివేదికను న్యాయ నిపుణుల పరిశీలనకు పంపించామని, వారి నివేదిక వచ్చిన తర్వాత వాస్తవాలు బయటపడతాయని భట్టి వెల్లడించారు. ఒకే ప్రాంతంలో పలు డిస్కమ్‌లకు లైసెన్స్ ఇచ్చేలా కేంద్రం విద్యుత్ సవరణ చట్టం ముసాయిదాపై స్పందిస్తూ దానిపై అధ్యయనం చేశాకే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

3వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్

» పోటీ బిడ్డింగ్‌లో టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్ల కాలంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి, సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా (రెన్యూవబుల్ పవర్ అబ్లిగేషన్-ఆర్‌పీవో) లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 3 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు అనుమతినిచ్చింది. ఈ మొత్తం విద్యుత్‌ను ఏకకాలంలో కాకుండా, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా దశలవారీగా కొనుగోలు చేయనున్నారు. 2026 జూన్ నాటికి 1,000 మెగావాట్లు, 2026 డిసెంబరు నాటికి మరో 1,000 మెగావాట్లు, 2027 జూన్ నాటికి చివరి 1,000 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తారు. ఈ ప్రక్రియ కోసం తక్షణమే టెండర్లు పిలవాలని తెలంగాణ రెడ్‌కో వీసీఎండీ, డిస్కమ్‌ల సీఎండీలను ఆదేశిస్తూ, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2030 నాటికి రాష్ట్రానికి మొత్తం 12 వేల మెగావాట్ల సంప్రదాయేతర ఇంధన విద్యుత్ అవసరమవుతుందని అంచనా వేయగా, ఇందులో 5 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలు చేయడానికి అవకాశం ఇవ్వాలని రెడ్‌కో గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. దీనిపై చర్చించిన ప్రభుత్వం ఐదేళ్ల కాలానికి 3 వేల మెగావాట్ల సౌరవిద్యుత్‌ను పోటీ బిడ్డింగ్ ద్వారా కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

బొగ్గు రవాణాకే ఏటా రూ.1600 కోట్లు: శ్రీధర్‌బాబు

పిట్‌హెడ్ ప్లాంట్లు కట్టాలని సీఈఏ చెబుతున్నప్పటికీ నాన్-పిట్ హెడ్ ప్లాంట్లనే బీఆర్ఎస్ కట్టిందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌.. బొగ్గు గనులకు 250 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, దీనివల్ల ఏటా బొగ్గు రవాణాకే రూ.1,600 కోట్ల భారం పడుతుందన్నారు. 25 ఏళ్లలో ప్రజలపై రూ.40 వేల కోట్ల భారం పడనుందని చెప్పారు. బీఆర్ఎస్ ఆరోపణలపై స్పందిస్తూ రెండు థర్మల్ యూనిట్లు (ఒక్కోటి 800 మెగావాట్లు) కట్టడానికి రూ.22 వేల కోట్లలోపే అవుతుందని, అలాంటిది రూ.50 వేల కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. పచ్చకామెర్లు వచ్చినోళ్లకు లోకమంతా పచ్చగానే కనిపించినట్లుగా బీఆర్ఎస్ నేతల వైఖరి ఉందని మండిపడ్డారు. నిర్మాణాత్మక విమర్శలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో ఇక ముందు సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో పిట్‌హెడ్‌లోనే ప్లాంట్లు కడతామన్నారు.


కేంద్ర విద్యుత్ సంస్థ ప్రణాళిక ప్రకారం గరిష్ఠ డిమాండ్, అవసరం, కొరత (మెగావాట్లలో)

సంవత్సరం	2025-26	2026-27	2027-28	2028-29	2029-30	2030-31	2031-32	2032-33	2033-34	2034-35
గరిష్ఠ డిమాండ్	18,825	20975	22,774	24,811	26,299	27,832	29,246	30,685	32,193	33,773
థర్మల్ విద్యుత్ లభ్యత/కొరత										
అవసరం	11,112	11,779	12,485	13,235	14,209	14,786	15,555	16,428	17,313	18,248
కొరత	లేదు	లేదు	లేదు	లేదు	774	1531	2330	3171	4058	4993
అదనం	2,143	1476		776		20				
సోలార్ విద్యుత్										
అవసరం	9100	9707	17,407	19,407	21,248	23,178	24,668	25,987	27,199	28,360
కొరత	307	1000	8700	10,700	12,541	14,471	15,961	17,280	18,492	19,653

విద్యుత్‌పై పొంతన లేని లెక్కలు

» మొన్నటి శ్వేతపత్రం, గ్రీన్ ఎనర్జీ పాలసీలో ఒకమాట.. ఇప్పుడు పీపీటీలో మరోమాట

» భట్టి, శ్రీధర్‌బాబుకు హరీశ్ కౌంటర్



హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు పొంతనలేని లెక్కలు చెబుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. డిప్యూటీ సీఎంగా, విద్యుత్ మంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న భట్టి శాఖలోని విషయాలపై అవగాహన లేకపోయినప్పటికీ ఇతరులను రాజకీయాలకు పనికిరారనడం తగునా అని ప్రశ్నించారు. విద్యుత్‌పై డిప్యూటీ సీఎం అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన శ్వేతపత్రం, ఇటీవల విడుదల చేసిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025, శనివారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ)లో చెప్పిన విద్యుత్ గణాంకాలు ఒక దానికి మరొకటి పొంతన లేకుండా ఉన్నాయని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు అధికారులు రాసిచ్చినదాన్ని గుడ్డిగా చదివినట్లు ఉందన్నారు. శ్వేతపత్రం పేజీ నెం.11లో ఏముందో ఒకసారి చూసుకోవాలని మంత్రికి సూచించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణాకు ఏడాదికి రూ.803 కోట్లు కావాలని శ్వేతపత్రంలో పేర్కొని.. ఇప్పుడు రూ.1,600 కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారని విమర్శించారు. నాడు ఆ ప్లాంట్ నిర్మాణాన్ని తప్పు పట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మక్తల్ వద్ద థర్మల్ ప్లాంటు ఏర్పాటు చేస్తామంటున్నారని, నాడు యాదాద్రి తప్పయితే, నేడు మక్తల్ ఒప్పు అవుతుందా అని ప్రశ్నించారు. 'మీ శ్వేతపత్రం పేజీ నం.7లో 1-12-2023 నాటికి సోలార్ కెపాసిటీ 6123 మెగావాట్లు అని చెప్పారు. 11-01-2025న మీరు విడుదల చేసిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నం.8లో 5,415 మెగావాట్లు అన్నారు. 2023లో 6,123 మెగావాట్లు ఉంటే, 2025 నాటికి 5,415 మెగావాట్లు ఎలా అయింది. గతంలో ప్రకటించిన శ్వేతపత్రం, పాలసీతో పోల్చి చూసుకున్నారా?' అని హరీశ్ ప్రశ్నించారు. పునర్విభజన చట్టం ప్రకారం 1600 మెగావాట్ల ఎన్టీపీసీ పవర్ అందుబాటులో ఉండగా, దాంతో ఒప్పందం చేసుకోకుండా ఎందుకు 2,400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి వెళ్తున్నారన్నారు. దీని కోసం చేసే రూ.50 వేల కోట్ల ఖర్చులో 30-40 శాతం కమీషన్ కోసమేనా అని ప్రశ్నించారు. 'మీ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నం.3 ప్రకారం 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ తీసుకొస్తున్నామన్నారు. రాబోయే ఐదేళ్లలో మీరు సాధించాల్సింది సుమారు 13,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉండగా థర్మల్ ప్లాంట్లని ఎందుకు వెళ్తున్నారు. మీరే ఇచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ఎందుకు తుంగలో తొక్కుతున్నారు? ఇదే పాలసీ 10వ పేజీలో 2034-35 వరకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 16,966 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు 5,000-6,000 మెగావాట్ల లోటు ఉండబోతోందని ఎలా చెబుతున్నారని హరీశ్ ప్రశ్నించారు.

గ్రేటర్‌లో రూ.4,051 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని మెట్రో జోన్(బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిల్)లో రూ.4,051 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆయా ప్రాంతాల్లో 11 కేవీ, 33 కేవీ ఓవర్‌హెడ్, ప్రధాన రహదారులపై ఉన్న ఎల్‌టీ ఓవర్‌హెడ్‌లను తొలగించి... ఆ స్థానంలో భూగర్భ కేబుళ్లు వేయనున్నారు. ప్రధానంగా మెట్రో జోన్ పరిధిలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచడం, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం ద్వారా ఆర్థికవృద్ధిని పెంచడానికి భూగర్భ కేబుల్ వ్యవస్థ ఉపయుక్తంగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. దీని కింద ఆయా సర్కిళ్లలోని ప్రధాన రహదారుల్లో ఉన్న విద్యుత్ వైర్లను తొలగించనున్నారు. దీనికి రూ.4,051 కోట్లు అవుతాయని ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు అయ్యే నిధులను రుణ రూపంలో సమీకరించుకోవాలని ప్రభుత్వం డిస్కమ్‌కు నిర్దేశించింది.

లోకం తీరు



నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీలో మళ్లీ ర్యాగింగ్

» నలుగురు విద్యార్థులను ఏడాదిపాటు హాస్టల్ నుంచి బహిష్కరణ

నాగర్‌కర్నూల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన మరోసారి కలకలం రేపింది. ఈ నెల 6న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నలుగురు సీనియర్ విద్యార్థులు క్యాంపస్‌లో జూనియర్ విద్యార్థినులను తీవ్రంగా వేధించారు. తరగతి గదుల్లోకి వెళ్లే ముందు గోడకుర్చీ వేయించి, తమకు సెల్యూట్ చేయాలంటూ ఇబ్బందులకు గురిచేశారు. బాధిత విద్యార్థినులు ప్రిన్సిపాల్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె ర్యాగింగ్‌కు పాల్పడిన ఆ నలుగురు విద్యార్థులను ఏడాది పాటు హాస్టల్ నుంచి బహిష్కరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే రాబోయే రోజుల్లో క్రిమినల్ చర్యలు తీసుకునే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రిన్సిపాల్ హెచ్చరించారు.

60 రోజుల ముందస్తు టికెట్ రిజర్వేషన్

» టీజీఎస్ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు అనునిత్యం ప్రయత్నిస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ).. తాజాగా మరో నిర్ణయం తీసుకున్నది. బస్సులో ప్రయాణానికి 60 రోజుల ముందే ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పటికే గమ్యం యాప్‌తో బస్సు లైవ్ లొకేషన్, బుకింగ్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పలు ప్రాంతాలకు ఏసీ, సీటర్, స్లీపర్ సర్వీసుల్ని టీజీఎస్ఆర్టీసీ తీసుకొచ్చింది. విమాన ప్రయాణం మాదిరే బస్సు సర్వీసు, ప్రయాణ సమయం, స్టాపుల వివరాలను బస్సు ప్రయాణం ప్రారంభానికి ముందే వివరిస్తారు. 'ఇది వరకే 60 రోజుల ముందు ఆర్టీసీ బస్సు టికెట్ బుకింగ్ ఉన్నా.. పండుగల సీజన్ నేపథ్యంలో ప్రయాణికుల ముందుకు తెచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నాం' అని ఓ టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారి చెప్పారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో అభివాదం చేస్తున్న దత్తాత్రేయ, ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్, గుజ్జ కృష్ణ తదితరులు

పార్లమెంటులో బీసీ బిల్లు కోసం ఉద్యమం

» కాంగ్రెస్, బీజేపీలకు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

» తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పిలుపు

కవాడిగూడ/బర్కత్‌పుర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించేంత వరకు బీసీలు రాజకీయాలకతీతంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఎర్ర సత్యనారాయణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, జస్టిస్ చంద్రకుమార్, బీసీ డెమోక్రటిక్ జేఏసీ కన్వీనర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. దత్తాత్రేయ మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెడితేనే రిజర్వేషన్లు సాధించుకోగలమని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ చేసి విద్యా ఉద్యోగ ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు.బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు జరిగే పోరాటంలో సంపూర్ణ సహకారం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46తో బీసీలకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పి మోసం చేసిన బీజేపీ, కాంగ్రెస్‌లను రాజకీయంగా బొందపెట్టాలని పిలుపునిచ్చారు.

మంత్రులు అలా మాట్లాడడం హాస్యాస్పదం: ఆర్.కృష్ణయ్య

గ్రామ సర్పంచ్ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరగలేదని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, దీనిపై బహిరంగ చర్చకు మంత్రులు రావాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య సవాల్ విసిరారు. జీవో 46ను రద్దు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రాందేవ్ మోదీ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదావేసి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఫిరాయింపులపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు లేదు

- హిల్ట్ పాలసీతో హైదరాబాద్‌లో కూలీల ఉపాధికి ప్రమాదం
- జీహెచ్ఎంసీ విస్తరణతో పాలనాపరమైన సమస్యలు వస్తాయి
- మేడారం జాతరకు జాతీయహోదా ఇవ్వటం సాధ్యంకాదు: కిషన్‌రెడ్డి



కాజీపేటలోని రైల్వే తయారీ పరిశ్రమను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్, రేవంత్‌రెడ్డిల్లో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయింపులు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపించారు. బీజేపీ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించదని స్పష్టం చేశారు. తమ పార్టీలోకి ఎవరు వచ్చినా పదవులకు రాజీనామా చేసి రావాల్సిందేనని తెలిపారు. కిషన్‌రెడ్డి శనివారం వరంగల్ నగరంలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసమే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్లు నాటకమాడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు కేటాయించిందని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి మోసం చేసిన బీఆర్ఎస్‌కు రిజర్వేషన్లపై మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలోని 22 పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు బయటకు పంపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా తీసుకొస్తున్న హిల్ట్ పాలసీతో కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తాయని తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కులోకి మరిన్ని కంపెనీలు..

పీఎం మిత్ర పథకం ద్వారా దేశంలో ఏడు టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేస్తే.. అందులో తెలంగాణ నుంచి వరంగల్‌లోని కాకతీయ టెక్స్‌టైల్ పార్కును ఎంపిక చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ పార్కులో కైటెక్స్, యంగ్‌వన్, గణేశా కంపెనీలు యూనిట్లను ఏర్పాటుచేశాయని, త్వరలో మరిన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కాజీపేటలో 160 ఎకరాల్లో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) పనులను వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రూ.1.26 లక్షల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోందని వివరించారు.

ఏప్రిల్‌దాకా పత్తి కొనుగోళ్లు

రైతులు తొందరపడి ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించవద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. సీసీఐ వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ వరకు కూడా పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. దేశంలో అత్యధికంగా తెలంగాణ నుంచే గత ఏడాది 41 లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎకరానికి ఏడు క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి వస్తే, సంబంధిత మండల వ్యవసాయ అధికారితో ధృవీకరణ పత్రం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో చాయ్ పే చర్చ..

వరంగల్ పర్యటనలో కిషన్‌రెడ్డి శనివారం రోజంతా బిజీబిజీగా గడిపారు. హైదరాబాద్ నుంచి వందేభారత్ రైళ్లో ఉదయం ఆరు గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని ప్రయాణికులతో చాయ్ పే చర్చ నిర్వహించారు. అక్కడి నుంచి భద్రకాళి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపం పనులు పరిశీలించి, పూజలు చేశారు. హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ స్మార్ట్ సిటీ, హృదయ్, హెరిటేజ్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మధ్యాహ్నం 1 గంటకు కాజీపేటలోని రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించారు. మధ్యాహ్నం 3 గంటలకు హరిత హోటల్‌లో జాతీయ రహదారులు, సీసీఐ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సాయంత్రం 4.25 గంటలకు మీడియాతో మాట్లాడిన తనంతరం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

మేడారం జాతరకు నిధులు ఇప్పించేందుకు కృషి

మేడారం మహా జాతరకు జాతీయ హోదా ఇచ్చే అవకాశం లేదని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మేడారం జాతరకు జాతీయ హోదాపై మీనమేషాలు' శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ.. దేశంలో ఏ దేవాలయానికి, జాతరలకు, ఉత్సవాలకు జాతీయ హోదా ఇవ్వలేదని చెప్పారు. మేడారం జాతరకు కూడా జాతీయ హోదా ఇవ్వడం కుదరదని స్పష్టంచేశారు. గతంలో తాను కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మేడారం జాతర కోసం రూ.18 కోట్ల వరకు నిధులు కేటాయించానని, ఈసారి కూడా నిధుల కోసం కేంద్ర గిరిజన, పర్యాటక శాఖల మంత్రులకు లేఖలు రాసినట్లు వెల్లడించారు.

హిల్ట్ పాలసీలో 6.29లక్షల కోట్ల కుంభకోణం

- రుజువు చేయకపోతే రాజీనామా చేస్తా
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్



హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్(హిల్ట్) పాలసీలో రూ.6.29లక్షల కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ సహా మంత్రులపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పలు ఆరోపణలు చేస్తూ ఆయన సవాల్ విసిరారు. కోకాపేటలో ఎకరం రూ.151 కోట్లు ధర పలుకుతుంటే.. హిల్ట్ పాలసీలో భాగంగా విలువైన భూములను ఎకరం రూ.54లక్షలకే ఎందుకు కట్టబెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. రూ.6.29లక్షల కోట్ల విలువైన భూమిని రూ.5వేల కోట్లకే ఇవ్వడం ల్యాండ్ లూటీ కాదా అని ప్రశ్నించారు. హిల్ట్ పాలసీ భారీ ల్యాండ్ లూటీ స్కామ్ అని రుజువు చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఒకవేళ తాను రుజువు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

వేములవాడ అభివృద్ధి పనులు వేగిరం

- నాలుగు ఎకరాల్లో ఆలయ విస్తరణకు చర్యలు

వేములవాడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన రూ.150 కోట్లతో నాలుగు ఎకరాల్లో ఆలయాన్ని విస్తరించేందుకు వీటీడీఏ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖ పనులు చేపట్టింది. ఇందులో భాగంగా ఇరుకుగా ఉన్న గుడి ప్రాంగణాన్ని 17 గుంటల మేర విస్తరించనున్నారు. 4 ఎకరాల విస్తీర్ణంలో రాజన్న ఆలయం చుట్టూ నూతనంగా మాడవీధులు, నిత్య కల్యాణం, అభిషేక మండపాలు, నాలుగు వైపులా రాజ గోపురాలను నిర్మించనున్నారు. ఆలయం బయట క్యూ కాంప్లెక్స్, వీఐపీ అతిథి గృహాలు, అదనంగా ధర్మగుండం, అన్నదాన సత్రం, వాణిజ్య సముదాయాలు నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ వాహనాల పిక్ అప్ కేంద్రం నిర్మించడానికి రూపకల్పన చేశారు. రాజన్న సన్నిధిలోని పాత భవనాలైన కళాభవన్, కల్యాణకట్ట, ఈవో కార్యాలయం, ప్రసాద తయారీ కేంద్రం, ఓపెన్ స్లాబ్, ప్రాకారం, అద్దాల మండపం, కోడెల క్యూలైన్లు, ఆలయ ఉత్తర గోపురం, ధర్మగుండం మెట్లను తొలగించారు. రెండో విడత అభివృద్ధి పనుల సమయంలో ఈవో నివాస భవనం, వీవీఐపీ గెస్ట్ హౌస్‌ను తొలగించనున్నారు.

భీమన్న సన్నిధిలో రూ.3.60 కోట్లతో పనులు..

రాజన్న ఆలయంలో పనులు జరుగుతుండటంతో భీమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం రూ.3.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. రాజన్న సన్నిధిలో మొన్నటి వరకు జరిగిన ఆర్జిత పూజలను భీమేశ్వరాలయానికి మార్చారు. ఇందులో ప్రధానంగా రూ.50లక్షలతో ప్రసాదం కౌంటర్లు, శంకరమఠ్‌లో రూ.50లక్షలతో నిత్యకల్యాణ మండపం, రూ.42లక్షలతో కోడెల క్యూలైన్, రూ.35 లక్షలతో దక్షణం, నవగ్రహ మండపం వైపు రూ.41లక్షలతో షెడ్డు, నటరాజ్ విగ్రహం వద్ద క్యూలైన్ షెడ్డు, రూ. 50లక్షలతో దేవాలయం చుట్టూ షెడ్డు, రూ.27లక్షలతో సీసీ ఫ్లోరింగ్, ప్రాకార నిర్మాణం, రూ.16లక్షలతో వంతెనలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు.

సాగు రంగానికి అధిక ప్రాధాన్యం

వ్యవసాయంలో తెలంగాణ ఆదర్శం: తుమ్మల

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఈ విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకుని బడ్జెట్‌లో సింహభాగం వ్యవసాయ రంగానికి కేటాయింపులు చేశామని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణ వ్యవసాయం ఎలా ఉండాలి.. అందుకు అవసరమైన వ్యూహాలు, విధానాలు, మౌలిక సదుపాయాలు, ఏ రంగాలు అత్యంత కీలకం అవుతాయి? వంటి అంశాలన్నీ శాస్త్రీయంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తున్నామని తెలిపారు. తుది నివేదికపై చర్చించేందుకు వివిధ విభాగాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులతో శనివారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరణకు సిద్ధమవుతోందన్నారు. అందులో భాగంగా తెలంగాణ వ్యవసాయం-2047 అగ్రిచాప్టర్ భవిష్యత్తు వ్యవసాయ అభివృద్ధికి పునాది వేయనుందని చెప్పారు.

తెలంగాణ తొలి శత్రువు కాంగ్రెస్సే

- కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు: కేటీఆర్
- మహేశ్‌గౌడ్‌కు ఉద్యమం గురించి మాట్లాడే అర్హత లేదు: హరీశ్‌రావు



హైదరాబాద్/సిద్దిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ కథలో కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికి విలన్. 1950 నుంచి 2025 వరకు తెలంగాణకు తొలి శత్రువు, శాశ్వత శత్రువు కాంగ్రెస్సే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఒక కీలక ఘట్టమైన దీక్షా దివస్ సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ అనే మూడు అక్షరాలు లేకుంటే తెలంగాణ లేదు అన్నది సత్యం అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిరి తాము ఏనాడు కూడా సోనియా గాంధీని తెలంగాణ బలిదేవత అని అనలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆమెకు ధన్యవాదాలు చెప్పిన సంస్కారం తమదని గుర్తు చేశారు. ఉద్యమకాలంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియదని, ఆయన ఈ రోజు కేసీఆర్ దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దమ్ముంటే కాంగ్రెస్‌లో చేర్చుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు. జాతీయ పార్టీలకు 16 మంది ఎంపీలను కట్టబెడితే తెలంగాణ గొంతుక పార్లమెంటులో మూగబోయిందని విమర్శించారు. కేసీఆర్ బయటకు రావట్లేదని అంటున్నారని, గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా సైలెంట్‌గా ఉంటుందని, కేసీఆర్ మాట, మౌనం రెండూ సంచలనమే అని పేర్కొన్నారు. రెండేళ్లుగా తెలంగాణలో కేసీఆర్ మాట లేకుండా రాజకీయం నడవడం లేదని, అంతటి బలమైన ముద్ర కేసీఆర్‌దని ఆయన అన్నారు. అంతకు ముందు తెలంగాణ తల్లి విగ్రహం, జయశంకర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహమూద్ అలీ, బండ ప్రకాశ్, వాణీదేవి తదితరులు పాల్గొన్నారు. దీక్షా దివస్‌ను న్యూజిలాండ్‌లో కూడా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ కృషిని ప్రశంసించారు.

దీక్షా దివస్ లేనిదే తెలంగాణ లేదు

"నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ లేకుంటే డిసెంబరు 9 ప్రకటన లేదు. డిసెంబరు 9 లేకుంటే జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్రం లేదు" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని శనివారం సిద్దిపేటలోని తన క్యాంపు ఆఫీసు ఎదుట దీక్షలకు సంబంధించిన ఫైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. తర్వాత రంగధాంపల్లి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. తొలుత ప్రజాకవి అందెశ్రీ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ దీక్ష గురించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మూర్ఖంగా మాట్లాడారని, ఉద్యమం గురించి మాట్లాడే హక్కు, అర్హతలు ఆయనకు లేవన్నారు. ఉద్యమకారుడిగా తనమీద 370 కేసులు ఉన్నాయని, సీఎం రేవంత్, మంత్రుల మీద ఎన్ని కేసులు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. మూడురోజులుగా కృష్ణానీళ్ల వాటాల గురించి చర్చలు జరుగుతున్నాయని, ఏపీ సీఎం చంద్రబాబు నీళ్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తుత్త మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చోద్యం చూస్తున్నారని ఆయన విమర్శించారు.

గాడిదలకు బ్యానర్లు కట్టి బీసీ సంఘాల నిరసన

బీసీ ప్రజాప్రతినిధుల రాజీనామాకు డిమాండ్



నల్లగొండటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పార్టీలపరంగా 42 శాతం నుంచి 60 శాతం వరకు బీసీలకు అవకాశం కల్పిస్తామని ప్రకటించి, ఇవ్వకుండా కాంగ్రెస్, బీజేపీ బీసీలను మోసం చేస్తున్నాయని బీసీ జేఏసీ నాయకులు విమర్శించారు. రాష్ట్రంలోని బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ వద్ద శనివారం గాడిదలకు బ్యానర్లు కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి జేఏసీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలపరంగా కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు ఎక్కడ? అని ప్రశ్నించారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి

- వాకింగ్ చేస్తుండగా కుప్పకూలిన కానిస్టేబుల్
- బస్సు నడుపుతూ స్టీరింగ్‌పై ఒరిగిన డ్రైవర్



హనుమంతరావు (ఫైల్)

సత్తుపల్లిరూరల్, జిన్నారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్నాపెద్దా అనే తేడా లేకుండా గుండెపోటుకు గురై ఇటీవల కాలంలో చాలామంది హఠాత్తుగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదే తరహాలో రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు గుండెపోటుకు గురై మృతి చెందారు. పెళ్లయిన 20 ఏళ్లకు పుట్టిన కూతురికి ఉదయం దైవ సన్నిధిలో అన్నప్రాశన చేయించిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ రాత్రి తమ ఇంటి పక్కన వాకింగ్ చేస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. మరో ఘటనలో ఎప్పట్లాగే విద్యార్థులను కాలేజీకి తీసుకెళుతున్న ఓ కాలేజీ బస్సు డ్రైవర్.. వాహనాన్ని నడుపుతుండగానే గుండెపోటుకు గురై స్టీరింగ్‌పైనే పడి మృతి చెందాడు. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో నల్లబోయిన హనుమంతరావు (40) అనే ఏఆర్ కానిస్టేబుల్ మరణించాడు. సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ బెటాలియన్‌లో 2007నుంచి కానిస్టేబుల్‌గా పని చేస్తున్న హనుమంతరావుకు 20 ఏళ్ల క్రితం విజయతో వివాహమైంది. వారికి ఆరు నెలల క్రితం సంతానం కలిగింది. ఆడపిల్ల పుట్టడంతో మురిసిపోయిన ఆ తల్లిదండ్రులు.. ఏపీలోని ద్వారకా తిరుమల ఆలయంలో శుక్రవారం ఉదయం ఆ చిన్నారికి అన్నప్రాశన చేశారు. అనంతరం రాత్రికి తిరిగి సత్తుపల్లికి చేరుకున్న హనుమంతరావు కుటుంబంతో కలిసి భోజనం చేశాడు. నిద్రకు ఉపక్రమించే ముందు ఇంటి పక్కన ఖాళీ స్థలంలో వాకింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా హనుమంతరావు గుండెపోటుతో అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఇక, సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం అందూరులో శనివారం ఉదయం జరిగిన ఘటనలో కృష్ణ (56) అనే డ్రైవర్ బస్సు నడుపుతుండగా గుండెపోటుతో మరణించాడు. సంగారెడ్డి ఎస్వీ కళాశాలకు చెందిన బస్సు శనివారం ఉదయం అందూరు నుంచి కళాశాలకు విద్యార్థులతో బయలుదేరింది. బస్సు బయలుదేరిన కాసేపటికే డ్రైవర్ కృష్ణ (56) గుండెపోటుకు గురై స్టీరింగ్‌పై కూలిపోయి ప్రాణం వదిలాడు. ఈ క్రమంలో అదుపు తప్పిన బస్సు అదృష్టవశాత్తు రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది.



అన్నారుగూడెంలో కాలిపోతున్న వరిగడ్డి

రైతు తప్పిదంతో రూ.15 లక్షల నష్టం

- వరిమొట్లకు నిప్పుతో 10.50 ఎకరాల్లో పంట దగ్ధం
- ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో ఘటన

తల్లాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక రైతు చేసిన తప్పిదం.. పొరుగు రైతులకు నష్టం మిగిల్చిన ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలో శనివారం చోటు చేసుకుంది. అన్నారుగూడెం-బిల్లుపాడు గ్రామాల మధ్య గల మాచవరం ఆనకట్ట సమీపంలో కొత్త వెంకటగిరి గ్రామ రైతు ఒకరు తాను పంట నూర్పిడి చేసిన వరిమొట్లు, వృథా గడ్డికి ఓ రైతు పెట్టిన నిప్పు.. గాలికెగసి పొరుగున ఉన్న ఆరెకరాల వరి పొలం, మరో నాలుగున్నర ఎకరాల జామాయిల్ తోట పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.15 లక్షల మేరకు నష్టం వాటిల్లింది. సదరు రైతు వరి మొట్లకు పెట్టిన నిప్పు రవ్వలు గాలికి వేగంగా వ్యాపించాయి. దాని పొరుగున అన్నారుగూడెం గ్రామ రైతులు దుగ్గినేని గోపయ్య (3 ఎకరాలు), దుగ్గినేని వెంకటేశ్వర్లు (3 ఎకరాలు) కోతకొచ్చిన వరి పొలం, కొత్త వెంకటగిరి వాసి దిరిశాల రాఘవయ్యకు చెందిన నాలుగున్నర ఎకరాల జామాయిల్ తోట.. 50 ఎకరాల్లో నూర్పిడి చేసిన వరి గడ్డి అగ్నికి ఆహుతైంది. ప్రమాద కారకుడైన రైతు నుంచి తమకు నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నేడు తేలికపాటి వర్షాలు

- మళ్లీ పంజా విసురుతున్న చలి పులి
- కోహీర్‌లో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆదివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 7.8, న్యాల్‌కల్‌లో 8.6, ఝరాసంగంలో 8.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.3, తిర్యాణిలో 9.1, ఆదిలాబాద్ జిల్లా భీంపుర్‌లో 9.2, వికారాబాద్ జిల్లా మర్పెల్లిలో 9.5, కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌లో 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇటు నగరవాసులను చలి వణికిస్తోంది. శివారు ప్రాంతాల్లో ప్రధాన రహదారులను మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి రామచంద్రాపురం, పటాన్‌చెరు ప్రాంతాల్లో 11.7 డిగ్రీలు, గ్రేటర్‌లో సాధారణం కంటే 3- 4 డిగ్రీల వరకు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి శేరిలింగంపల్లిలో 11.8, రాజేంద్రనగర్‌లో 12.8, సికింద్రాబాద్‌లో 13.2, గాజులరామారంలో 13.7, కుత్బుల్లాపూర్‌లో 14.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ముంచుకొస్తున్న 'దిత్వా'

తమిళనాడులోని 9 జిల్లాలకు రెడ్ అలర్ట్

- ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళలో నేడు, రేపు భారీ వర్షాలు
- చెన్నైలో కుండపోత.. 54 విమానాల రద్దు
- శ్రీలంకలో 'దిత్వా' విధ్వంసం.. 153మంది మృతి.. 191మంది గల్లంతు

చెన్నై/అమరావతి/విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన దిత్వా తుఫాన్ భారత్‌వైపు దూసుకొస్తోంది. తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో శ్రీలంకలో 153 మంది మరణించగా, మరో 191మంది గల్లంతయ్యారు. అనేక ఇళ్లు ధ్వంసమై వేల మంది నిరాశ్రయులయ్యారు. అనేకచోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. శ్రీలంక వ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 'దిత్వా' దూసుకొస్తుండటంతో తమిళనాడులోని 9 జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తుఫాన్ ఆదివారం ఉదయం చెన్నై తీరాన్ని సమీపిస్తుందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. శనివారం చెన్నై నుంచి వెళ్లాల్సిన 54 విమానాలు రద్దయ్యాయి. తమిళనాడు ప్రభుత్వం శనివారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించింది. తుఫాన్ ప్రభావంతో ఏపీలో శనివారం రాత్రి నుంచి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. రానున్న 48 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థలు ప్రకటించాయి. ఐఎండీ రెడ్ మెసేజ్ జారీ చేసింది. దిత్వా తుఫాన్ తీవ్ర వాయుగుండంగా మారి ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున తీరం దిశగా అలలు ఎగిసిపడుతున్నాయి. సోమవారం వరకూ మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. కృష్ణపట్నం పోర్టులో మూడు, మిగిలిన ఓడరేవుల్లో రెండో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. కాగా, దుబాయి నుంచి శ్రీలంక మీదుగా భారత్‌కు బయలుదేరిన సుమారు 300 మంది ప్రయాణికులు మూడు రోజులుగా కొలంబో విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. శ్రీలంకను ఆదుకునేందుకు భారత ప్రభుత్వం ఆపరేషన్ సాగర్ బంధు చేపట్టింది.



'దిత్వా' తుఫాన్ గమనం తెలిపే మ్యాప్

క్షుద్రపూజల పేరుతో నకిలీ బాబా ఘరానా మోసం

- దంపతులకు రూ. 3.50 కోట్ల మేర బురిడీ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

పెబ్బేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొందరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓ నకిలీ బాబా రెచ్చిపోయాడు. క్షుద్ర పూజలు చేస్తే ఆరోగ్యం బాగుపడుతుందని కట్టుకథలు చెప్పి వారి నుంచి కోట్ల రూపాయలు వసూలు చేశాడు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్, పద్మ దంపతులు కొన్నేళ్లుగా వనపర్తి జిల్లా పెబ్బేరులో హోటల్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం కుదుట పడాలంటే ఒక గురువు ఉన్నాడని, అతడికి దేవుడు పూనుతాడని తెలిసిన వారు చెప్పడంతో కర్నూల్ జిల్లా ఆదోని మండలం బైచిగేరిలోని దుర్గాసింగ్‌ను ఆశ్రయించారు. అతడు వారి ఇంట్లో అనేక క్షుద్రపూజలు చేశాడు. వారి పొలంలో బంగారు నిధి ఉందని మాయమాటలు చెప్పాడు. దానిని తీస్తేనే వారి ఆరోగ్యం బాగుంటుందని, లేదంటే వారు, వారి పిల్లలకు ప్రాణహాని పొంచి ఉందని బెదిరించి మొదట రూ. 80 లక్షలు కాజేశాడు. బాధితుల పొలంలో పూజలు చేసి మూడడుగుల అమ్మవారి విగ్రహాన్ని తీసి చూపించాడు. ఆ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే వారికి ప్రాణహాని ఉందని, దాన్ని అమ్మేస్తే రూ. కోట్లు వస్తాయని చెప్పాడు. అది కూడా ఢిల్లీలో అయితే ఇతర దేశస్థులు కొంటారని చెప్పి 5 సార్లు ఢిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విడతల వారీగా దాదాపు రూ. 3.50 కోట్ల వరకు ఆ దంపతుల నుంచి వసూలు చేశాడు. నకిలీ గురువు అని గ్రహించిన దంపతులు.. అనుమానం వచ్చి తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. అతడు డబ్బులు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. తమ గ్రామంలో అడుగుపెడితే చంపేస్తామని బెదిరించాడు. దీంతో తాము ఆదోని, పెబ్బేరు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని ఆశ్రయించారు. నకిలీ గురువును నమ్మి మోసపోయామని ఎమ్మెల్యేతో తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

దేశమనేది పాత మాట. విశ్వం అనేది నేటి మాట. విశ్వవిపణిలో మాయలఫకీరు చేతిలో పక్షి దేశమిపుడు. విశ్వవిపణికి విరుగుడు కావాలి తండ్రీ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని ఎవురి మీద కోపంతో అన్నావో గానీ, నీ మాట విని యెంత నష్టపోయామో గదా అని నొచ్చుకుంటన్నారు నేతలు.

ఇది దిద్దుబాటుకు వొల్లగాని దేశం బావూ!

నా చిన్నపుడు మా ఊరిలో ఎడ్ల పోతినాయుడు అనే పెద్దాయన ఉండేవాడు. నెత్తి మీద జుట్టు నుంచి మూతి మీద మీసం దాక తెల్లగా పండిపోయినాయి. మనిసీ తెల్లగా ఉండేవోడు. తెల్లటి లాల్చీ, పంచే కట్టుకునేవోడు. 'బాపనోళ్ళ ఇంటిల పుట్టవొలసినోడు, కాపోడి ఇంటిల పుట్టినాడు' అని మా ఊరి జెనాలు నొచ్చుకునేవోరు. పోతినాయుడు అదేటీ పట్టించుకునేవాడు కాదు, ఊరి జెనాలకి యేవేవో దిద్దుబాట్లు చెప్పేవాడు. మొగుడూ, పెళ్ళాలను జగడాలు ఆడొద్దని, వయసు మాయకు కుఱ్రకారుని లోబడొద్దని, రైతుల్ని పొలాలు వొదిలేసి, మార్కెట్లంట తిరగొద్దని, ఎవురికీ అపకారం సెయ్యొద్దని, కుదిరితే ఉపకారం సెయ్యమని... సుద్దులు సెప్పేవోడు. ఎందరు అతగాని సుద్దులు యిని, బతుకులు దిద్దుబాటులు చేసుకున్నారో నేను లెక్కెయ్యలేదు, అంత వొయసు కాదు నాది.

ఇపుడు మా ఊరిల పోతినాయుడు లేడు. చిన్న నాటి ఊరు మారిపోనాది. పూరిల్ల వాసాలు, ప్రహరీల గేట్లతోటి డాబాలయినాయి. కట్టు, బొట్టు మారింది. భూమ్మీద పంటకి ధర తగ్గి, భూమికి ధర పెరిగింది. ఊరి చుట్టూ, ఉరిలోకీ ఆఫీసులు, కంపెనీలు, కాన్వెంట్లు కొత్తవేవేవో రాక! ఉపిరి ఆడక ఎందరో ఎక్కడెక్కడికో వలస పోక! చెప్పొచ్చేదేటంటే- ఒక మారుమూల పల్లెలోని ప్రజలకే... జీవితానుభవం పండిన ఒక పెద్దమనిసి చెప్పిన దిద్దుబాటు సుద్దులు జీర్ణం కాకపోతే, లోకం మొత్తానికి దిద్దుబాటు సుద్దులు చెపితే జీర్ణమవుతాయా... అప్పారావు బావూ? పోతినాయుడు కంటే నీకు మీసాలు పెద్దవి ఉండొచ్చు. నువ్వు పెద్ద చదువులు చదివి ఉండొచ్చు. నువ్వు పెద్ద ఇంటిల పుట్టి ఉండొచ్చు. పెద్ద కోటల కొలువు చేసుండొచ్చు గానీ, గురువా గురజాడా! లోకం సేనా పెద్దది. నీ దిద్దుబాటు సుద్దులు దానికి అజీర్ణం.



తప్పుదోవల నడిచే పురుషుడ్ని నువ్వు దిద్దుబాటు చేసుకోమన్నావు. ఇపుడసలు రెండు దోవలు లేవు, ఉన్న దొకటే దోవ. అది తప్పుడు దోవ. ఆడోరిని అర్ధరేతిరి తిరగొద్దని, అందమైన బట్టేసుకోవొద్దని, వొంట గది దాటవొద్దని శాసిస్తున్నాడు. శాసనాలను దిద్దుబాటు కాదు, చెరిపేయాల. అప్పుడు గానీ నీ సుద్దులు అమలు కావు. 'మతములన్నియు మాసిపోవున్, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగున'ని అన్నావుగానీ, అగ్న్యానం రాజ్యమేలతాంది బావూ. ఒక ఊరిలోని దేవుని మాన్యానికీ, దద్దోజినం, పులిహోరలకే శరబయ్యలు, ఆచార్లూ అంతలేసి అగ్గిగుండాలు లేపారని రాసినావే... ఇపుడు దేశమంతా దేవుడి మాన్యమే. పీరుసాయిబులూ, నాంచారమ్మలూ నిప్పుల గుండం చేసారు దేశాన్ని. ఆ దేవుళ్ళని పీనుగులన్నావు గానీ ఇపుడు మనుషుల్ని పీనుగులు చేస్తన్నారు. తగలేసే దారి చెప్పు బావూ.

కళలు అన్నీ నేర్చుకొని దేశీ సరుకులు నింపమన్నావు... అన్ని కళలు నేర్చుకొని బతుకు లేక జెనం ఎన్నో దేశాల దిమ్మరులయితే, నేతలేమో విదేశీ సరుకులు నింపమని ప్రెపంచకమంతా తిరగతన్నారు. దేశమనేది పాత మాట. విశ్వం అనేది నేటి మాట. విశ్వవిపణిలో మాయలఫకీరు చేతిలో పక్షి దేశమిపుడు. విశ్వవిపణికి విరుగుడు కావాలి తండ్రీ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని ఎవురి మీద కోపంతో అన్నావో గానీ, నీ మాట విని యెంత నష్టపోయామో గదా అని నొచ్చుకుంటన్నారు నేతలు. కొండలు, కోనలు, అడవులు, పొలాలు, ఆటిలోని ఔషధాలు, పంటలు, గనులు, ఖనిజాలు... సముద్రాలు ఆటి జలాలు... ఇసక దానిలోని ఖనిజాల గురించి ఎందుకు చెప్పలేదని, అవేవీ ముఖ్యం కావని, మనుషులే ముఖ్యమని అన్నందుకు నువ్వు లేవుగానీ, ఇపుడు గానీ వుంటే రాజద్రోహం కాదు, దేశద్రోహం కేసు ఎదుదురు నేతలు. సౌజన్యారావు వకీలయినా నిన్ను కాపాడలేడు. తిండి తినమని, ఈసురోమని ఉండొద్దని ఎన్నెన్నో సుద్దులు చెప్పావు గానీ, దిద్దుబాటుకు వొల్లగాని దేశమిది. బుచ్చెమ్మను గిరీశాలు దేశదేశాలు తిప్పతన్నారు. సౌజన్యారావు చాలడు, మధురవాణి మంత్రాంగం చెల్లదు. గురజాడా- నీ పాత్ర లేవీ ఈ మాయను ఛేదించలేవు. నీ కలానికి అందని రైతులు, కూలీలు, కార్మికులు, ఆదివాసులు, దళితులూ కలగలసిన బహుజన ప్రస్థానం సాగాల, అది ఈ దేశాన్ని దిద్దుబాటు సెయ్యాల. ఏటంటావు అప్పారావు బావూ?

◆ **అట్టాడ అప్పల్నాయుడు**

(నేడు గురజాడ వర్ధంతి)

టెంబా టీమ్ : దక్షిణాఫ్రికా క్రికెట్‌కు జేజేలు



■ రామచంద్ర గుహ

నేను చదివిన అత్యుత్తమ స్పోర్ట్స్ పుస్తకాలలో ఒకటి జాన్ కార్లిన్ రాసిన 'ప్లేయింగ్ ది ఎనిమీ: నెల్సన్ మండేలా అండ్ ది గేమ్ దట్ మేడ్ ఎ నేషన్'. దక్షిణాఫ్రికా ఆతిథ్యమివ్వడంతో పాటు విజయం సాధించిన చరిత్రాత్మక 'రగ్బీ వరల్డ్ కప్–1995' గురించిన విపుల కథనమిది. రగ్బీ అనేది దక్షిణాఫ్రికాలో అమానుష జాతి వివక్షా వ్యవస్థకు కారకులైన జాత్యహంకార, ఆధిపత్యవాద ఆఫ్రికానర్ల(దక్షిణాఫ్రికాలో నివసించే డచ్ మూలాలున్న శ్వేతజాతి సమూహం) ఆట. మనకు నమ్మడానికి కష్టంగా అనిపించే ఓ వ్యక్తి, ఆ ఆటకు అభిమానిగా ఉన్నారు. ఆయన ఎవరో కాదు, నెల్సన్ మండేలా! ఆఫ్రికానర్ల వివక్షాపూరిత పాలనలో దశాబ్దాల పాటు జైలులో మగ్గిపోయిన మండేలా రగ్బీకి ఎలా అభిమాని అయ్యారనే విషయాన్ని కార్లిన్ చాలా సున్నితంగా వివరించారు. జైలు నుంచి విడుదలైన తరువాత దక్షిణాఫ్రికా అధ్యక్షుడుగా మండేలా ఎన్నికయ్యారు. దేశాధ్యక్షుడి హోదాలో ఆయన శ్వేతజాతీయుల ప్రాబల్యంలో ఉన్న రగ్బీ టీమ్‌కు అనధికారిక చిహ్నం (మస్కట్) అయ్యారు. టీమ్ కెప్టెన్ ఆఫ్రికానర్ అయిన ఫ్రాంకోయిస్ పియెనార్‌తో ఆయన ప్రత్యేక స్నేహ సంబంధాలు నెలకొల్పుకున్నారు.

కార్లిన్ పుస్తకం (దీని ఆధారంగా నిర్మించిన 'ఇన్విక్టస్' అనే ఫీచర్ ఫిల్మ్‌లో మండేలాగా మోర్గాన్ ఫ్రీమన్ నటించారు) రగ్బీ ఆటను దాని సామాజిక, రాజకీయ సందర్భంతో చక్కగా మేళవించింది. మహోన్నత దార్శనిక నేత అయిన నల్లజాతి రాజకీయవేత్త, పక్షపాత రహితంగా ఆలోచించే శ్వేతజాతి క్రీడాకారుల మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలు– గతంలో పరస్పర విరోధులుగా ఉన్న వేర్వేరు జాతి సమూహాలను ఎలా సమైక్యపరిచాయో సవివరంగా వెల్లడించింది. క్రికెట్ గ్రౌండ్స్‌లో అత్యంత పవిత్రమైనది, ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే 'లార్డ్స్'లో దక్షిణాఫ్రికా జట్టు ఈ ఏడాది 'వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్' (డబ్ల్యూటీసీ)ను గెలుచుకున్న సందర్భంలో కార్లిన్ పుస్తకాన్ని జ్ఞాపకం చేసుకున్నాను. ఈ క్రికెట్ విజయానికి 1995 నాటి రగ్బీ విజయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యం గానీ, సామాజిక ప్రభావం గానీ లేవు. ఇది పూర్తిగా క్రికెట్ విజయం. అయినప్పటికీ ఇది, జాతీయవాద ఆర్భాటాలు, ఉన్మాదాలు లేని క్రికెట్ ప్రేమికులకు ఎల్లెడలా ఎనలేని ఆనందోత్సాహాలను ఇచ్చింది. ఇందుకొక కారణమున్నది. తమను తాము క్రికెట్ ప్రపంచ గొప్ప అగ్రత్రయంగా భావించుకునే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్‌లు– దక్షిణాఫ్రికా క్రికెటర్లు అంతగా గౌరవించదగినవారు కాదని విశ్వసించడం కద్దు. ఈ మూడు దేశాలు వారికి రెండు లేదా మూడు టెస్ట్‌ల సిరీస్ కంటే ఎక్కువ ఇచ్చేవి కావు. దక్షిణాఫ్రికా తన డబ్ల్యూటీసీ విజయాన్ని డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆస్ట్రేలియాపై సాధించడం నన్ను ఎంతో ఉద్వేగపరిచింది. అందునా విజేత జట్టుకు నల్లజాతీయుడు అయిన టెంబా బవుమా నేతృత్వం వహించడం నాకు ప్రత్యేకంగా అమితానందాన్ని కల్పించింది. జట్టును విజయానికి నడిపించడంతో పాటు జాతిపరంగా వైవిధ్య నేపథ్యాలు ఉన్న 11 మంది ఆటగాళ్లు విజయానికి పోరాడేలా చేయడంలో బవుమా వ్యవహరించిన తీరు ప్రశంసార్హమైనది.

డబ్ల్యూటీసీ ఫైనల్‌ను దాదాపు పూర్తిగా టెలివిజన్‌లో వీక్షించాను. అది టెస్ట్ క్రికెట్ కావడం ఒక కారణమైతే, దక్షిణాఫ్రికా జటిల చరిత్రలో నాకు ఎంతో కాలంగా ఆసక్తి ఉండడం మరొక కారణం. ఎయిడెన్ మార్క్‌రమ్, టెంబా బవుమాలు తమ పరుగుల వేటను జయప్రదంగా పూర్తి చేయడాన్ని చూసిన తరువాత ఎంతో సంతృప్తితో ఆనందంతో భోంచేసి నిద్రపోయాను. ఆ మరుసటి ఉదయం నా ఫోన్‌పై వార్తలు చూసినప్పుడు క్రితం రాత్రి నేను పొందిన ఆనందోత్సాహాల అనుభూతులు ఒక్కసారిగా రోతపుట్టే తీరులో అణగారిపోయాయి.. సౌందర్యపరంగా, రాజకీయంగా అవి ఉల్లంఘనకు గురయ్యాయి. ఈ నా చేదు అనుభవాన్ని మరికొంచెం వివరిస్తాను. డబ్ల్యూటీసీ ఫైనల్‌ను గౌరవించే పేరిట అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక వీడియోను సామాజిక మాధ్యమాలలో పెట్టింది. అందులో ప్రధాన పాత్రలు వహించింది టెంబా, ఆయన సహచర ఆటగాళ్లు అనుకుంటున్నారా? కానే కాదు. మరి ఎవరో ఊహించగలరా? జై షా! అవును, ఐసీసీ అధ్యక్షుడు. 45 సెకన్ల ఆ వీడియోలో కన్పించే 23 షాట్‌లలో 11 పూర్తిగా షాను ఒక స్టార్‌గా చూపిస్తున్నవేనని ఒకరు లెక్క వేశారు. క్రికెట్ బ్యాట్‌ను ఎలా పట్టుకోవాలో లేదా 22 గజాల పిచ్‌పై ఎలా బౌలింగ్ చేయాలో జై మహాశయునికి తెలీదు. అయితే ఆయన ఐసీసీ అధ్యక్షుడు కదా. ప్రపంచ క్రికెట్‌ను సమర్థంగా నడిపిస్తున్నది బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి). మరి బీసీసీఐని (తద్వారా ఐసీసీని) అమోఘంగా నడిపిస్తున్నది భారతీయ జనతా పార్టీ. బీజేపీలో (ఆ కారణంగా భారత్‌లో) అత్యంత శక్తిమంతుడైన రెండవ వ్యక్తి జై షా తండ్రి.

బవుమా, మార్క్‌రమ్, రబాడ, మహరాజ్, తదితర దక్షిణాఫ్రికా జట్టు సభ్యుల విజయోత్సాహాన్ని ఒక భారతీయ రాజకీయవేత్త కుమారుడి వినయరాహిత్యం, మొరటుతనం, తనను తాను గొప్ప చేసుకునే స్వభావం భగ్నం చేసింది, భ్రష్టపరిచింది. జై షా తీరును అనేక మంది ఆక్షేపించారు. అయితే బీసీసీఐ పెత్తందారులు చాలా కాలంగా దక్షిణాఫ్రికా క్రికెటర్లను చులకనగా చూస్తున్న తీరుతెన్నులకు జై షా అభ్యంతరకర వ్యవహారం కేవలం పరాకాష్ఠ మాత్రమే అన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. దక్షిణాఫ్రికాలో ఇండియా 2012లో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆడవలసి ఉంది. వెస్టిండీస్‌తో ఒక సిరీస్‌ను హడావుడిగా ముంబైలో ఏర్పాటు చేశారు. కారణమేమిటి? సచిన్ టెండూల్కర్ తన 200వ టెస్ట్ మ్యాచ్‌ను ముంబైలో ఆడే వీలు కల్పించేందుకే. 2025 సంవత్సరాంతంలో కూడా మన దేశంలో పర్యటించిన దక్షిణాఫ్రికా జట్టుకు రెండే రెండు టెస్ట్‌ల సిరీస్ ఇచ్చారు. ఇది దక్షిణాఫ్రికా క్రికెటర్లను తక్కువగా చూడడమే కాదూ? రెండే రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆఫర్ చేసినా టెంబా, ఆయన సహచర ఆటగాళ్లు 'మేము వచ్చాము, మేము ఆడాము, మేము గెలిచాము' అన్న వీరోచిత రీతిలో విజయం సాధించారు. భారతీయ స్పిన్నర్స్‌కు తోడ్పడే విధంగా ఉండే కోల్‌కతా పిచ్‌పై దక్షిణాఫ్రికా ఆటగాళ్లు మన జట్టు కంటే మెరుగ్గా బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. ముఖ్యంగా కెప్టెన్ బవుమా తన శక్తియుక్తులు అన్నిటినీ వినియోగించి ఆడారు. గౌహతిలో ఆడిన రెండో టెస్ట్‌లో కూడా టెంబా, ఆయన సహచరులు దీటుగా ఆడారు. ముఖ్యంగా మార్కో యాన్సెన్ మన జట్టుపై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించారు.

అంతర్జాతీయ రగ్బీలో 1995 దక్షిణాఫ్రికా సంవత్సరమైతే అంతర్జాతీయ క్రికెట్‌లో 2025 దక్షిణాఫ్రికా సంవత్సరం, సందేహం లేదు. ఐదు రోజుల క్రికెట్ మ్యాచ్ చాలా కష్టమైన క్రీడ. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లు గెలవడమనేది టీ20, వన్‌డే, టెస్ట్ మ్యాచ్‌లలో గెలవడం కంటే గొప్ప క్రీడా విజయంగా పరిగణన పొందుతోంది. ఐసీసీ ట్రోఫీని గెలుచుకున్న దక్షిణాఫ్రికా క్రీడాకారులు మన దేశానికి వచ్చారు. మిగతా ప్రపంచం మొత్తం మీద కంటే అధిక క్రికెటర్లు, అత్యధిక క్రికెట్ అభిమానులు ఉన్న మన దేశంలో టీమ్ ఇండియాతో పోటీపడటమనేది ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి దేశాలకే చాలా కష్టంగా ఉంటుంది. అటువంటిది దక్షిణాఫ్రికా ఆటగాళ్లు చరిత్ర, పరిస్థితులను ధిక్కరిస్తూ రెండు టెస్టులలోను గొప్పగా ఆడి, మన జట్టును చిత్తుగా ఓడించారు.



ఈ అనూహ్య ఓటమి భారతీయ క్రికెట్ అభిమానులను ఎనలేని ఆందోళనకు గురి చేసింది. 'తమ పోటీదారుల కంటే తమకే బాగా తెలిసిన పిచ్‌పై మన జట్టు అంత ఘోరంగా ఎందుకు ఓడిపోయింది?' అని అసంఖ్యాక అభిమానులు మథనపడ్డారు. స్వదేశంలోని పిచ్‌లపై అసాధారణ రికార్డులను సాధించిన సర్ఫరాజ్ ఖాన్‌ను ఎందుకు టీమ్ ఇండియాలో చేర్చలేదు అని ఎంతోమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఉద్వాసన చెప్పనున్నారా అని కూడా చాలామంది ఊహాగానం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ల పట్ల మితిమీరిన మక్కువ మూలంగా టెస్ట్ క్రికెట్‌లో మనం సమర్థంగా పోటీపడలేకపోతున్నామా? అని మెరుగైన అవగాహన ఉన్న అభిమానులు ప్రశ్నించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్లకు బీసీసీఐ సరైన గుర్తింపు, సమున్నత గౌరవం ఇవ్వడంలో ఇప్పటికే క్షమార్హం కాని రీతిలో చాలా జాప్యం జరగలేదా? కోల్‌కతాలోనూ, గౌహతిలోనూ దక్షిణాఫ్రికా క్రికెటర్ల చేతుల్లో టీమ్ ఇండియా పరాజయం పాలయిన తీరుతెన్నుల దృష్ట్యా ఆ కఠిన ప్రశ్నను సైతం భారతీయ క్రికెట్ అభిమానులు అడిగి తీరాలి.

> *దక్షిణాఫ్రికా క్రికెటర్ల పట్ల గతంలో మన అహంకారపూరిత ప్రవర్తనకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. దక్షిణాఫ్రికాలో టీమిండియా నాలుగు లేదా ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడడమే ఆ ప్రాయశ్చిత్తానికి మంచి పద్ధతి అని నేను భావిస్తున్నాను. అది మన క్రీడా పాటవానికి నిజమైన పరీక్ష అవుతుంది. మనం ఎంతగానో మెచ్చుకుంటున్న, ఆరాధిస్తున్న ఆటగాళ్ల సామర్థ్యాల నిగ్గుతేల్చేందుకు అది మనకొక అవకాశమిస్తుంది.*

దక్షిణాఫ్రికా క్రికెటర్ల పట్ల గతంలో మన అహంకారపూరిత ప్రవర్తనకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. తగు సమయం ఆసన్నమైన వెంటనే దక్షిణాఫ్రికాలో టీమ్ ఇండియా నాలుగు లేదా ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడడమే ఆ ప్రాయశ్చిత్తానికి మంచి పద్ధతి అని నేను భావిస్తున్నాను. ఇది మన క్రీడా పాటవానికి నిజమైన పరీక్ష అవుతుంది. మనం ఎంతగానో మెచ్చుకుంటున్న, ఆరాధిస్తున్న ఆటగాళ్ల సామర్థ్యాల నిగ్గు తేల్చేందుకూ అది మనకొక అవకాశమిస్తుంది.

దక్షిణాఫ్రికాలో జాతివివక్షా పాలన ముగిసి, ప్రప్రథమ ప్రజాస్వామిక ఎన్నికలు జరిగిన వెన్వెంటనే ఆ దేశ రగ్బీ ఆటగాళ్లు సాధించిన విజయాలు పుస్తకం రూపేణా, ఒక అద్భుత సినిమాగాను క్రికెట్ అభిమానుల మనసుల్లో కలకాలం జ్ఞాపకముండేలా నిలిచిపోయాయి. మూడు దశాబ్దాల అనంతరం ఇప్పుడు ఒక 'ఇంద్రధనస్సు దేశం' (రెయిన్‌బో కంట్రీ)గా దక్షిణాఫ్రికా పట్ల శ్రద్ధాసక్తులు, ఆనందోత్సాహాలు చెప్పుకోదగ్గ విధంగా లేవు. అందునా నెల్సన్ మండేలా కీర్తిశేషుడయి కూడా చాలా కాలమయింది. 2025లో దక్షిణాఫ్రికా క్రికెటర్లు ఆడిన టెస్ట్ మ్యాచ్‌లపై టెంబా బవుమా ప్రధాన పాత్రగా ఒక ఫీచర్ ఫిల్మ్ రావడమనేది చాలా అసంభవం. అయితే యువతరానికి చెందిన దక్షిణాఫ్రికా రచయిత (లేదా యువ భారతీయ రచయిత) ఎవరైనా ఈ టెస్ట్ మ్యాచ్‌ల గురించి ఒక స్ఫూర్తిదాయక పుస్తకం రాయాలని ఆశిస్తున్నాను. ఒక కీలక విషయంలో 2025 క్రికెటర్లు 1995 నాటి రగ్బీ ఆటగాళ్ల కంటే మరింత ముఖ్యమైన విజయాన్ని సాధించారనే వాస్తవాన్ని ఆ సంభావ్య రచయిత తప్పక గుర్తిస్తాడని నేను భావిస్తున్నాను. 2025 దక్షిణాఫ్రికా క్రికెట్ టీమ్‌లో మూడు దశాబ్దాల నాటి రగ్బీ టీమ్‌లో కంటే జాతిపరమైన వైవిధ్యం మరింతగా ఉన్నదనేదే ఆ వాస్తవం. పైగా ఈ నిజమైన 'ఇంద్ర ధనస్సు జట్టు'ను నల్లజాతీయుడు అయిన కెప్టెన్ ప్రతిభావంతంగా విజయ శిఖరాలకు నడిపించాడు.

టెస్ట్ క్రికెట్ నా తరం వారు అభిమానించిన క్రికెట్ ఫార్మాట్. ఇప్పుడు నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. జాతీయవాద సంకుచితత్వాలు లేని క్రికెట్ అభిమానిగా టెంబా బవుమా జట్టును అభినందిస్తున్నాను. ఈ అభినందనలో భాగంగా జాతి వివక్షా పాలనానంతర దక్షిణాఫ్రికా క్రికెటర్లలో 11 మంది సార్వకాలిక అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాను ప్రతిపాదిస్తున్నాను: 1. గ్రేమ్ స్మిత్ 2. హెర్షల్ గిబ్స్ 3. హషీమ్ ఆమ్లా (వైస్ కెప్టెన్) 4. జాక్వెస్ కలిస్ 5. టెంబా బవుమా (కెప్టెన్) 6. ఏబీ డివిలీర్స్ (వికెట్ కీపర్) 7. షాన్ పొలాక్ 8. డేల్ స్టెయిన్ 9. కేశవ్ మహరాజ్ 10. కగిసో రబాడ 11. అలెన్ ఆంథోనీ డొనాల్డ్. 12వ ఆటగాడు: జాంటీ రోడ్స్

(వ్యాసకర్త చరిత్రకారుడు)

సమానత్వ కాంతులు పంచిన అగ్నిశిఖ

అంబేడ్కర్ ఆశయాలను ఆలంబనగా చేసుకొని, ఆఖరి శ్వాస వరకు ఆయన అడుగుజాడల్లో నడిచిన నిఖార్సైన అంబేడ్కరిస్ట్ ఈశ్వరీ బాయి. నింగిని తాకాలని నిరంతరం పోరాటం చేస్తూ అలసిపోని కెరటంలా, తెలుగు నేలపై సబ్బండ వర్గాల శ్రేయస్సు కోసం, అంటరాని తనాన్ని తరిమికొట్టి సమ సమాజాన్ని స్థాపించాలని తపించి అలుపెరుగని పోరాటం చేసిన నీలి పోరాట కెరటం ఈశ్వరీ బాయి. ఇంతులు తలుచుకుంటే ఇలలో సమానత్వ కాంతులు పంచవచ్చని నిరూపించిన అగ్నిశిఖ, కాంతి పుంజం ఈశ్వరీ బాయి. ఒంటరి మహిళగా తనకు ఏ అండ లేకున్నా అభాగ్యులకు అండగా నిలబడ్డ ధీర వనిత. తాడితులు, పీడితుల పక్షాన పోరాడే క్రమంలో అంబేడ్కరిజాన్ని దేహంలో అణువణువునా ఆవాహన చేసుకుని నిస్వార్థంగా, నిజాయితీగా, నిబద్ధతతో ఉంటే ఎవరెస్టు శిఖరమంత ఎత్తుకు ఎదగవచ్చని నిరూపించిన శీల శిఖరం. అసమానతలకు వ్యతిరేకంగా నేడు నడుస్తున్న పోరాటాలకు స్ఫూర్తి. సమసమాజ స్థాపన కోసం తపించే మనందరి ఆలోచనల్లో ఉదయించే రేపటి ఉషోదయం.

ఈశ్వరీ బాయి సికింద్రాబాద్‌లోని చిలకలగూడ ప్రాంతంలో మాల సామాజిక వర్గానికి చెందిన బల్లెపు బలరామస్వామి, రాములమ్మ దంపతులకు 1918 డిసెంబర్ 1న జన్మించారు. ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం అనంతరం అప్పటి సవర్ణ ధర్మం ప్రకారం ఆమెకు పదమూడవ ఏట పుణెకు చెందిన దంత వైద్యుడితో బాల్య వివాహం జరిపించారు. కూతురు (మాజీ మంత్రి గీతారెడ్డి) జన్మించాక భర్త అకాల మరణంతో ఆమె మళ్లీ సికింద్రాబాదుకి తిరిగి వచ్చారు.

ఆత్మాభిమానం, పట్టుదల, ధైర్య సాహసాలు కలిగిన ధీర వనిత ఈశ్వరీబాయి. సికింద్రాబాదులోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరి ఎవరి మీద ఆధారపడకుండా తన స్వంత కాళ్లపై నిలబడింది. ఆమె అందరిలా సాధారణ ఉద్యోగిగానే మిగిలిపోకుండా ఈ సవర్ణ హిందూ సమాజంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకున్న అంటరానితనం, బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి సాంఘిక దురాచారాలను కూకటి వేళ్ళతో పెకిలించాలనే దృఢ సంకల్పంతో సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. నాటి సమాజంలోని పురుషాధిపత్యాన్ని, స్త్రీని బానిసగా భావించే కఠోర నియమాలను, సంప్రదాయాలను ఆమె ధైర్యంగా ప్రతిఘటించేవారు. మహిళలు ఆత్మగౌరవంతో, స్వతంత్ర వ్యక్తిత్వంతో జీవిస్తూ సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని మహిళల్లో స్ఫూర్తిని నింపేవారు. ఆమె మహిళా, శిశు సంక్షేమ బోర్డుకు అధ్యక్షులుగా ఉన్నపుడు మహిళాభ్యుదయానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి వాటిని పటిష్ఠంగా అమలు జరిపారు. స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రానిదే, మనదేశం పురోగతి చెందదు అని ఆమె దృఢంగా విశ్వసించేవారు.

దళిత ఉద్యమ ధ్రువతార భాగ్యరెడ్డి వర్మ, హైదరాబాదు అంబేడ్కర్‌గా పేరుగాంచిన బి.ఎస్. వెంకటరావు, జె.హెచ్. సుబ్బయ్య, బత్తుల శ్యామ్సుందర్, అరిగె రామస్వామి వంటి వారి పోరాటాల వల్ల ప్రభావితమై ఉద్యమాల్లో ఉవ్వెత్తున పాల్గొనే వారు. ఆ క్రమంలో ఆమె అంబేడ్కర్ ఉపన్యాసాలు, ఆయన రాసిన పుస్తకాలు, రచనలు, పత్రికల్లో రాసే వ్యాసాలు, ప్రత్యక్షంగా చేసే పోరాటాలతో స్ఫూర్తి పొంది ఆయన అడుగుజాడల్లో నడవాలని నిశ్చయించుకున్నారు.



> **"న్యాయమైన సామాజిక వ్యవస్థను రూపొందించటానికి మనం జరుపుతున్న కృషిలో శ్రీమతి ఈశ్వరీబాయి జీవితం, ఆమె చేసిన సేవ మనకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి" అని పీవీ నరసింహారావు ఒక సందర్భంలో అన్నారు.**

ఒకవైపు సామాజిక ఉద్యమాల్లో చురుకుగా ఉంటూనే మరోవైపు అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా, రాజ్యాధికారమే సకల సమస్యలకు పరిష్కారం అని చెప్పిన ఆయన మాటల సారాన్ని తెలుసుకున్న ఈశ్వరీ బాయి రాజకీయ రంగప్రవేశం చేశారు. 1952లో ఇండిపెండెంటుగా హైదరాబాద్ నగర పురపాలక సంఘం సభ్యురాలుగా గెలుపొందడంతో మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానం తర్వాత కాలంలో గౌరవ మేజిస్ట్రేటుగా, రెండు సార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యురాలుగా, ప్రతిపక్ష నాయకురాలిగా వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో 1990వ సంవత్సరం వరకు అప్రతిహతంగా కొనసాగింది. దాదాపు నాలుగు దశాబ్దాల తన రాజకీయ ప్రయాణంలో అనేక ఒడిదుడుకులను ఎదురైనా మొక్కవోని ధైర్యంతో పేదల పక్షాన పోరాడింది.

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో ఆమె అలుపెరగకుండా ఉద్యమంలో పాల్గొన్నారు. చెన్నారెడ్డి నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితికి వైస్ ప్రెసిడెంటుగా వ్యవహరిస్తూ తెలంగాణ ప్రజానీకానికి వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను అధ్యయనం చేయడానికి తెలంగాణ పది జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రధాన నాయకత్వం మొత్తం జైలు పాలయినపుడు ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టిన నిజమైన తెలంగాణ తల్లి ఈశ్వరీ బాయి. ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని పోలీస్ లాఠీ దెబ్బలతో, తుపాకీ తూటాలతో అతి క్రూరంగా అణిచివేయడం అప్రజాస్వామికమని ఆంధ్ర పాలకులపై అసెంబ్లీ వేదికగా నిప్పులు చెరిగేవారు.

కృష్ణా జిల్లా కంచికచర్లలో దళిత పాలేరు కోటేసును కొంత మంది పెత్తందార్లు సజీవదహనం చేసిన సమయంలో ఆమె అసెంబ్లీలో స్పందించిన తీరు అనిర్వచనీయం. ఈ సంఘటనపై అసెంబ్లీలో ఆమె పట్టుబట్టి మరీ చర్చకు తీసుకొచ్చిన సందర్భంలో ఆనాటి వ్యవసాయ శాఖ మంత్రి తిమ్మారెడ్డి చర్చ మధ్యలో కలుగజేసుకొని "దొంగతనం చేస్తే కాల్చి చంపకుండా ముద్దు పెట్టుకుంటారా?" అని అనగానే "ఎవడురా ఆ కూత కూసినవాడు, దళితులు మీకు దొంగల్లా కనిపిస్తున్నారా! సాటి మనిషిని సజీవ దహనం చేస్తారా? దళితులను దొంగలు అంటే చెప్పుతో కొడతా" అని ఆయన మీదకి చెప్పు విసిరి తగిన సమాధానం చెప్పిన తీరు చారిత్రాత్మకమైనది. ఒక నిజమైన అంబేడ్కర్ వారసుడు/వారసురాలు చట్టసభల్లో అడుగు పెడితే ఎలా ఉంటుందో ఈ ఒక్క ఘటనతో అర్థం చేసుకోవచ్చు.

ఈశ్వరీ బాయి అంటే ఒక ఉద్యమం. ఆమె ఒక శక్తి పుంజం. నిత్య చైతన్య జ్యోతి. నిరుపేదల ప్రతినిధి. మర్రిచెన్నారెడ్డి, జలగం వెంగళరావు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు వారు ఆమె మాటకు ఎంతో విలువ ఇచ్చేవారు. షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తరగతుల ప్రజల అభివృద్ధికి తీసుకోవలసిన సత్వర చర్యల విషయంలో, ఆమె సూచనలు అభిప్రాయాలకు వారు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి, ఆ విధంగా బడ్జెటు రూపొందించేవారు. "న్యాయమైన సామాజిక వ్యవస్థను రూపొందించటానికి మనం జరుపుతున్న కృషిలో శ్రీమతి ఈశ్వరీబాయి జీవితం, ఆమె చేసిన సేవ మనకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి" అని పీవీ నరసింహారావు ఒక సందర్భంలో అన్నారు.

○ **డా. మంచాల లింగస్వామి**

చైర్మన్, మాల ప్రజాఫ్రంట్

(డిసెంబర్ 1 ఈశ్వరీ బాయి జయంతి)

'క్రీమీలేయర్' కుట్రని ఛేదిద్దాం..!

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ వర్తింపజేయాలనే అభిప్రాయాన్ని అదేపనిగా వ్యక్తపరుస్తున్నారు. గత ఏడాది దేవేందర్‌సింగ్ వర్సెస్ పంజాబ్ స్టేట్ గవర్నమెంటు కేసులో, ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ గవాయి ఎస్సీ, ఎస్టీ క్రీమీలేయర్ అమలు చేయాలని తీర్పు కూడా రాశారు. బీజేపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఎస్సీ, ఎస్టీలలో వర్గీకరణను అమలు చేయాలని, క్రీమీలేయర్ వద్దని విన్నవించారు. వర్గీకరణ అంశంలో క్రీమీలేయర్ అమలు కాదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. దీంతో, తీర్పులో క్రీమీలేయర్ అంశం మోదీ హామీతో కనుమరుగయింది. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు చేసిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో క్రీమీలేయర్ లేకుండా రెండు ప్రభుత్వాలు జాగ్రత్తపడ్డాయి. అయినా గవాయి పట్టువదలని విక్రమార్కుడిలాగా ప్రతివేదిక మీద క్రీమిలేయర్ మంత్రాన్ని జపిస్తున్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 ఏళ్ళ తరువాత కూడా ఎస్సీ, ఎస్టీ, ఇతర ఉన్నతోద్యోగుల కుమారులకు రిజర్వేషన్లు అవసరం లేదని, వారినీ ఒక వ్యవసాయ కూలీ కుమారుడినీ ఒకేలా చూడటం సమంజసం కాదని, తరతరాలుగా కొన్ని కుటుంబాలవారే రిజర్వేషన్ల ఫలాలను అనుభవిస్తున్నారని అభియోగాలు మోపుతున్నారు. భారత పౌరసమాజం, రిజర్వేషన్ల వ్యతిరేకులు ఈ అభియోగాలకు మూక మద్దతు ఇస్తున్నారు.



న్యాయమూర్తిగా విశేష అనుభవం ఉన్న జస్టిస్ గవాయికి 'క్రీమీలేయర్' విధానం అశాస్త్రీయం, రాజ్యాంగ వ్యతిరేకం అనే విషయం తెలియదనుకోవటం భ్రమ. 'కోర్టు ముందున్న పత్రాల ఆధారంగా మా తీర్పులు ఉంటాయి' అని చెప్పిన గవాయి, రాజ్యాంగ వ్యతిరేక క్రీమిలేయర్ గురించి ఎవరి ప్రయోజనాల కొరకు తన తీర్పులో రాశారు? ఇక్కడ ప్రామాణికం రాజ్యాంగ పత్రమా, స్వీయ అభిప్రాయమా? ఆలోచనలు, ఆశయాలు చెప్పటానికి పనికి వస్తాయి. వాస్తవ పరిస్థితులను అనుసరించే ఆచరణ ఉంటుంది. ఎస్సీ ఉద్యోగి తన సంతానాన్ని ఎలాంటి ప్రభుత్వ సహాయం లేకుండా తన జీతం డబ్బులతో చదివిస్తాడు. ఉద్యోగం లేని ఎస్సీ, ఎస్టీల సంతతికి ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఉచితవిద్య, హాస్టళ్ళు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు, పోటీపరీక్షలకు ఉచితశిక్షణ అందిస్తుంది. రాజ్యాంగంలోని 16వ అధికరణ భారత పౌరులందరకూ ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాలకు సమాన అవకాశాలు కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగానికి పోటీపడే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు విధిగా తమ సమూహంలో ప్రతిభను నిరూపించుకోవాల్సిందే. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమ సంతానాన్ని చదివించి పెళ్ళి చేసేంతవరకే పోషిస్తారు. వివాహం అనంతరం తన కుటుంబ భారం సదరు క్రీమిలేయర్ ఉద్యోగి కుమారుడే మోయాలి. తండ్రి 'క్రీమీలేయర్' అనే సాకుతో కుమారులకు జన్మతః లభించిన రిజర్వేషన్ హక్కును తొలగించటం సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ మూలసూత్రాలకు విరుద్ధం. క్రీమీలేయర్ ఐఏఎస్ అధికారులకు పదవీ విరమణ అనంతరం 80 వేల రూపాయల వరకూ పెన్షన్ లభిస్తుంది. క్రీమీలేయర్ కుమారులు రిజర్వేషన్ హక్కు కోల్పోయి, ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందే పరిస్థితి లేనప్పుడు వీరంతా 80 వేల పెన్షన్‌తో బతకటం సాధ్యమా?

ఈ ఏడాది మే నెలలో విడుదల చేసిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్' గణాంకాల ప్రకారం దేశంలో ఎస్సీ ఐఏఎస్ అధికారులు 7.65శాతం, ఎస్టీ అధికారులు 3.80శాతం మాత్రమే ఉన్నారు. సెక్రటరీ హోదాలో 4.9శాతం మాత్రమే కొనసాగుతున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల సంఖ్య 2 కోట్ల 15 లక్షలని గణాంకాలు తెలుపుతున్నాయి. దాని ప్రకారం ఎస్సీ ఉద్యోగులు 30 లక్షలమంది ఉండాలి. కానీ, 5 లక్షల 47 వేలమంది మాత్రమే ఉన్నారు. ఎస్సీల పట్ల పాలకవర్గాల వివక్షకు ఈ గణాంకాలు నిదర్శనం.

> **తండ్రి 'క్రీమీలేయర్' అనే సాకుతో సంతానానికి జన్మతః లభించిన రిజర్వేషన్ హక్కును తొలగించటం సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ మూలసూత్రాలకు విరుద్ధం.**

బీసీలలో మాదిరిగా ఎస్సీలలో కూడా ఎ, బి, సి, డి వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో సుప్రీంకోర్టు ఏకీభవించి తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేస్తున్నాయి. వర్గీకరణ వాదులు, వారి మద్దతుదారులు ఆశించినట్లుగా ఏ మేరకు అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయో భవిష్యత్ తెలుపుతుంది. అయితే బీసీలలో 1992 నుంచి వర్గీకరణ, క్రీమీలేయర్ అమలవుతోంది. అనధికారిక సమాచారం ప్రకారం కేంద్ర జాబితాలలో 2,639 బీసీ కులాలున్నాయి. వీటిలో కేవలం 40 కులాలు మొత్తం రిజర్వేషన్‌లో 50 శాతం అవకాశాలు దక్కించుకున్నాయి. 994 కులాలు ఒక్క ఉద్యోగాన్ని, ఒక్క విద్యాసీటునూ పొందలేదు. 1400 కులాలకు ఒక శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం లభించింది. ఎస్సీ కులాలలో కూడా వర్గీకరణ, క్రీమీలేయర్ అమలు వలన మరింత దిగజారుడు ఫలితాలు మాత్రమే లభిస్తాయి. షెడ్యూలు కులాల పురోగతి అడ్డుకోవడానికి, అందుతున్న ఆ అరకొర అవకాశాలు కూడా దక్కకుండా చేయడానికి పాలకవర్గాలు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అందులో భాగంగా 1965 లోకూర్ కమిటీ మొదలు, నేటి వరకూ ఎస్సీల రిజర్వేషన్లు విచ్ఛిన్నం చేయటానికి వివిధ రాష్ట్రాలలో 11 కమిషన్లు వేశారు. 1951లో చంపకమ్ దొరైరాజన్ కేసు నుంచి నేటి వరకు 28 కేసులు వ్యతిరేకంగా నడిచాయి. షెడ్యూల్డు కులాల ప్రజల, విద్య, ఉద్యోగ, సంక్షేమ, రక్షణ చట్టం, పదోన్నతులలో ఉన్న రాజ్యాంగ అవకాశాలను అణచివేయటానికి సహోదర భారతీయ హిందూ అగ్రకులాల వాళ్ళు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు అసలు రిజర్వేషన్లే ఉండకూడదనే ఆలోచన హిందూ పౌర సమాజంలో నెలకొంది. దానికి నాందీ ప్రస్తావనగా జస్టిస్ గవాయి తీర్పు వ్యాఖ్యలు పరిగణించవచ్చు. రానున్న కాలంలో రిజర్వేషన్ వ్యతిరేక వాదనలు మరింత విస్తృతమవుతాయి. ఎస్సీ, ఎస్టీలు తమ రాజ్యాంగ హక్కులు కాపాడుకోవడం కోసం, అంబేడ్కర్ బాటలో మరింత చైతన్యం, మరింత పోరాటం, మరింత ఐక్యతతో ముందుకు సాగాలి.

• **మల్లెల వెంకట్రావు**

వ్యవస్థాపకులు, మాల మహాసభ

కోచ్‌ఫ్యాక్టరీలో 200 రైళ్లకు ఆర్డర్లు

- జపాన్ నుంచి పరికరాల దిగుమతి
- మోడల్ రైలుకు అన్ని సిద్ధం
- తర్వాత అన్ని రకాల రెగ్యులర్ రైళ్ల ప్రొడక్షన్
- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్

6



కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఓరుగల్లుకు కొత్త వెలుగులు

- యూఐడీఎఫ్ పథకం ద్వారా రూ.412కోట్లు.. రామప్ప అభివృద్ధికి రూ.148కోట్లు
- పీఎం మిత్ర పథకం ద్వారా కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రూ.200కోట్లు
- ఇప్పటికే రూ.30కోట్లు విడుదల... మరో రూ.30కోట్లు ఇస్తాం
- భూమిని అప్పగిస్తే త్వరలోనే వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తాం
- తొలుత ఏటీఆర్ విమానాలు.. స్పందనను బట్టి పెద్ద విమానాలు
- వచ్చే ఏడాది కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభం
- స్థానికులకే ఉద్యోగావకాశాలు.. ఆర్ఎంయూతో వరంగల్‌కు కొత్త పరిశ్రమలు వచ్చే ఛాన్స్
- హైదరాబాద్‌ను మెగా నగరంగా మార్చారు.. మరి వరంగల్‌పై వివక్ష ఎందుకు?
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

స్మార్ట్ సిటీ, హృదయ్, హెరిటేజ్, అమృత్ పథకాలతో వరంగల్ నగరాభివృద్ధి

వరంగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓరుగల్లు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ నగరంలో శనివారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం హరిత హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీం (యూఐటీఎస్) కింద వరంగల్ నగరానికి రూ.412కోట్లు కేటాయించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా నగరంలో చేపట్టబోయే పనులపై అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. స్మార్ట్ సిటీ పథకం కింద రూ.274కోట్లతో రంగసముద్రం, చిన్నవడ్డేపల్లి చెరువుల వద్ద సుందరీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉందని, గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు. అలాగే పురాతన, చారిత్రాత్మక అలయాల అభివృద్ధి కోసం హృదయ్ పథకం కింద రూ.33కోట్లు కేటాయించామని, వీటితో ఘనపూర్ దేవాలయం, పద్మాక్షి ఆలయం, కాజీపేట దర్గాతో పాటు అనేక అలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. యునేస్కో గుర్తింపు పొందిన రామప్ప అలయ అభివృద్ధికి రూ.148కోట్లు కేటాయించామన్నారు. ప్రధాన ఆలయంతో పాటు చిన్నచిన్న ఆలయాలను పునరుద్ధరిస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అమృత్ పథకం కింద కాజీపేట రైల్వేస్టేషన్‌ను రూ.274కోట్లతో ఆధునీకరిస్తున్నామని వివరించారు. వరంగల్ కోట భూములు అక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే

(మిగతా 7వ పేజీలో)



వరంగల్ రైల్వే స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



హనుమకొండలో వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపం పనుల పురోగతిపై చర్చిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పరిశీలిస్తూ.. సూచనలిస్తూ.. సమీక్షిస్తూ..

నగరంలో 8గంటల పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

7

ముగిసిన తొలివిడత

నామినేషన్ల పర్వం

- చివరి రోజున పెద్దసంఖ్యలో దాఖలు
- మూడు మండలాల్లో తొలి ఘట్టం పూర్తి
- నేడు నామినేషన్ల వడపోత

హనుమకొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో మొదటి విడత సర్పంచ్, వార్డుమెంబర్ల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించారు. తొలిరోజు గురువారం భీమదేవరపల్లి మండలం సర్పంచ్ స్థానాలకు 30 నామినేషన్లు, వార్డు స్థానాలకు 22, ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 20, వార్డు స్థానాలకు 5 , కమలాపూర్ మండలంలో సర్పంచ్ 36, వార్డు స్థానాలకు 34 దాఖలయ్యాయి. రెండో రోజు శుక్రవారం భీమదేవరపల్లి మండలం సర్పంచ్ స్థానాలకు 37, వార్డు స్థానాలకు 100 నామినేషన్లు, ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 22 , వార్డు స్థానాలకు 53, కమలాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 25, వార్డు స్థానాలకు 77 నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్య లో నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు వచ్చిన వారి నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించినట్లు వెల్లడించారు. మూడోరోజు శనివారం చివరి రోజు కావడంతో భీమదేవరపల్లి మండలంలో 25 సర్పంచ్ స్థానాలకు 105, 232 వార్డు స్థానాలకు 447 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. అలాగే కమలాపూర్ మండలంలో 24 సర్పంచ్ స్థానాలకు 146 నామినేషన్లు, 246 వార్డు స్థానాలకు 625 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎల్కతుర్తి మండలంలో మొత్తం 20 సర్పంచ్ స్థానాలకు శనివారం 75 నామినేషన్లు, 103 వార్డు స్థానాలకు గాను శనివారం 389 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం నామినేషన్ల స్క్రుటినీ చేసి, చెల్లిన నామినేషన్లను ప్రదర్శిస్తారు. డిసెంబరు 3లోగా ఉపసంహరణలకు అవకాశం ఉంది.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — చివరి రోజు 29-11-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
భీమదేవరపల్లి	25	105 (172)	232	447 (569)
ఎల్కతుర్తి	20	75 (117)	103	389 (446)
కమలాపూర్	24	146 (188)	246	625 (736)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

రెండో విడతకు రంగం సిద్ధం

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు

8

తెగించి పోరాడిన వీరుడు కేసీఆర్

- ఆయన తెలంగాణ రాష్ట్ర కల సాకారం
- శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి
- నక్కలగుట్టలో కాళోజీ విగ్రహం వద్ద దీక్షా దివస్



దీక్షా దివస్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన సిరికొండ మధుసూదనాచారి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వీరుడు కేసీఆర్ అని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద శనివారం దీక్షా దివస్ వేడుకలు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ తల్లి, కాళోజీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ త్యాగం భవిష్యత్ తరాలకు తెలియ జేసేందుకు తెలంగాణ జాతి దీక్షా దివస్‌ను స్మృతి దినంగా జరుపుకోవాలని కోరారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన మహనీయుడు కేసీఆర్ అన్నారు. మాజీ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు నిచ్చారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమాజాన్ని అన్ని రకాల ఇబ్బందులకు గురి చేశారని, పరిపాలన విధ్వంసం జరిగిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని, సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ పోరాట స్ఫూర్తిని బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌బాబు, రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ కమిషన్ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు రిజ్వానా మసూద్, సోడా కిరణ్, అశోక్ యాదవ్, చెన్నం మధు, బోయినపల్లి రంజిత్‌రావు, ఇమ్మడి లోహిత, జోరిక రమేష్, పులి రజినీకాంత్, హరిరమాదేవి, మేడిపెల్లి శోభన్ బాబు, ఉడుతల సారంగపాణి, దూలం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవి జయరాజు

అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలి..

- ఆయన తెలంగాణ ఆత్మ
- యాది సభలో కవి గాయకుడు జయరాజు

కేయూ క్యాంపస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కవి అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇప్పించాలని వక్తలు కోరారు. కేయూ సెనెట్ హాల్‌లో శనివారం అందెశ్రీ యాదిసభ అభిమానులు, ప్రజా సంఘాల నేతల నేతృత్వంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కవి గాయకుడు జయరాజు, వీసీ ప్రతాప్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు చిర్రా రాజు, బి, సురేశ్‌లాల్, సంగంరెడ్డి పృథ్వీరాజ్, వీఎస్‌రెడ్డి, చారి, పొట్లపల్లి శ్రీనివాసరావు, తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య, అందెశ్రీ భార్య మల్లుబాయి, కుమారుడు సాయిదత్తు మాట్లాడారు. సభాధ్యక్షులుగా మాజీ ఎంపీసీతారాం నాయక్, రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ వ్యవహరించారు.ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మ అందెశ్రీ అందరి హృదయాల్లో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర గీత రచయితగా చిరస్మరణీయుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో చైతన్యం నింపాయని పేర్కొన్నారు. మహనీయులకు నెలవైన కేయూ గౌరవ డాక్టరేట్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆశుకవిగా, ప్రజాకవిగా ప్రజల నాలుకల్లో నిత్యం నిలిచే అందెశ్రీ ప్రజల హృదయాల్లో కొలువై ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో కేయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరాస్వామి, కాళోజీ పురస్కార గ్రహీత నెల్లుట్ల రమాదేవి, రాజ్ మహ్మద్, నలిగంటి చంద్ర మౌళి, ప్రొఫెసర్ వడ్డె రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సభలో అందెశ్రీకి పద్మశ్రీ అవార్డును ఇప్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

మహాజాతరలో మెరుగైన వైద్య సేవలు

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్

ములుగు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. మేడారం మహాజాతర సందర్భంగా చేపట్టాల్సిన వైద్య సేవలపై చర్చించారు. మహాజాతరలో మెరుగైన వైద్యసేవల కోసం వైద్యులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, ములుగు, భూపాలపల్లి జనరల్ హాస్పిటల్స్ నుంచి రప్పించి డిసెంబరు 25నుంచి ఫిబ్రవరి 10వరకు అందుబాటులో ఉంచుతామన్నారు. అదేవిధంగా ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 25నుంచి 31 వరకు రోజుకు మూడు క్యాంపులు, జనవరి 1నుంచి 18 వరకు రోజుకు 10, 19నుంచి 27 వరకు రోజుకు 20 క్యాంపులు, 28 నుంచి 31వరకు రోజుకు 72 క్యాంపులు, ఫిబ్రవరి 1నుంచి 10 వరకు జాతర అనంతర క్యాంపులు నిర్వహిస్తామని వివరించారు. ఈ వైద్యశిబిరాలలో 340 రకాల మందులు, సర్జికల్ పరికరాలను సమకూర్చుకుంటామని, దీంతోపాటు 108 అంబులెన్స్‌లు 19, బైక్ అంబులెన్స్ 40

(మిగతా 6వ పేజీలో)

పెగడపెల్లి పీఏసీఎస్‌పై విచారణ

- సొసైటీలో అక్రమాలపై సభ్యుల ఫిర్యాదు
- విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీంద్ర

9

హనుమకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెగడపెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)పై సహకార సంఘాల చట్టం సెక్షన్ 51 కింద విచారణ జరుపుతున్నామని జిల్లా సహకారాధికారి బి సంజీవ రెడ్డి తెలిపారు. పెగడపెల్లి పీఏసీఎస్‌లో సంఘ సభ్యులు (రైతులు) 8 మంది ఇచ్చిన విజ్ఞాపనను అనుసరించి గతంలో జరిగిన రుణమాఫీ విషయంలో అధిక వడ్డీ, సంఘ రైతులకు ఇచ్చిన రుణాలలో అవకతవకలు, సంఘంలో ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ ఫైల్ చేయకపోవడం తదితర విషయాలలో సమగ్ర విచారణ జరిపేందుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె రవీంద్రను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంజీవ రెడ్డి తెలిపారు.

వరంగల్‌కు వస్తే అమ్మవారిని దర్శించుకుంటా..

సినీ, బుల్లితెర నటుడు ప్రదీప్



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రదీప్ దంపతులు

వరంగల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన భద్రకాళి అమ్మవారిని వరంగల్‌కు వచ్చిన ప్రతీసారి దర్శించుకుంటానని సినీ, టీవీ నటుడు కొండిపర్తి ప్రదీప్ అన్నారు. శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి భద్రకాళి అమ్మవారి ఆలయానికి వచ్చి గణపతి దర్శనం అనంతరం భద్రకాళిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. మహాశక్తివంతురాలైన అమ్మవారి దర్శనంతో మనసుకు ఉల్లాసం కలుగుతుందని అన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎన్నికల అబ్జర్వర్



అమ్మవారికి మొక్కుతున్న ఎన్నికల అబ్జర్వర్ శివకుమార్ నాయుడు

రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి కె. శివకుమార్ నాయుడు శనివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు.

తరగతి గదులే ప్రయోగశాలలు కావాలి

● ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి ● తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో ముగిసిన సైన్స్‌ఫెయిర్



ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయికి అర్హత పొందిన విద్యార్థులు

కరీమాబాద్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తరగతి గదులే విద్యార్థులకు ప్రయోగశాలలు కావాలని ఆర్‌జేడీ సత్యనారాయ రెడ్డి అన్నారు. ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డులో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో మూడు రోజులుగా నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ శనివారం ముగిసింది. జిల్లాస్థాయి రాజ్య స్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్.బి.వి.పి) 2025-26, జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ మనాక్ అవార్డ్, ప్రాజెక్టుల ప్రదర్శన 2024-25ల సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రదర్శనల్లో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సృజనాత్మకత, శాస్త్రీయ మోడళ్లను ప్రదర్శించారు.

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్‌జేడీ) సత్యనారాయణ రెడ్డి హాజరై మాట్లాడారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. శాస్త్రీయ ఆలోచనలు ఉన్న విద్యార్థులు రానున్న తరానికి మార్గదర్శకులు అవుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి, సమస్యల పరిష్కారంలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమ కన్వీనర్, డీఈవో రంగయ్య నాయుడు ప్రసంగిస్తూ.. శాస్త్రీ య రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. గురువుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రతి భ కలిసినపుడే అద్భుత విజయాలు సాధ్యమవుతాయని అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తాయని అన్నారు. ప్రదర్శనలో ఉత్తమ ఎగ్జిబిట్లకు, ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందిన విద్యార్థుల పేర్లను ప్రకటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో జిల్లా స్థాయికి 164 ప్రాజెక్టులు రాగా వీటిలో 16 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఆర్‌బీవీపీ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఏడు టీమ్‌ల నుంచి జూనియర్, సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్లాస్టిక్‌ను నివారించడం ఎలా? అనే అంశంపై జరిగిన సెమినార్లో తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి మునజా హఫియా ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

చివరి రోజు ప్రదర్శనను 9వేల మంది విద్యార్థులు తిలకించారు.



ఆర్‌బీవీపీ సైన్స్ ఎగ్జిబిషన్లో రాష్ట్రస్థాయికి అర్హత పొందిన విద్యార్థులు

మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనను 19వేల మంది విద్యార్థులు సందర్శించారు. యూనివర్సిటీ, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థులు ప్రదర్శించిన విభిన్న ఎగ్జిబిట్లు ఆసక్తికరంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా జిల్లా సెక్టోరియల్ అధికారులు ఉండ్రాతి సుజన్ తేజ, డిసిఈబి సెక్రటరీ గారె కృష్ణమూర్తి, ఖిలావరంగల్ ఎంఈవో బి.ప్రసాద్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వంశీ, వరుణ్, రాహుల్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా రాష్ట్ర సలహాదారు కె.భూపాల్‌రావు, నాయకులు రామ్మూర్తి, వడుప్సా బాధ్యులు బిల్ల రవి, ఆడెపు శ్యామ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, 18 కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమ వాఖ్యాతగా టి.శ్రీధరాచార్యులు వ్యవహరించారు. ఈ ముగింపు కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి కె.అనన్య చేసిన శాస్త్రీయ నృత్యం, కొంకపాక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు చేసిన రఘుకుల తిలక రామ కోలాటాం, జల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థుల నృత్యం, తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల నృత్యాలు, సమ్మక్క, సారలమ్మ ద్విపాత్రాభినయం పలువురిని ఆకట్టుకున్నాయి.

మహాజాతరలో మెరుగైన వైద్య సేవలు

(5వ పేజీ తరువాయి)

ఉపయోగించుకుంటామని అన్నారు. ఫస్ట్ రిఫెరల్ సర్వీసుల కోసం తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, సెకండ్ రిఫెరల్ సేవల కోసం జీజీహెచ్ ఏటూరునాగారం, ములుగు ఆస్పత్రులు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని ఉపయోగించుకుంటామని అన్నారు. నిపుణులైన వైద్యులు, వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది, రాపిడ్ రెస్పాన్స్ టీంలు, సపోర్టింగ్ సిబ్బంది జాతరలో విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఔషధాల నిల్వలు, వ్యాధి పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతంపై కూడా దృష్టి పెడతామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, అప్పయ్య, సాంబశివరావు, మధుసూదన్, మల్లికార్జున్, రవిరాథోడ్, ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విపిన్‌కుమార్, క్రాంతి కుమార్, ప్రోగ్రాం అధికారులు పవన్‌కుమార్, శ్రీకాంత్, సిబ్బంది సంపత్, దుర్గారావు, ప్రసాద్, వెంకటపతిరాజు, వెంకటరెడ్డి, సురేష్ బాబు, భూపాల్‌రెడ్డి, పీహెచ్‌సీలు, ఆర్బీఎస్కే వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి

హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సందడిగా దివ్యాంగుల క్రీడా పోటీలు ప్రారంభం



జెండా ఊపి దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జేఎన్‌ఎస్‌లో ఒక్క రోజు పాటు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు సంకల్పసిద్ధులని వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఉత్సాహవంతులైన దివ్యాంగులకు తగు సహకారం అందించి ప్రోత్సహించాలని వెంకట్‌రెడ్డి సూచించారు.

జిల్లా సంక్షేమశాఖ అధికారి జయంతి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగ క్రీడాకారులను త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు క్యారమ్స్, పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, జావెలిన్‌త్రో, క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ కే. అనితారెడ్డి, హనుమకొండ సీడీపీవో ఎం. విశ్వజ, బాలల పరిరక్షణ అధికారి ఎస్. ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వో రవికృష్ణ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సుమలత, దివ్యాంగుల ప్రతినిధులు బిల్ల మహేందర్, గాడిపల్లి ప్రశాంత్, జిల్లా సంక్షేమశాఖ కార్యాలయ సిబ్బంది, టీటీడీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, మల్లికాంబ మనోవికాస కేంద్రం విద్యార్థులు, ప్రభుత్వ దివ్యాంగ బాలుర, బాలికల వసతి గృహం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కోచ్‌ఫ్యాక్టరీలో 200 రైళ్లకు ఆర్డర్లు

● జపాన్ నుంచి పరికరాల దిగుమతి ● మోడల్ రైలుకు అన్ని సిద్ధం

● తర్వాత అన్ని రకాల రెగ్యూలర్ రైళ్ల ప్రొడక్షన్ ● దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్



సీపీఆర్వో శ్రీధర్

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఆయోధ్యపురంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో 20 రైళ్లకు ఆర్డర్ ఇచ్చారని, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోచ్‌ఫ్యాక్టరీ సందర్శన అనంతరం సీపీఆర్వో ఎ.శ్రీధర్ మాట్లాడారు. ముందుగా మోడల్ రైలు ఇంజన్, రైలు బోగీలు తయారు చేసిన తర్వాత ఆ రైలును పట్టాలు ఎక్కించి అన్ని సరైనవిగా ఉన్నాయని తేల్చిన తర్వాతనే పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీలో ఒక్కో రైలుకు 16 కోచ్‌ల చొప్పున 200 రైళ్ల రేక్‌లను తయారు చేసేందుకు ఆర్డరు పొంది రైల్వే రేక్‌లను తయారుచేసేందుకు అన్ని ఏర్పాట్లు అయినట్లు తెలిపారు.

దేశవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో అన్ని వసతులతో అన్ని రకాల రైలు ఇంజన్‌లు, వందేభారత్, ఎంఎంటీఎస్ కోచ్‌లతోపాటు అన్ని రకాల కోచ్‌లను తయారుచేసేందుకు ఈ కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం జరిగినట్లు చెప్పారు. ఈ కోచ్‌ల, ఇంజన్ల తయారీకి జపాన్‌తోపాటు ఇతర దేశాలనుంచి పరికరాలను తెప్పిస్తున్నట్లు తెలిపారు. కోచ్‌లకు అవసరాలను అనుగుణంగా ప్రొడక్షన్ ఉంటుందని అన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల తుది గడువు 7

కేయూ క్యాంపస్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నేతృత్వంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువును డిసెంబరు 7 వరకు పొడిగించినట్లు క్రిస్టియన్‌కాలనీలో యూనిక్ హైస్కూల్ ఏ1 కోఆర్డినేటర్ సమీఉల్లబేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్లతో పాటు ఇతర వివరాలకు సెల్ 73961-35390 లో సంప్రదించాలని బేగ్ కోరారు. ఏలాంటి విద్యార్హతలు లేకున్నా టెన్త్, ఇంటర్ చదువుకునేందుకు అర్హులని పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో మృతి చెందిన సమ్మక్క, గేదె

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

మామునూరు,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ మండలం 43 డివిజన్ జక్కలొద్ది గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన పెండ్యాల సుంకమ్మ (58) పశువులను సాకుతూ ఇంటింటికీ పాలుపోసుకుంటూ జీవిస్తోంది. అయితే శుక్రవారం మేతకు వెళ్లిన తన 11 గేదెలలో ఒకటి రాకపోవడంతో దానికోసం అదే రోజు రాత్రి సమ్మక్క వెళ్లింది. ఈ క్రమంలో ఓ వెంచర్‌లో తెగిపడిన కరెంటు వైర్లు తగిలి ఆమెతో పాటు గేదె సైతం చనిపోయింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెకు భర్త, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మామునూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీర్లగడ్డ తండా ఏకగ్రీవం

సర్పంచ్‌గా పూర్ణిమ ఎన్నిక

హనుమకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డతండా గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గుగులోతు పూర్ణిమ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరు వార్డు సభ్యులు సైతం ఏకగ్రీవం అయ్యారు. వీర్లగడ్డతండా సర్పంచ్ స్థానం ఎస్టి మహిళకు రిజర్వు అయింది.

ఈ పంచాయతీలో సర్పంచ్ స్థానానికి పూర్ణిమ ఒక్కరే నామినేషన్ వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. దీనితో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు తెలిపారు. ఆరు వార్డు స్థానాలకు సైతం ఒక్కొక్క నామినేషనే పడింది. దీంతో ఇవి కూడా ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు. ఈ తండా పరిధిలో మొత్తం 519 ఓట్లు ఉన్నాయి. భీమదేవరపల్లి మండలం పరిధిలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీర్లగడ్డతండా ఒక్కటే ఏకగ్రీవం కాగా మిగతా 24 పంచాయతీలకు సర్పంచ్ పదవుల కోసం 172 మంది నామినేషన్లు వేశారు. అలాగే 232 వార్డు సభ్యులకు గాను 579 నామినేషన్లు పడ్డాయని ఎంపీడీవో వీరేశం తెలిపారు. పూర్ణిమ భర్త గుగులోతు రాజు గ్రామ కాంగ్రెస్ అధ్య క్షుడిగా పని చేస్తున్నారు. తన భార్యను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాజు ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. మొదటి విడత ఎన్నికల్లో హనుమకొండ జిల్లాలో ఏకగ్రీవం అయిన ఏకైక పంచాయతీ కూడా వీర్ల గడ్డతండా ఒక్కటే.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మేడారంలో వేగంగా విద్యుత్ సరఫరా పనులు

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్(హనుమకొండ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర కోసం వేగంగా విద్యుత్ పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే 20 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్ పనులు పూర్తి చేశామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఎస్‌ఏవోలతో శనివారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జాతర పరిసరాల్లో 50 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి, 7.5 కిలోమీటర్ల వరకు కవర్డ్ కండక్టర్ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. జంపన్న వాగు ఒడ్డున 3 టవర్ పోల్‌లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను సమ్మక్క సబ్‌స్టేషన్‌లో ఇన్‌స్టాల్ చేయబోతున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో వ్యవసాయ సర్వీసుల మంజూరు పెరగాలని సూచించారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ పనులపై సమీక్షిస్తూ దరఖాస్తు చేసుకున్న సర్వీసులు ఆలస్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు.

బ్రాడ్ బ్యాండ్ కేబుల్ ఆపరేటర్లతో సమీక్షలు నిర్వహించి నిరుపయోగంగా ఉన్న కేబుళ్లను తొలిగించాలని, గుత్తులుగా వైర్లు లేకుండా బంచింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ వి.మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి, సి. ప్రభాకర్, సీఈలు సదర్‌లాల్, కె, తిరు మల్‌రావు, కె. రాజు చౌహాన్, అశోక్, అన్నపూర్ణ, సురేందర్, శ్రవణ్‌కుమార్, జయవంత్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల ఏకగ్రీవాలు

● రామోజీ కుమ్మరిగూడెం తండాలో సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవ తీర్మానం ● అదే బాటలో చంద్రుతండా



భూక్యా సుశీల



భూక్యా తిరుపతి

వర్ధన్నపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు దాదాపు ఏకగ్రీవంగా జరిగినట్లుగా భావిస్తున్నారు. దీనికి ఉదాహరణగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సైతం ఏకగ్రీవమైన తండాల నాయకులను అభినందించారు. రామోజీ తండాలో 8 వార్డులకు గాను, 664 ఓటర్లు ఉండగా, అందులో 337 మంది పురుషులు, 327 మంది మహిళలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి భూక్యా సుశీల శంకర్ సర్పంచ్ బరిలో నిలిచారు. ఇక 8 వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్కరు నామినేషన్లు వేశారు. దీంతో ఏకగ్రీవం అనివార్యంగా మారింది. డిసెంబరు 3 తర్వాత ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించడమే తరువాయి. ఇక చంద్రుతండా గ్రామపంచాయతీ సైతం ఇదే బాటలో నడిచింది. ఇక్కడ కూడా 8 వార్డులు ఉండగా, 469 మంది ఓటర్లకు పురుషులు 228, స్త్రీలు 241 మంది ఉన్నారు. ఇక్కడ భూక్యా నీల రవి సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేసింది. తమ కుటుంబం నుంచే భూక్యా నముకు జమ్ములాల్‌తో రెండో సెట్ వేయించారు. ఇక్కడ సైతం 8 వార్డులకు ఒక్కో నామినేషనే పడగా, ఐదో వార్డుకు మాత్రం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

అభివృద్ధి కోసం రూ.8 లక్షలు?

ఏకగ్రీవమైన రెండు తండాలు రూ.8 లక్షల వరకు సర్పంచ్ స్థానం కైవసం చేసుకున్న వారు ఇచ్చేలా ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. రామోజీ కుమ్మరిగూడెం తండాలో ఒక అడుగు ముందుకు వేసి సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాగా, ఉపసర్పంచ్ భూక్యా తిరుపతి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఉండేలా చూసుకున్నారు. దీనికి గాను ఉపసర్పంచ్ సైతం రూ.3 లక్షల వరకు ఇవ్వాలని విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా వార్డు స్థానాల్లో 2 కాంగ్రెస్‌కు, 6 బీఆర్‌ఎస్ పార్టీకి ఇచ్చారు. చంద్రుతండాలో సైతం సర్పంచ్ స్థానం రూ.8 లక్షలకు పలికింది. ఇక్కడ కూడా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వార్డు సభ్యుడిగా ఉన్న మాలోతు నెహ్రూనాను ఎన్నుకున్నట్లు తెలుస్తోంది.

కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం

గిర్మాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి శనివారం నగర పర్యటనలో భాగంగా ఆయన సికింద్రాబాద్ నుంచి వందే భారత్ రైలులో ఉదయం 6.57 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. మాజీ ఎంపీలు అరూరి రమేష్, సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, పార్టీ నేతలు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రఘునాథరెడ్డిలతో కలిసి బీజేపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ కిషన్‌రెడ్డికి సాదర స్వాగతం పలికారు. అదేవిధంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, రెవెన్యూ అధికారి విజయలక్ష్మి కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ నాయకులకు కాఫీ తాగించి ఉత్సాహపరిచారు. అందరి బిల్లు రూ.500 తనే ఫోన్‌పే చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆటో స్టాండ్‌కు పీ జు లేకుండా అనుమతించాలని, ర్యాపిడో తదితర సంస్థల ప్రవేశం లేకుండా చూడాలని కోరుతూ ఆటోయూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే ప్రస్తుతం కాజీపేట నుంచి హైదరాబాద్‌కు నడుస్తున్న పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. రైల్వేస్టేషన్‌లోని ప్రభుత్వ రైల్వేపోలీస్‌స్టేషన్ (జీఆర్‌పీ) భవనం పూర్తిగా శిథిలమైందని, దాన్ని పునర్‌నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌ఎంయూ పనులపై ఆరా

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట సమీపంలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చర్ యూనిట్ (ఆర్‌ఎంయూ)ను శనివారం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సందర్శించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీఆర్‌ఎం ఆర్.గోపాలకృష్ణన్, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, వీవీ సాయిప్రసాద్‌తో కలిసి నిర్మాణంలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీని సందర్శించారు. కొనసాగుతున్న నిర్మాణ పనులను, పురోగతిని ఆయన సమీక్షించారు. ప్రధాన షెడ్‌లు టెస్ట్ షాప్, పేయింట్ షాప్, స్టోర్ వార్డ్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, రెస్ట్ హౌస్, సెక్యూరిటీ, టాయిలెట్‌బ్లాక్, కాంపౌండ్‌వాల్, ఆర్‌యూబీ, ఇంటర్నల్ రైల్వే ట్రాక్, రోడ్లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, క్యాంటీన్‌ల నిర్మాణం ప్రదేశాలను పరిశీలించారు.

ఏయే షెడ్లలో ఎలాంటి బోగీలను తయారు చేశారు.. ఒక రైలు బోగీని తయారు చేయడానికి ఎన్నిరోజుల సమయం పడుతుందనే విషయాలను రైల్వే జీఎంను అడిగి తెలుసుకున్నారు. సుమారు అరగంట పాటు అన్ని షెడ్లను పరిశీలించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే మంత్రివెంట మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు ఎం. ధర్మారావు, అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, బీజేపీ నేత రావు పద్మ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బిజయ్ కుమార్‌రత్ తోపాటు రైల్వే అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలు ఉన్నారు..

వినతుల వెల్లువ

కోచ్‌ఫ్యాక్టరీ భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ భూ నిర్వాసితులు, అయోధ్యపురం రైతులు, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో నూతనంగా స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, ఏసీ కమ్యూనిటీ హాల్, ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తున్న బాయ్స్‌కు కోచ్‌ఫ్యాక్టరీలో పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలని టీ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ డి.రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు బృందం కేంద్ర మంత్రికిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్‌లు అనిత రంజిత్ రావు, చాడ స్వాతి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజ్ కుమార్, 62వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మేకల శ్రవణ్,లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బొకే ఇచ్చి, శాలువా కప్పి అభినందించారు.



కాజీపేటలో ఆర్‌ఎంయూను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

కల్యాణ మండప పనుల్లో ఎందుకు అశ్రద్ధ ?

» పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
» రుద్రేశ్వరుడి సన్నిధిలో గంటకు పైగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
» ఆలయంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఈవో వినతి



కల్యాణ మండప పనులను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండప పనుల్లో ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని సంబంధిత ఆర్కియాలజీ సిబ్బందిని కేంద్ర పురావస్తు, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. కల్యాణ మండప పనులను ఆరు నెలల క్రితమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినా ఇంకా అరకొర మిగిలి ఉన్న ఐదుశాతం పనులపై ఎందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. దీనిపై వెంటనే పూర్తి నివేదిక ఇవ్వాలని కేంద్ర మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రామప్ప ఆలయానికి ప్రసాద్ పథకం కింద రూ. 72 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని ఆ పనులు కూడా నత్తనడకగానే జరుగుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ఈ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తారని ఇంకా జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధుల కొరత లేదని గార్డెనింగ్, సెంట్రల్ లైటింగ్, వాకింగ్‌ప్లాట్‌ఫాం లాంటివి కల్పిస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతకుముందు వేయిస్తంభాల ఈవో అనిల్‌కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆలయ అభివృద్ధి కోసం మంత్రికి ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో..

వరంగల్ పర్యటన సందర్భంగా శనివారం ఉదయం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్, డిప్యూటీ ఇంజనీర్ ఆర్కియాలజీ కృష్ణ చైతన్య, వరంగల్ ఉమ్మడి జిల్లా అధికారి అజిత్, ఇంటాక్‌కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావులో కలిసి ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని అంత నిశితంగా పరిశీలించారు. నందిశ్వరుడి వద్ద, శిల్పకళను మెచ్చుకుంటూ ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ నాట్య మండపంలో కిషన్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు బహూకరించారు.

అమ్మవారి దర్శనం ఆనందదాయకం

వరంగల్ కల్చరల్: భద్రకాళి అమ్మవారి పాదల చెంతన ఉండి దర్శించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ వరంగల్ పర్యటనకు వచ్చిన ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలోని ఈవో సునీత, ధర్మకర్తలు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గోవులకు గ్రోసానం చేసి వల్లభ గణపతి, ఆదిశంకరాచార్యులను దర్శించుకొని అనంతరం అమ్మవారి గర్భగుడిలో పూజలు చేశారు. అనంతరం వారికి అమ్మవారి శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి రామేశ్వర్‌రావు, నార్ల సుగుణ, జారతి వెంకటేశ్వర్లు, తొనుపునూరి వీరన్న, బింగి సతీష్, అనంతుల శ్రీనివాస్, మూగ శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్, డాక్టర్ కాళీప్రసాద్, అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు, ప్రొఫెసర్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని భద్రకాళి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తదితరులు

పరిశీలిస్తూ.. సూచనలిస్తూ..

● నగరంలో 8 గంటల పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన
● కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలన

వరంగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నగరంలో సుమారు ఎనిమిది గంటల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ గడిపారు. శనివారం ఉదయం 5గంటలకు హైదరాబాద్ నుంచి వందేభారత్ రైలులో బయలుదేరి, వరంగల్‌కు ఉదయం 6.30గంటలకు చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో అధికారులు స్వాగతం పలికారు. ఇటీవలే అమృత్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించారు. రైల్వే అధికారులు మంత్రికి రైల్వేస్టేషన్ గురించి, సౌకర్యాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పుష్‌పుల్ రైల్‌ను పునరుద్ధరించాలని, సామాన్య ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని వివరిస్తూ వినతి పత్రాన్ని అందించారు. అనంతరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన మంత్రి.. అక్కడ ఉన్న ప్రయాణీకులతో టీ తాగుతూ చాయ్ పే చర్చ పెట్టారు. రైల్వే స్టేషన్‌లో అందుతున్న సేవలపై చర్చించారు. అక్కడి నుంచి ఉదయం 8.15గంటలకు భద్రకాళి ఆలయానికి మంత్రి చేరుకున్నారు. కిషన్‌రెడ్డికి పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్కడి నుంచి ఉదయం 9.10గంటలకు వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండపం పనులు పరిశీలించారు. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. రుద్రేశ్వరుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 11గంటలకు వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, హృదయ్, హెరిటేజ్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు పలువురు ఇంజనీర్లు, కూడా అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 1గంటకు కాజీపేటలోని రైల్వే మ్యానుఫక్చరింగ్ యూనిట్‌ను సందర్శించారు. రూ.521కోట్లతో జరుగుతున్న పనులను అధికారులతో సమీక్షించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ.సాయి ప్రసాద్‌లు ఆర్‌ఎంయూ పురోగతిపై వివరించారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు హరిత హోటల్‌లో జాతీయ రహదారులు, సీసీఐ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం 4.25గంటలకు మీడియాతో మాట్లాడిన తనంతరం కార్యకర్తలు, వివిధ వర్గాల నుంచి వినతులను స్వీకరించారు. సాయంత్రం 5.10గంటలకు రోడ్డు మార్గాన కిషన్‌రెడ్డి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

స్మార్ట్ సిటీ పనులు త్వరగా పూర్తి చేయండి

» టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ప్రధానిని తీసుకొస్తా
» అధికారులతో సమీక్షలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుతం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందని, డిసెంబరు చివరి వరకు స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలో పర్యటన సందర్భంగా మనుమకొండ నక్కగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, సంతోష్‌రెడ్డితో పాటు కుడా, కార్పొరేషన్, ఆర్కియాలజీ, స్మార్ట్‌సిటీ అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కుడా, గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ అగ్గలయ్యగుట్టపై జైనహిల్స్, పద్మాక్షి గుట్టల అభివృద్ధికి తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేసిన కాలంలో ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయ్యాని కమిషనర్ చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఇంకా నగరంలోని వేయి స్తంభాల దేవాలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని, మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వరంగల్ కోటలోని శృంగార బావిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏఎస్ఐ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పినట్టు అధికారులు తెలిపారు. ఖిలావరంగల్ కోట బయట, లోపలి ప్రాంతంలో భూములు కబ్జాకు గురవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, చారిత్రక సంపదను కాపాడుకోవాలని అధికారులకు గుర్తు చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు త్వరగా విడుదల చేయడంతో పాటు ఇంకా మరిన్ని నిధులు మంజూరు చేయాలని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరడంతో తప్పకుండా సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

అస్కీ స్కీం ద్వారా నగరాన్ని అభివృద్ధి చేయవచ్చని దీనిపై కేంద్రంతో మాట్లాడుతానని కిషన్‌రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ పనులను త్వరగా పూర్తి చేస్తే ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని మోదీని ముఖ్య అతిథిగా తీసుకుని వస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇస్తున్నట్టు చెప్పారు. కుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీపీవో అజీత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు గుజ్జుల వసంత, చాట స్వాతి, డీఆర్‌వో విజయలక్ష్మి, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా పర్యటక శాఖ అధికారి శివాజీతో పాటు ఆర్కియాలజీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఓరుగల్లుకు కొత్త వెలుగులు

(5వ పేజీ తరువాయి)

వరంగల్ కోట భూములను అక్రమణ నుంచి కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ఆర్కియాలాజి అధికారులు విజ్ఞప్తి చేసిన లాభం లేదని, తానే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సీఎస్‌కు లేఖ రాస్తానని తెలిపారు. వెయ్యిస్థంబాల ఆలయ కల్యాణ మండపాన్ని పూర్తి స్థాయిలో నిర్మాణం చేశామన్నారు.

త్వరలోనే ఎయిర్‌పోర్టు, ఆర్‌ఎంయూ

వరంగల్ ఎయిర్‌పోర్టును త్వరలోనే అందుబాటులోకి తీసుకవస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఏఏఐ వద్ద 696ఎకరాల భూమి అందుబాటులో ఉందని, ఇంకా 280ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఈ భూమిని ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తే పనులు మొదలవుతాయన్నారు. ఇప్పటికే ఎయిర్‌పోర్టు ప్రహరి నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ నుంచి తొలుత ఏటీఆర్ విమానాలను నడుపుతామన్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, షిరిడి, నాగ్‌పూర్ వరకు నడిపిస్తామని, ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి పెద్ద విమానాలను కూడా నడిప్తామన్నారు. పెద్ద విమానాలు ల్యాండ్ అయ్యే విధంగానే రన్‌వే నిర్మాణం జరుగుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

అలాగే కాజీపేటలో 160 ఎకరాల్లో నిర్మిస్తున్న రైల్వే మ్యాన్‌ఫక్చరింగ్ యూనిట్ (ఆర్‌ఎంయూ)ను వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామన్నారు. తొలి విడత రూ.521కోట్ల ఆర్‌ఎంయూ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 75శాతం పనులు పూర్తయ్యాయని, స్ట్రక్చర్ నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయని, ఎక్విప్‌మెంట్ తీసుకవస్తున్నామని తెలిపారు. ఆధునీక టెక్నాలజీతో ఆర్‌ఎంయూ నిర్మిస్తున్నామని, దేశానికి ఇది తలమానికంగా ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి దేశంలోని నలుమూలలకు రైళ్ల కనెక్టివిటీ ఉంటుందన్నారు. విద్యుత్ ఆదా కోసం సోలార్ సిస్టాన్ని అమలు చేస్తున్నామని, వర్షం నీటిని వృధాగా వెళ్లకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ రహదారుల నిర్మాణం

వరంగల్‌ను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1.26లక్షల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతుండగా, మరో రూ.80వేల కోట్లకు సంబంధించి టెండర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. వీటిలో రూ.730కోట్లతో వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. అలాగే వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారికి రూ.2,480తో పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే తొలివిడత రూ.1,650కోట్లతో 80శాతం పనులు పూర్తి చేశామని, త్వరలోనే మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. వరంగల్ రింగ్‌రోడ్డలో 50శాతం జాతీయ రహదారి కింద రూ.500కోట్లతో పూర్తి చేశామని తెలిపారు. మిగతా 50శాతం పనులు ఎన్‌హెచ్ ద్వారా చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి తెలిపారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుకు రూ. 300 కోట్లు

వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పీఎం మిత్ర పథకం ద్వారా దేశంలో ఏడు టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేస్తే.. అందులో తెలంగాణ నుంచి వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఏడింట్లో ఆరు గ్రీన్‌ఫీల్డ్ పార్కులు కాగా, వరంగల్ మాత్రం బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి చేయటంతో పాటు మూడు కంపెనీలు కూడా వచ్చాయన్నారు. ఇంకా 30శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. మరిన్ని కొత్త కంపెనీలు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.30కోట్ల నిధులు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.30కోట్ల నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. కైటెక్స్ కంపెనీ రూ.1,700కోట్ల వ్యయంతో టీ షర్టుల ఉత్పత్తి చేపట్టిందని, ఈ కంపెనీ పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభిస్తే 12,500మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎవర్‌టాప్ టెక్స్ అనే కంపెనీ కోరియాకు చెందిన యంగ్‌వన్‌తో కలిసి రూ.1,100కోట్ల పెట్టుబడి పెట్టిందని, ఈ కంపెనీ ద్వారా 11వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే కేరళకు చెందిన గణేషా కంపెనీ కూడా రూ.11వేల పెట్టుబడిలు పెట్టిందన్నారు. ఇంకా కొత్తగా మరికొన్ని కంపెనీలు రానున్నాయని అన్నారు. ఈ పార్కులో మౌళిక సదుపాయలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భూమి పూజ చేయిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

వరంగల్‌పై వివక్ష

చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగరంపై వివక్ష చూపుతున్నా రని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేశారని, కానీ హైదరాబాద్‌లో మాత్రం మరిన్ని నగరాలను కలుపుతారా అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. వరంగల్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపిస్తుందనటానికి ఇంతకంటే ఏం నిదర్శనం కావాలని ప్రశ్నించారు.

ఏప్రిల్ వరకు పత్తి కొంటాం

దేశంలో అత్యధికంగా తెలంగాణ నుంచే గత ఏడాది 41లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేశామని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈఏడాది కూడా ఇప్పటి వరకు అత్యధికంగా తెలంగాణ నుంచే కొనుగోలు చేస్తున్నామన్నారు. గత ఏడాది 110 కొనుగోలు కేంద్రాలు ఉంటే, ఈసారి 123కు పెంచామన్నారు. తెలంగాణ రైతుల నుంచి పత్తి కొనుగోలు కోసం రూ.60వేల కోట్ల ఎంఎస్‌పీ చెల్లించామని తెలిపారు. ఏడు క్వింటాల్ కంటే ఎక్కువ దిగుబడి వస్తే, సంబంధిత మండల వ్యవసాయ అధికారితో ధృవీకరణ పత్రం తీసుకుంటే సరిపోతుందన్నారు. రైతులు సీసీఐ నిబంధనల ప్రకారమే పత్తిని తేమ లేకుండా తీసుకవస్తున్నారని అన్నారు. మార్చి, ఏప్రిల్ వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని పత్తిని విక్రయించాలని మంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

కార్యక్రమాల్లో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ.సాయి ప్రసాద్, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు సంతోష్, గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రావు పద్మ, డాక్టర్ కాళీ ప్రసాద్, సమ్మిరెడ్డి, జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు డిపాజిట్ ఎందుకంటే..

ఆరో వంతు ఓట్లు వస్తేనే సొమ్ము దక్కుతుంది

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీతో సహా ఏ ఇతర ఎన్నికలైనా నామినేషన్ వేసే అభ్యర్థి దరఖాస్తుతో పాటు డిపాజిట్ రూపంలో కొంత నగదును చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో అస్తవ్యస్తంగా అధిక మంది పోటీ చేసేందుకు రాకుండా చిత్తశుద్ధితో ఉన్న నిజమైన అభ్యర్థులే ఉండాలనే ఉద్దేశంతో డిపాజిట్ నిబంధనను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ లేదా నామినేషన్ ఫీజును సాధారణ భాషలో 'డిపాజిట్' అని పిలుస్తారు. సర్పంచ్ స్థానానికి పోటీచేసే ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ అభ్యర్థులైతే రూ.1000, జనరల్ అభ్యర్థి అయితే రూ.2000 చెల్లించాల్సిఉంటుంది. వార్డు సభ్యుని స్థానానికి ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ అభ్యర్థులు రూ.250, జనరల్ అభ్యర్థులు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ దక్కితేనే పోటీ చేసి పరువు నిలబెట్టుకున్నట్లుగా గ్రామాల్లో భావిస్తారు. ఈ కారణంగానే అసలైన అభ్యర్థులే ఎన్నికల్లో పోటీకి నిల్చునేందుకు ముందుకు వస్తుంటారు.

డిపాజిట్ తిరిగి పొందాలంటే..

నామినేషన్ వేసిన అభ్యర్థి చెల్లించిన డిపాజిట్ డబ్బులను సదరు నామినేషన్ తిరస్కరణకు గురైనా, ఉపసంహరించుకున్న సందర్భంలో తిరిగి ఇస్తారు. నామినేషన్ పరిగణలోకి తీసుకొని ఎన్నికలు నిర్వహిస్తే ఆయన పోటీ చేసిన స్థానంలో పోలైన ఓట్లలో చెల్లుబాటు అయ్యే వాటిలో ఆరోవంతు (16.67 శాతం) ఓట్లు అభ్యర్థికి వస్తే ఆ అభ్యర్థికి డిపాజిట్ తిరిగి ఇస్తారు. ఉదాహరణకు ఒక గ్రామంలో చెల్లుబాటు అయ్యే ఓట్లు 600 ఉంటే అభ్యర్థికి అందులో ఆరో వంతు అనగా 100 ఓట్లు రావాల్సి ఉం టుంది. అభ్యర్థి గెలుపుఓటములతో సంబంధం లేకుండా ఆరోవంతు ఓట్లు వస్తే డిపాజిట్ డబ్బులు తిరిగి ఇస్తారు. లేదంటే డిపాజిట్ కోల్పోతారు. దీన్నే 'డిపాజిట్ గల్లంతు' అని కూడా పిలుస్తుంటారు.

పంచాయతీ ఎన్నికలపై 5 ఫిర్యాదులు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కుకు శనివారం వరకు ఐదు ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో మూడు ఓటర్ ఐడీకి సంబంధించినవి కాగా వెంటనే పరిష్కారం కోసం సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

మరో రెండు ఫిర్యాదులను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేశారు. వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగం చేస్తూనే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై హెల్ప్ డెస్క్ సిబ్బంది స్పందిస్తూ.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ముందుగా వీరు ఉద్యోగానికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల నియమావళి, ఓటింగ్ ప్రక్రియ, అభ్యర్థిత్వాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్ హెల్ప్‌డెస్క్ చురుగ్గా పని చేస్తోంది.

ఓరుగల్లు నాట్యానికి వన్నెలద్దారు..

● వేలాది మందికి నాట్యంలో శిక్షణ ఇచ్చిన వెంపటి నాగేశ్వరి
● ఆమె వారసురాలిగా వెంపటి శ్రావణి తనదైన ముద్ర
● నేడు కాళోజీ కళాక్షేత్రం వార్షిక వేడుకలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటా నృత్య సరాగాలు పల్లవిస్తాయి... అందెల రవళలు ప్రతిధ్వనిస్తాయి.. తెలుగునాట ఓరుగల్లు నృత్య సౌరభాలను దేశ విదేశాల్లో చాటిన ఖ్యాతి ఆ ఇంటికే దక్కుతుంది. కూచిపూడి, భరతనాట్య నృత్య విన్యాసాలను ఎందరికో నేర్పి, ఎందరెందరో కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆ కళాక్షేత్రానికే దక్కింది. చారిత్రక ఓరుగల్లు నగరంలో ఆరు దశాబ్దాల క్రితం తొలి నృత్య కళాక్షేత్రంగా ప్రారంభమైన వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం... తన సుదీర్ఘ ప్రయాణంలో 60 వసంతాలు పూర్తి చేసుకున్న వేడుకను వందలాది కళాకారుల మధ్య జరుపుకునేందుకు సన్నద్ధమైంది. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం ఆదివారం ఈ వేడుకలకు వేదికగా నిలవనుంది.

లోగో

కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం గావించి, కూచిపూడి త్రయంగా పేరుగాంచిన త్రిమూర్తులలో ప్రథముడు వెంపటి వెంకటనారాయణశాస్త్రి. ఆయన కుమారుడైన కోదండరామశాస్త్రి కూతురైన వెంపటి నాగేశ్వరి... 1967లో వరంగల్ స్టేషన్ రోడ్‌లో ప్రారంభించిన మొట్టమొదటి నాట్య శిక్షణాలయమే కాకతీయ నృత్య కళాక్షేత్రం. నాగేశ్వరి శిష్యరికంలో విద్యారణ్య సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగిన కుప్పా పద్మజతో పాటు తాడూరి రేణుక, సంధ్యారాణి, గాయత్రి, శైలజ, కవిత తదితర అనేక మంది జాతీయస్థాయి కళాకారులు వెలుగులోకి వచ్చారు.

నాగేశ్వరి స్వయంగా తన కూతురు అయిన శ్రావణికి కూడా నృత్య సరాగాలు నేర్పించారు. ఆమె కూచిపూడి నృత్యంలో పీజీ డిప్లొమా పూర్తి చేయడమే కాక సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్ ఫెల్లోషిప్ అవార్డుతో పాటు దూరదర్శన్‌లో బీ గ్రేడ్ కళాకారిణిగాను గుర్తింపు పొందారు. నాగేశ్వరి వేల మంది శిష్యులను తయారు చేసి ఓరుగల్లు ఖ్యాతిని నృత్య రంగంలో నిలిపారు. 2014లో నాగేశ్వరి మృతి చెందిన తర్వాత.. ఆమె కూతురైన శ్రావణి నాట్య రంగంలో వెంపటి వారి తరఫున నాల్గవ వారసురాలిగా బాధ్యతలు స్వీకరించి నాట్యాచారిణిగా చిన్నారులను తీర్చిదిద్దుతూ ఓరుగల్లు ప్రతిభను చాటుతున్నారు.సన్ని, మౌనిక, అక్షిత, నాగర్ష, కౌశిక, రియా తదితర అనేక మంది జాతీయస్థాయిలో అవార్డులు, బహుమతులు సాధించిన కళాకారులు శ్రావణి శిష్యులే కావడం గమనార్హం.



నాట్యాచారిణి వెంపటి శ్రావణి

ఈ కళాక్షేత్రంలో ఇప్పటికి 300 మందికి పైగా, నాలుగేళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల వరకు ఉన్న వారంతా శిక్షణ పొందుతున్నారు. కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం 60వ వెంపటి కాకతీయ కళాక్షేత్రం వార్షికోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు శాంతికృష్ణ చెప్పారు. ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేశ్‌బాబు సౌజన్యం, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- టీపీసీసీ సోషల్ మీడియా నేత ముస్తాక్ నెహాల్

వడ్డెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ సోషల్ మీడియా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముస్తాక్ నెహాల్ అన్నారు. శనివారం హనుమకొండ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 58వ డివిజన్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రూ. 1 కోటి 35 లక్షల అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. డివిజన్‌లోని రామచంద్రనగర్ ఫేస్ -2 , శ్రీలక్ష్మీనగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, వడ్డెపల్లి పింగిళి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం పనులకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధికి చిరునామా అని తెలిపారు.



హైకోర్టు స్టే పత్రాన్ని వైన్‌షాపు గోడకు అంటిస్తున్న దృశ్యం

వైన్‌షాపు ఏర్పాటు చేయొద్దు

- స్టే విధించిన హైకోర్టు

- అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

వడ్డెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ, భవానీనగర్ మెయిన్‌రోడ్డులోని అశోక కాలనీలో వైన్ షాపు నెలకొల్పవద్దని అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైన్స్ షాపు ఏర్పాటు చేసే భవనం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అశోక కాలనీ రోడ్డులో వైన్‌షాపు ఏర్పాటు చేయవద్దని హైకోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఆర్డర్ నంబర్ డబ్ల్యూపీ 36549 ఆఫ్ 2025 ను పాస్ చేసిందని పేర్కొన్నారు. ఈ ఆర్డర్ ప్రతులను వైన్స్ షాపు ఏర్పాటు చేసే భవనం గోడకు అంటించినట్లు తెలిపారు. స్టే ప్రతులను జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎక్సైజ్ అధికారికి , ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇంటి యజమానికి, షాపు నెలకొల్పే ఓనరు అబ్బు లతకు అందజేసినట్లు తెలిపారు. ఇక్కడ వైన్ షాపు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలతో పాటు అసాంఘిక కార్యక్రమాలు, ఆకతాయిలు, మందుబాబుల బెడదను కాలనీవాసులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు, దేవాలయాలు, చిరు వ్యాపార సంస్థలు ఉన్నాయని వైన్‌షాపు ఏర్పాటుతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అశోక కాలనీ అభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీ ప్రతినిధులు రామచందర్, సరోత్తంరెడ్డి, బసవయ్య, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, ప్రవీణ్, నారాయణరెడ్డి, లక్ష్మణ్ రావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నాట్యాలయం ప్రారంభం

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అడ్వకేట్స్‌కాలనీకి చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వమోహిత సంగీత నాట్యాలయాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. టెంపుల్ డాన్స్ పేరిట ప్రత్యేక ఆర్ట్ ఫామ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక ఆలయాల్లో తాను, తన శిష్యులతో నృత్య యాత్రను నిర్వహిస్తున్న హిమాన్సి తన పిల్లల కోసం హనుమకొండలో నృత్య ఆలయాన్ని ప్రారంభించడం విశేషం. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, అరూరి రమేశ్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, హిమాన్సి తల్లిదండ్రులు శ్రీనివాస్, శ్రీలక్ష్మి కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు సంజయ్

హనుమకొండ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన హనుమకొండ లష్కర్ బజార్‌లోని విలియం కేరీ స్కూల్ విద్యార్థి నాగుల సంజయ్‌ను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ములుగులో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలో సంజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీయం ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ పోతుల ప్రవీణ్‌కుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప ఉత్సవమూర్తికి అభిషేకం చేస్తున్న మాలధారులు

మడికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై శనివారం అయ్యప్ప స్వామి పంబారట్టు పూజను అయ్యప్ప స్వాములు వైభవంగా నిర్వహించారు. స్వామి ఆలయం నుంచి మెట్టుగుట్టపైకి ఊరేగింపుగా తరలించారు. అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తికి పంచామృతాలు, నవరసాలతో కూడిన అభిషేకాలను భక్తి ప్రపత్తులతో జరిపించారు. ఆలయ పూజారులు శ్రీకాంత్, అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ మంత్రోశ్చ రణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలి చారు. అయ్యప్ప నామస్మరణతో మెట్టుగుట్ట మార్మోగింది. అనంతరం చిర్ర రమేష్ - ఇందిర దంపతులు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో గురుస్వాములు ఓర్సు యాకయ్య, కుర్ల మోహన్, ముంజ రమేష్, జనగాం రాజ్‌కుమార్, గడుసు రాజు, గంగారపు రమేష్, కల్లెపు భిక్షపతి, కొలిపాక శ్రీనివాస్, సారయ్య, అలీ, పులిపాక కుమార్ తదితరులు పాల్గొని అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని కొలిచారు.

ముగిసిన పీఎంశ్రీ పాఠశాలల క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహిస్తున్న పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు వేడులకు హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా రాష్ట్ర స్థాయికి చేరుకొని పతకాలు సాధించి, జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాగా, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడంశాల్లో నిర్వహించిన ఫైనల్ పోరులు గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు తమ ప్రతిభకు పదనుపెట్టి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ బి. మహేష్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ప్రశాంత్, పీఎంశ్రీ పాఠశాలల అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ కృషితో దేశం ఐక్యం

» మేయర్ గుండు సుధారాణి

» జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో యూనిట్ మార్చ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే ఈ రోజు దేశం ఐక్యంగా ఉందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో సర్దార్ 150 ఐక్యతా మార్చ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ సుధారాణి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంబించారు. డిప్యూటి కమిషనర్ సమ్మయ్య, కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్యా, హెచ్ఎస్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, నారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, టీఎంసీ రమేష్‌లు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు సురేష్, భిక్షపతి, పవన్‌తో పాటు మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడండి

వరంగల్ నగరంలోని అన్ని కాలనీలలో నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని వరంగల్ నగర మేయర్ గుండ సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్‌తో పాటు ప్రధాన రహదారులపై ఏర్పడుతున్న పైప్‌లైన్ లీకేజీలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు సారంగం, రాజ్‌కుమార్, రంగారావు, సతీష్, రవికిరణ్ అధికారులు పాల్గొన్నారు.



యూనిట్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.11,59,500 విలువ గల చెక్కులను అందచేశారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సన్మానం

హనుమకొండ టౌన్ : అపార్ట్‌మెంట్ సెల్ఫ్ అసెస్‌మెంట్ ప్రక్రియలో విధించిన 25 రెట్ల పెనాల్టీ ని ప్రభుత్వం రద్దు చేసింది, ఈ రద్దుకు కృషి చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

పార్టీల కతీతంగా నియోజక వర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో సుమారు రూ. 29 కోట్ల పెనాల్టీ రద్దు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నడుముల విజయ్‌కుమార్, ట్రైసిటీస్ నాయకులు రాజ్‌కుమార్, వాల కృపాకర్‌రావు, మర్రిరెడ్డి అంజనీదేవి, అశోక్‌రెడ్డి, గుండ్ల శ్రీనివాస్, డాక్టర్ సారంగపాణి, స్వరూప, మాధవి, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, తామస్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ , ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

హనుమకొండ చౌరస్తా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత నెల చివరి వారంలో ఎడతెరపి లేకుండా కురిసిన మొంథా తుఫాను కారణంగా నీట మునిగిన 10వ డివిజన్ రాయపురలోని వరద బాధితులకు స్థానిక కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు శనివారం రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు తుఫాను కారణంగా నీట మునిగిన హనుమకొండ 10వ డివిజన్‌లో రాయపురతో పాటు పలు కాలనీల్లోని వరద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సమీపంలోని రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శోభనబోయిన కుమార్‌యాదవ్, ఎండీ. జాఫర్, షేక్ యాకుబ్, అనిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

వరంగల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని నగరంలోని బట్టల బజార్ ప్రాంతంలో గల వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు టీటీడీ కార్యనిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గల విద్యార్థులు, పదో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు గల విద్యార్థులు, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయసు గల వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 14, 16 అధ్యాయాల్లోని శ్లోకాలను కంఠస్థం చేసి ప్రవచించారు. జూనియర్ విభాగంలో ఎ. అక్షయ సాయి, అర్. మోక్షజ్ఞ, అర్. శ్రీరిత్విక, సీనియర్ విభాగంలో ఎ. మాధవి, భార్గవిశృతి, వక్తృత్వ పోటీలలో లత, మాధవి, మంజుల విజేతలుగా నిలిచారు. వీరికి ప్రశంసాపత్రాలు, బహుమతులు, షీల్డులు అందజేసినట్లు కృష్ణమూర్తి తెలిపారు.

ఈ కార్యక్రమంలో శారదా విద్యాలయం కరస్పాండెంట్ గుమ్మడవెల్లి సురేష్, ఆంధ్రబాలిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, కాకతీయ మహిళా కళాశాల లెక్చరర్లు తేనేటి వసుంధర, దుర్గాదేవి, కళాశాల అధ్యాపకురాలు వేదాంతం శ్రీదేవి, మచ్చమ్మ, శశికళ, టంటం దయాకర్‌స్వామి, రఘువీర్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక సమస్యలు దూరం

- గురువు ఆంజనేయులు

బాలసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణ ప్రభావంతో నేటి యువత స్మార్ట్ ఫోన్లు, బిర్యానీలు, మాంసాహారాల పట్ల దృష్టి కేంద్రీకరించి రోగాలను కొని తెచ్చుకుంటున్నారని యోగా గురువు ఆంజనేయులు అన్నారు. రామకృష్ణా సేవా మందిరంలో యోగా తరగతులను ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా శనివారం సాయంత్రం యోగా వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమానికి సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ రోగాలను నయం చేసుకోవడానికి అలోపతి, హోమియోపతి, యునాని తదితర వైద్య విధానాల ద్వారా రోగాలను నయం చేసుకుంటున్నారని అన్నారని వాటన్నింటికీ మందులు ఉన్నాయని కాని యోగా, ధ్యానం ద్వారా మందులు లేకుండా శారీరక రుగ్మతలను అరికట్టవచ్చని అన్నారు. మానవుడి ఆయుష్షు 120 ఏళ్లు కాగా 40 సంవత్సరాల వయసులోనే రోగాల భారిన పడుతున్నారని అన్నారు. మాంసాహారాన్ని త్యజించి పండ్లు, కూరగాయలతో మితంగా భోజనం చేసి యోగా, ధ్యానం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంజనేయులు సూచించారు. కార్యక్రమంలో ఇంకా సమితి ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తిరువరంగం ప్రభాకర్, రెంటాల కేశవరెడ్డి, అంజనీదేవి, యోగా సాధకులు పాల్గొన్నారు.

వాగ్దేవి కాలేజీలో వ్యాక్సిన్ డ్రైవ్

వరంగల్ మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో శనివారం అవేర్‌నెస్ ఆన్ హెచ్‌పీవీ వ్యాక్సిన్, అండ్ వ్యాక్సిన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమిత్ర తిప్పని మాట్లాడుతూ వివిధ రకాల క్యాన్సర్లు, అందులో సర్వైకల్ క్యాన్సర్, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై విద్యార్థులకు వివరించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఆడపిల్లలు 9 నుంచి 14 సంవత్సరాల వయస్సులో తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బిఎస్.శరవణభవ, డాక్టర్ ఇ.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, డాక్టర్ పావని, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ గిరిజ, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతకు రంగం సిద్ధం

● **నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల స్వీకరణకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఎంపీడీవోలు, రిటర్నింగ్, నోడల్ అధికారులతో శనివారం జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నుంచి డిసెంబరు 2 వరకు ధర్మసాగర్, ఐనవోలు, పరకాల, హసన్‌పర్తి, వేలేరులో జరిగే నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఎంపీడీవోల వద్ద నుంచి నామినేషన్ సామగ్రిని రిటర్నింగ్ అధికారులు తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఉండాలని, కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ధర్మసాగర్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 186 వార్డులు, హసన్‌పర్తి మండల కేంద్రంలో 15గ్రామపం చాయతీలు, 138 వార్డులు, ఐనవోలు మండలంలో 17 గ్రామపంచాయతీలు, 170 వార్డులు, వేలేరు మండలంలో 12 గ్రామ పంచాయితీలు, 106 వార్డులు, పరకాల మండల కేంద్రంలో 10 గ్రామ పంచాయితీలు 94వార్డులకు మూడు రోజుల పాటు నా మినేషన్లను స్వీకరించున్నట్లు కలెక్టర్ తెలిపారు.

శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్



శ్రీనివాస్ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా యువజన సర్వీసుల శాఖలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించిన వొడపల్లి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ పొందుతున్న శ్రీనివాస్ ఆత్మీయ సన్మాన సభను డీవైఎస్‌వో జి. అశోక్‌కుమార్ అధ్యక్షతన హనుమకొండ జేఎన్ఎస్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ మాట్లాడుతూ 35సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పని చేసి నిబద్ధతకు మారు పేరుగా శ్రీనివాస్ నిలిచారని కొనియాడారు. అనంతరం శ్రీనివాస్‌ను డీఎస్ఏ సిబ్బంది, కోచ్‌లు సన్మానించారు. వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం సూపరింటెండెంట్ యతిపతి విజయశ్రీ, రిటైర్డు డీవైఎస్‌వో బలరాం, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డిస్నీల్యాండ్‌లో క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో మాట్లాడుతున్న పాఠశాల యాజమాన్యం

దామెర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ స్కూల్ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా విద్యార్థులకు సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, షటిల్, టెన్నీకాయిట్, క్యారం బోర్డ్, చెస్, మ్యూజికల్ చైర్ వంటి క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని, తమ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీల్లో పాఠశాల ఫౌండర్ మెంబర్స్ డి.మల్లయ్య, డి. సదయ్య, బి.లక్ష్మీనివాసం, శోభారాణి, డి.రాకేష్‌బాబు, డి.దినేష్‌చందర్ హాజరై, విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలల్లోనూ రాణించాలని తెలిపారు. ఇందులో క్రీడలను విజయవంతం చేసిన పీఈటీలు బి.రాజ్‌కుమార్, ఎం.తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, సునీత, అశోక్, వెంకట్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు వార్షికోత్సవ వేడుకల్లో బహుమతులను అందజేయనున్నట్లు ప్రకటించారు.

'అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కరువు'



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

వడ్డెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కరువైందని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ అన్నారు. అంబేద్కర్ విగ్రహాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ రాష్ట్రంలో బడుగుల అంబేద్కర్ విగ్రహాలపై మతోన్మాదులు దాడులు చేసి కూల్చివేశారని అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రశాంత్, జంపాల రమేష్, కూనమల్ల రమేష్, సుధాపల్లి సరిత, కేశరాజుల ఉమ, కొయ్యల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఉద్యమ పటిమతోనే రాష్ట్రం ఏర్పాటు

» **కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి**

» **జీడబ్ల్యూఎంసీ ఆవరణలో ఘనంగా దీక్షా దివస్**

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఉద్యమ పటిమ వల్లనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, కేసీఆర్ ఉద్యమ చరిత్రను ప్రజలు ఏ నాటికి మరిచిపోరని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అన్నారు. శనివారం దీక్షా దివస్ కార్యక్రమం బల్దియాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ ఆవరణలోని పైలాన్ వద్ద తెలంగాణ ఉద్యమకారులు ఏకమై తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. పైలాన్‌కు పూలు చల్లి నాటి ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం వల్లనే కేంద్రం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్లి రవి, నాయకులు ముష్క ప్రమీల, ముకల ఎల్లయ్య, దేవానంద్, కుమారస్వామి, ఆనంద్, కనకరాజు, కుమార్, మధుకర్, సోమనాథ్, సదాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం..

కేయూ క్యాంపస్ : 2009 నవంబరు 29 దీక్ష దివస్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ముందుకు సాగుతామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవారెడ్డి అన్నారు. శనివారం కేయూ దూర విద్య ప్రాంగణంలో దీక్షా దివస్‌ను నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో రిటైర్డు ప్రొఫెసర్ సీహెచ్ దినేశ్‌కుమార్ పూలమాల వేసి దీక్షల ను ప్రారంబించారు. దీక్షలకు కేయూ మాజీ జాక్ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్, కొగిల మహేశ్, సదాశివ్‌లు సంఘీభావం తెలుపగా జెట్టి రాజేందర్, మాచర్ల శరత్‌చంద్ర, సూర్యకిరణ్, అరూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



బల్దియా వద్ద నినాదాలు చేస్తున్న మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



సండే సెలబ్రిటీ

ఒక గొప్ప కోటను చూసినప్పుడు గత చరిత్ర గుర్తుకొస్తుంది. భావోద్వేగం కలుగుతుంది. కొన్ని వందల ఏళ్ల క్రితం అక్కడ నివసించిన వ్యక్తులు ఎలా ఉండేవారు? వారి ఆచార వ్యవహారాలేమిటి? సంస్కృతి సంప్రదాయాలేమిటి? ఎలాంటి దుస్తులు ధరించేవారు? ఏ భాష మాట్లాడేవారు?... ఇలాంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. వాటన్నింటిపైన పరిశోధన చేసి, మళ్లీ మన కళ్ల ముందు ఆ నాటి రాజసాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తున్న వ్యక్తి... క్రాఫ్ట్ ఆఫ్ ఆర్ట్‌కు చెందిన **బిర్వా ఖురేషి**. వచ్చే నెల 12న గోల్కొండ కోటలో ఒక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలలోకి వెళ్తే..

ఒక్కో కట్టడం వెనక ఒక్కో చరిత్ర ఉంది


చరిత్రపై మీకు ఆసక్తి ఎప్పుడు ఏర్పడింది?, ఎలా ఏర్పడింది?

నాన్నగారు దేశంలో పెద్ద ఆర్కిటెక్ట్‌లలో ఒకరు. చిన్నప్పటి నుంచి నేను ఆర్కిటెక్ట్ అవ్వాలనుకున్నా. నాకు ఆర్కిటెక్చర్‌తో పాటు కళలన్నా చాలా ఇష్టం. అందుకే భరతనాట్యం కూడా నేర్చుకున్నా. మన భారతీయ సంస్కృతిలో కళలకు.. కట్టడాలను ఒక అవినాభావ సంబంధం ఉంటుంది. మన దేశం నలుమూలలా అనేక కోటలు, కట్టడాలు ఉన్నాయి. ఒకో కట్టడం వెనక ఒకో చరిత్ర ఉంది. ఇవన్నీ మన గత వైభవ గర్వ చిహ్నాలు. ఆ చరిత్ర చాలా మందికి తెలియదు. ముఖ్యంగా ఈతరం పిల్లలకు మన ఘన చరిత్ర గురించి చెప్పటానికి 16 ఏళ్ల క్రితం అహ్మదాబాద్‌లో నేను తొలి సారి ఈ ఫెస్టివెల్‌ను నిర్వహించాను. ఇక గోల్కొండ కోట విషయానికి వస్తే 2019 నుంచి ఈ కట్టడానికి సంబంధించిన పరిశోధన ప్రారంభించాను. కొన్ని వందలసార్లు వచ్చాను. అనువణువూ తెలుసుకున్నాను. ఆరేళ్ల తర్వాత వచ్చే నెల ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాం.

ఇప్పటిదాకా మీరు అనేక ఫెస్టివల్స్ నిర్వహించారు. వీటిలో హరప్పా నాగరితకు చెందిన ధోలోవీరా ఫెస్టివల్ ఒకటి. మనకు హరప్పా సంస్కృతి గురించి కొంతే తెలుసు. ఈ ఫెస్టివల్‌ను నిర్వహించటానికి ఎంత కష్టపడాల్సి వచ్చింది?

హరప్పా నాగరిత ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పటానికి ధోలోవీరా ఒక ప్రత్యక్ష నిదర్శనం. ఏ నాగరికతైనా పరిఢవిల్లాలంటే నీరును జాగ్రత్తగా వాడుకోవాలి. మనకు ధోలోవీరాలో ఒక రిజర్వాయర్ కనిపిస్తుంది. అంతే కాకుండా ఉత్తర ప్రాంతంలో ఒక పెద్ద గేటు ఉంటుంది. దానిపై హరప్పా లిపిలో కొన్ని అక్షరాలు కనిపిస్తాయి. ఈ అక్షరాల వెనకున్న అర్థాన్ని ఇప్పటి దాకా కనుక్కొలేకపోయారు. ఇక తూర్పు దిశ కూడా ఒక గోడ మనకు కనిపిస్తుంది. అక్కడే కొంత ఎత్తులో వర్తులాకారంలో నిర్మించిన గుడిసెల ఆనవాళ్లు కనిపిస్తాయి. అక్కడ నుంచి చూస్తే మొత్తం ధోలోవీరా అంతా కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ధోలోవీరాలో పురాతత్వ శాస్త్రవేత్తలు కొన్ని తవ్వకాలే జరిపారు. ఇంకొన్ని జరపాల్సి ఉంది. ఇప్పటి దాకా తవ్వకాలు జరిపిన ప్రాంతంలో మేము ఫెస్టివల్ నిర్వహించాం. ఐదువేల ఏళ్ల క్రితం మనుషులు సంచరించిన ప్రాంతంలో మనం ఒక ఉత్సవాన్ని చేసుకోవటం మరిచిపోలేని అనుభవం. ఈ ఫెస్టివల్‌లో అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. హరప్పా నాగరికతకు చిహ్నాలుగా కొన్ని ప్రాంతాల్లో దొరికిన పూసలను చెబుతారు. అలాంటి పూసలను వంశపారంపర్యంగా తయారుచేసే ఒక వ్యక్తి గుజరాత్‌లో ఉన్నారు. ఆయన చేత అలాంటి పూసలు ఆ ఫెస్టివల్‌లో తయారుచేయించాం. ఇప్పటికీ ఆ ఫెస్టివల్ గురించి తలుచుకుంటుంటే అందమైన అనుభూతులే గుర్తుకొస్తాయి.

"మేము నిర్వహించే ఫెస్టివల్స్‌లో ఉచిత ప్రవేశం ఉంటుంది. అయితే ముందు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారు ఈ ఫెస్టివల్స్‌లో పాల్గొనాలనేదే నా ఉద్దేశం. కొత్త తరం వారికి మన సంస్కృతి ఎంత గొప్పదో తెలియాలంటే ఇలాంటి ఫెస్టివల్స్ నిర్వహించాలి. వాటిలో అందరూ పాల్గొనాలి.



గోల్కొండ కోటతో మీ అనుబంధమేమిటి?

గోల్కొండ కోట అనగానే ఎత్తుగా, రాజసంగా.. ఎవరికీ లొంగని ఒక కోట గుర్తుకొస్తుంది. దక్షిణ భారత దేశంలో అంత చరిత్ర కలిగిన కోట మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. గోల్కొండ కోటలో నిర్మాణాలు కూడా చాలా విభిన్నంగా ఉంటాయి. ఆ కోటలో అనేక రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ కోటను చూసిన ప్రతీ సారి కొత్తగానే కనిపిస్తుంది. నేను తొలిసారి ఈ కోటను చూసినప్పుడు కలిగిన భావోద్వేగాలు ఇప్పటికీ నాకు ఇంకా గుర్తున్నాయి. ఈ ఫెస్టివల్‌ను నిర్వహించటానికి నేను ఇప్పటి దాకా కొన్ని వందల సార్లు ఈ కోటకు వచ్చి ఉంటాను. వచ్చిన ప్రతి సారి ఒక కొత్త అనుభూతి కలుగుతుంది.

ఈ తరహా ఫెస్టివల్స్‌ను నిర్వహించటం ఎంత కష్టం?

ప్రతి కట్టడానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతను చాటి చెప్పటమే ఈ ఫెస్టివల్ ముఖ్యోద్దేశం. ఈ క్రమంలో రకరకాల సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. ఉదాహరణకు అహ్మదాబాద్‌లోని ఓల్డ్ సిటీ ప్రాంతంలో ఒక ఫెస్టివల్ నిర్వహించాం. అక్కడకి ప్రతి రోజు కొన్ని లక్షల మంది వచ్చిపోతూ ఉంటారు. అంత బిజీగా ఉండే ప్రాంతంలో ఫెస్టివల్ నిర్వహించటమనేది ఒక పెద్ద సవాల్! దీనిని నిర్వహించటం వెనక 12 ఏళ్ల శ్రమ ఉంది. మన ఉద్దేశం మంచిదైతే అన్ని పనులు సక్రమంగా జరుగుతాయి. ప్రకృతి కూడా సహకరిస్తుంది.

మీకు ఇప్పటిదాకా లభించిన గొప్ప ప్రశంస ఏమిటి?

2015లో మేము గుజరాత్‌లో అత్యంత పురాతనమైన చరిత్ర కలిగిన దిగుడు మెట్ల బావి దగ్గర ఒక ఫెస్టివల్ నిర్వహించాం. కొన్ని వేల దీపాలతో దానిని అలంకరించాం. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. నేను, నాన్న ఆ మెట్ల దగ్గర నిలబడి వాటిని చూస్తున్నాం. ఇంతలో నాన్నకు తెలిసిన ఒక జంట వచ్చారు. "పదకొండు వందల ఏళ్ల క్రితం ఈ బావిని దీపాలతో అలంకరించారని శాసనాల్లో ఉంది. మళ్లీ ఇంతకాలానికి మీ అమ్మాయి దీపాలు వెలిగించింది.." అన్నారు. ఆ మాటలు విన్న నాన్న కళ్లు చమర్చాయి. నాకు అంతకన్నా గొప్ప ప్రశంస ఇంకేం ఉంటుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అందానికి మసాలాలు

వంటకాల రుచిని, ఆరోగ్యాన్ని ఇచ్చే మసాలా దినుసులు చర్మ సౌందర్యానికి కూడా ఉపకరిస్తాయని తెలుసా?



- జీలకర్రలో ఇ విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికం. రోజూ వంటకాల్లో చేర్చడం వల్ల చర్మం మీద ముడుతలు ఏర్పడవు. అకాల వార్థక్యం దరి చేరదు. గ్లాసు మంచినీటిలో అర చెంచా జీలకర్ర వేసి రాత్రంతా నాననిచ్చి ఉదయాన్నే తాగితే శరీరంలోని వ్యర్థ పదార్థాలన్నీ విసర్జితమవుతాయి. చర్మం తేమతో నిండి ఛాయగా మెరుస్తుంది.
- దాల్చిన చెక్కలో బి, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్, బీటా కెరోటిన్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. తరచూ ఆహారంలో చేరిస్తే రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. చర్మం పొరల్లో సెబమ్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో ముఖం మీద మొటిమలు, గుల్లలు రావు. చిన్న గిన్నెలో చెంచా దాల్చిన చెక్క పొడి, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి గంట తరువాత మంచినీటితో శుభ్రం చేసుకుంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రపడతాయి. నల్ల మచ్చలు క్రమంగా తగ్గుతాయి.
- జాజికాయలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, కాపర్, జింక్, కాల్షియం, పొటాషియం, మాంగనీస్ తదితర మినరల్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవన్నీ కలిసి జీవక్రియలను వేగవంతం చేసి మంచి నిద్రను ప్రేరేపిస్తాయి. దీనివల్ల చర్మం సహజ కాంతితో మెరిసిపోతుంది.
- లవంగాలలో సి, కె విటమిన్లతోపాటు పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం లాంటి మినరల్స్ మెండు. లవంగాలు తీసుకొంటే చర్మం పొడిబారడం, చుండ్రు లాంటి సమస్యలు తగ్గుతాయి. గిన్నెలో రెండు చెంచాల కొబ్బరి నూనె, మూడు చుక్కల లవంగ నూనె వేసి బాగా కలిపి రాత్రి పడుకునేముందు ముఖానికి పట్టిస్తే మొటిమల సమస్య తీరుతుంది.

ట్రెండింగ్



పదిహేనేళ్ల వయసులోనే వెండితెరపై మెరుపులు.
షారూక్, ఆమిర్ లాంటి సూపర్‌స్టార్ల చిత్రాల్లో పాత్రలు.
రెండు దశాబ్దాలు పైబడిన కెరీర్‌లో...
అందమైన అభినయాలు...
వరించిన పురస్కారాలు ఎన్నో.
కానీ అవేవీ ఇవ్వని స్టార్ ఇమేజ్... ఒకే ఒక్క ఇంటర్వ్యూతో ఆమె సొంతమైంది.
సామాజిక మాధ్యమాల యుగంలో...
రాత్రికి రాత్రి ఇంటింటికీ పరిచయమైంది. అదే స్థాయిలో ఊహించని ఇబ్బందులనూ ఎదుర్కొంటోంది.
'నీలం చీర అమ్మాయి' (బ్లూ శారీ గాళ్)గా అంతర్జాలాన్ని ఊపేస్తున్న నయా 'నేషనల్ క్రష్'... **గిరిజా ఓక్** ముచ్చట్లు ఇవి.

కొత్త క్రష్..!

'థెరపీ షెరపీ'.. ఇదో వెబ్‌సిరీస్. దీని ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూతోనే గిరిజా ఓక్ గోడ్బోలే పేరు దేశమంతా మారుమోగిపోతోంది. వెబ్‌సిరీస్‌లో సహనటుడు గుల్షన్ దేవయ్యతో చేసిన ఓ సాన్నిహిత్య సన్నివేశం గురించి అందులో ఆమె మాట్లాడింది. "ఆ సన్నివేశం తీస్తున్న సమయంలో గుల్షన్... 'మీకు ఓకేనా' అని కనీసం పదహారు పదిహేడుసార్లు అడిగాడు. నా సౌకర్యం కోసం తన వ్యానిటీ వ్యాన్ నుంచి రకరకాల దిండ్లు తెచ్చి ఇచ్చాడు. సహనటుడి నుంచి ఇంతటి గౌరవం, భద్రత లభించడం చాలా అరుదైన విషయం" అంటూ ఆమె తన షూటింగ్ అనుభవాలను పంచుకుంది. "సినిమా లేదా సిరీస్ కావచ్చు... అభ్యంతరకర సన్నివేశాలు చిత్రీకరించేటప్పుడు నటీనటులు ఇబ్బంది పడకుండా సెట్‌లో జాగ్రత్తలు తీసుకొంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు సందేహిస్తుంటాం. కానీ కొందరు నటులతో పని చేసేటప్పుడు ఆ అసౌకర్యం అనేదే ఉండదు. అలాంటివారిలో గుల్షన్ ఒకరు. తనవల్లే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ సన్నివేశం పూర్తి చేయగలిగా" అంటూ ముగించింది. ఈ మాటలే యువతరాన్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి.

అంతేకాదు... ఆ సందర్భంగా ఆమె పలికించిన హావభావాలు, నీలి రంగు చీరలో సంప్రదాయబద్ధమైన ఆహార్యం చూసి నెటిజనులు ముగ్ధులయ్యారు. వీడియో క్లిప్పింగ్స్, ఫొటోలు తెగ షేర్ చేసేయడంతో గిరిజ హఠాత్తుగా సూపర్ స్టార్ అయిపోయింది. 'నీలం చీర అమ్మాయి'గానూ కోట్లమంది హృదయాల్లో ముద్రపడిపోయింది. 'ఇంతకీ ఎవరీమె' అనే ఉత్సుకత మొదలైంది. అంతే... గిరిజ పేరుతో సెర్చ్ ఇంజిన్లు యమ బిజీ అయిపోయాయి. లక్షల్లో ఫాలోవర్స్ పెరిగిపోయారు. చాలామంది ఆమెను అంతర్జాతీయ తారలతో పోల్చారు. అంతిమంగా గిరిజా ఓక్ నయా 'నేషనల్ క్రష్'గా అవతరించింది.

ట్రోల్స్... ట్రబుల్స్...



ఉన్నట్టుండి వచ్చిన స్టార్‌డమ్, బిరుదు కాని బిరుదు 'నేషనల్ క్రష్'.. ఈ హఠాత్ పరిణామం నుంచి కోలుకొనేలోపే గిరిజకు ట్రోల్స్ ట్రబుల్స్ మొదలయ్యాయి. కొన్నిటిని సానుకూలంగానే తీసుకున్నా... అన్నిటినీ ఆమె భరించలేకపోయింది. "మీరు చూపుతున్న ఆదరాభిమానాలకు ధన్యవాదాలు. చాలామంది నన్ను ప్రశంసిస్తూ మెసేజ్‌లు పెడుతున్నారు. మీమ్స్ కూడా సృష్టించారు. సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అవుతుంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు! దీనివల్ల నాకు, నా సినిమాలకు అభిమానులు పెరుగుతున్నారు. ఇది సంతోషమే. కానీ కొందరు హద్దులు మీరి... నా ఫొటోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలత జోడిస్తున్నారు. నా పన్నెండేళ్ల కొడుకు తల్లి ఫొటోలను అలా చూస్తే ఎలా స్పందిస్తాడోనని ఆందోళన కలుగుతోంది. కొందరు నా పేరుతో ఫేక్ అకౌంట్లు తెరిచి డబ్బులు అడుగుతున్నారు. మీరు నిజంగా నటనను ఇష్టపడేవారే అయితే దయచేసి ఇలాంటివి మానుకోండి" అంటూ ఆవేదనతో వీడియో సందేశం విడుదల చేసిన గిరిజ... మరాఠీ ప్రముఖ నటుడు గిరీష్ ఓక్ తనయ. ముంబయి 'ఠాకూర్ సైన్స్ అండ్ కామర్స్ కాలేజీ'లో బయోటెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన ఆమె నటనపై ఆసక్తితో చిన్నప్పుడే థియేటర్ వర్క్‌షాప్‌లో చేరింది. మొదట మోడలింగ్ చేసిన ఆమె... తరువాత మరాఠీ, హిందీ చిత్రాలతో పాటు పలు వెబ్‌సిరీస్‌లు, టీవీ షోల్లో కూడా నటించింది. దర్శకనిర్మాత సుహ్రుద్ గోడ్బోలేను పెళ్లి చేసుకుంది. ఆయన తండ్రి మరాఠీ చిత్ర దర్శకుడు, మాటల రచయిత, నిర్మాత శ్రీరంగ్ గోడ్బోలే.

విభజన వచ్చింది...

అభ్యంతరకర సందేశాలు, వంకర వ్యాఖ్యలు పక్కన పెడితే... తనకు ఉన్నట్టుండి వచ్చిన స్టార్ ఇమేజ్‌ను గిరిజ ఆసాంతం ఆస్వాదిస్తోంది. "నా జీవితంలో ఇలాంటి రోజు ఒకటి వస్తుందని ఊహించలేదు. నేనే కాదు ఎవరూ ఊహించలేరు. అయితే 'మీరు నా బేబ్‌గా ఉంటారా' అంటూ నాకు ఒక మెసేజ్ వచ్చింది. నాకు పెళ్లయిందని, ఒక కొడుకు ఉన్నాడని, ఎన్నో ఏళ్లుగా థియేటర్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నానని మీరు నా ఇన్‌స్టాగ్రామ్ చూస్తే తెలుస్తుంది. అందువల్ల సహజంగానే ఒక గౌరవ భావన వస్తుంది. కానీ 'నేషనల్ క్రష్' ట్యాగ్‌వల్ల 'బేబ్' లాంటి మాటలను కూడా వినాల్సి వస్తోంది. దీంతో 'నా పట్ల గౌరవం చూపాలా... లేక నన్ను లైంగిక దృష్టితో చూడాలా' అనే విషయంలో అభిమానుల్లో ఒక ఆసక్తికర విభజన కనిపిస్తోంది" అని, తనతోపాటు తన కుటుంబం కూడా మెసేజ్‌లను చూసి బాగా ఆస్వాదిస్తున్నారని ఇన్‌స్టాలో ఆమె చెప్పుకొచ్చింది.

"మా కుటుంబం సినీ రంగానికి చెందినదే కాబట్టి వారు వీటన్నిటినీ అర్థం చేసుకోగలరు. నా జీవితంలో ఇలాంటి అనుభవం ఎదురుకాలేదు. కనుక ఈ అనుభూతి కొత్తగా ఉంది. సరదాగానూ అనిపిస్తోంది. ఇదంతా జరిగినప్పుడు మా అబ్బాయి స్కూల్ ట్రిప్‌లో ఉండటంతో వాడికి ఏమీ తెలియలేదు. అయితే తనను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు విద్యార్థుల తల్లితండ్రులందరూ నన్ను చుట్టుముట్టారు. వీడియోల గురించి ఆసక్తిగా చర్చించారు. వాళ్లంతా ఏంమాట్లాడుతున్నారో వాడికి అర్థంకాలేదు. ఈ వైరల్ కాన్సెప్ట్ గురించి తరువాత వాడికి వివరించే ప్రయత్నం చేశాను. 'ఇప్పుడు ఇంత పేరు వచ్చింది కదా... నువ్వు మారిపోతావా' అని అడిగాడు. 'ఎందుకు మారను! ఇది 'గిరిజ-2 వెర్షన్. ఇకమీదట నువ్వు నాతో బాగా మాట్లాడాలి' అని మొదట సరదాగా అన్నాను. కానీ తరువాత... 'నేను ఎప్పటికీ మారను' అని వాడికి భరోసా ఇచ్చాను."

అదే నేను...

తారస్థాయిలో పేరు, 'నేషనల్ క్రష్' ట్యాగ్‌తో మీ జీవితంలో ఏదైనా మార్పు వచ్చిందా అని అడిగితే... "ఏమీ మారలేదు. అదే నేను. ఇప్పటికీ ఆటోరిక్షా దొరకడంలేదు. కొత్తగా ఆఫర్లూ రావడంలేదు" అని నవ్వుతూ బదులిచ్చింది. తన జీవితంలో అనుకోని ఈ ఘట్టాన్ని పూర్తిస్థాయిలో ఆస్వాదిస్తున్నా... కొంతమంది తుంటరి మెసేజ్‌లు బాధ కలిగిస్తుంటాయని, కానీ వెనక మాట్లాడేవారు ఒకవేళ ముందుకు వస్తే సూటిగా మన కళ్లలోకి కూడా చూడలేరని అంటుంది గిరిజ. ఇవన్నీ ఎలావున్నా ఎప్పటిలానే తన ప్రాజెక్టులు, పనుల్లో బిజీగా ఉంది.

జాలీ చీరలతో జాలీగా

ఫ్యాషన్ ప్రపంచంలో చీరలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఎప్పటికప్పుడు సరికొత్త హంగులు అద్దుకుంటూ నిత్య నూతనంగా కనువిందు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే జాలీ చీరల సందడి మొదలైంది. రెడ్ కార్పెట్ వేడుకల నుంచి కొత్త సినిమా ప్రమోషన్ల వరకూ సందర్భం ఏదైనా సరే సెలబ్రిటీలు అందమైన జాలీ చీరలు చుట్టుకుని మెరిసి మురిసిపోతున్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు సైతం వీటికే ఓటేయడంతో ఈ ఏడాది 'మెష్ అండ్ కట్‌వర్క్ జాలీ చీరలు' అత్యుత్తమ ఫ్యాషన్ ట్రెండ్‌గా నిలిచాయి.

మెరిసిన జెన్నిఫర్



గతవారం ఉదయ్‌పూర్‌లో జరిగిన నేత్ర మంతెన, వంశీ గాదిరాజుల వివాహ వేడుకలకు హాజరైన జెన్నిఫర్ లోపెజ్.. కట్-వర్క్ చేసిన లేత గులాబీ రంగు జాలీ చీర ధరించి వేదిక మీద ఆడి పాడారు. ఆమె ఇచ్చిన ప్రదర్శన కంటే కట్టుకున్న చీరే అందరి దృష్టినీ ఆకర్షించింది. జెన్నిఫర్ విదేశీ వనిత అయినప్పటికీ ఆ చీర కట్టులో భారతీయత ఉట్టిపడడం గమనార్హం. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ అరుదైన చీరను రూపొందించారు. చీర మొత్తాన్ని ల్యాటిస్ ప్యాటర్న్‌లో కట్ వర్క్ చేసి ఎంబ్రాయిడరీ వర్క్‌లు జోడించి స్వరోవస్కీ క్రిస్టల్స్‌తో డిజైన్ చేశారు. హెవీ సీక్విన్ వర్క్‌తో రూపొందించిన స్ట్రాప్‌లెస్ బ్లౌజ్.. చీరకు మరింత అందాన్నిచ్చింది. పాప్ సింగర్‌ను గుర్తుకు తెచ్చేలా చీర కొంగును చేతుల మీదుగా కిందికి జారవిడిచారు. నియాన్ లైట్ల కాంతికి చీరంతా తళుకులీనుతూ కనువిందు చేసింది. వజ్రాలు, పచ్చలు పొదిగిన పెద్ద చోకర్, జుంకాలు, మాంగ్ టిక్కా, ఉంగరాలు, గాజులు ధరించి గ్లామ్ మేకప్‌తో మెరిసిపోయారు జెన్నిఫర్.

ఎలా తయారుచేస్తారంటే...

జాలీ అంటే సన్నని వల(నెట్) అని అర్థం. చీర ఫ్యాబ్రిక్‌ను నెట్ మాదిరి డిజైన్ చేయడమే ఈ శైలి ప్రత్యేకత. సూదితో ఫ్యాబ్రిక్ దారాలను విడదీసి అందమైన నెట్ డిజైన్‌ను సృష్టిస్తారు. ఇది చికంకారి ఎంబ్రాయిడరీ, కోట డోరియా నేతలను పోలి ఉంటుంది. కొన్ని డిజైన్లను చీరలమీదే రూపొందిస్తుంటారు. ఎంబ్రాయిడరీ, జర్దోసీ వర్క్‌లతో కూడా అందమైన జాలీ డిజైన్లను సృష్టిస్తున్నారు. ఇలాంటివి పట్టు చీరల మీద బాగుంటాయి. ఆర్గంజా లాంటి సన్నని ఫ్యాబ్రిక్‌ల మీద కట్ వర్క్‌ను ఉపయోగించి వినూత్నమైన డిజైన్లు తయారుచేస్తున్నారు. లేజర్ కట్‌లు, ఆర్కిటెక్చరల్ మెష్‌లు, హ్యాండ్ కట్ ల్యాటిస్ వర్క్‌లు, మెటల్ మెష్‌లు, మెరిసే కేజ్‌లు, పూసల గ్రిడ్‌లతో సరికొత్త జాలీ డిజైన్లు సృష్టిస్తున్నారు. జాలీ చీరలు కట్టుకున్నప్పుడు వాటికి మ్యాచ్ అయ్యేలా సొగసైన రిచ్ బ్లౌజ్ ధరించడం తప్పనిసరి.

పూల పల్లూతో జాన్వీ



పరమ్ సుందరి సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో జాన్వీ కపూర్.. తెల్లని ల్యాటిస్ ప్యాట్రన్ జాలీ వర్క్ శారీతో సందడి చేశారు. చీర అంచులతోపాటు అక్కడక్కడా చేర్చిన గులాబీల ఎంబ్రాయిడరీ వర్క్ చీర సొగసును పెంచింది. తాజా మల్లె మొగ్గలు, రజనీగంధ పూలను మెష్ ప్యాటర్న్‌లో అల్లి ఈ చీర కొంగును రూపొందించారు. గులాబీ పూల ఎంబ్రాయిడరీ, సీక్విన్ వర్క్‌లతో బ్లౌజ్‌ను కూర్చారు. ప్రఖ్యాత తోరణి లేబుల్ ఈ చీరను ప్రత్యేకంగా కస్టమైజ్ చేసింది. వేలికి పెద్ద వజ్రపు టుంగరం, సాదా హీల్స్‌తో డీసెంట్‌గా కనిపించారు జాన్వీ.

గూచీ శారీతో అలియా



కేన్స్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో రెడ్ కార్పెట్ మీద సీక్విన్ గూచీ జాలీ చీరతో నడిచి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు అలియా భట్. ప్రఖ్యాత స్టయిలిస్ట్ రియా కపూర్ ఈ చీరను డిజైన్ చేశారు. ప్లంజింగ్ బ్లౌజ్, స్ట్రయిట్ స్కర్ట్, నేలను తాకే దుపట్టా లాంటి కొంగు ఈ చీర ప్రత్యేకత. వింటేజ్ లుక్‌లో కనిపించే డైమండ్ టెన్నిస్ నెక్లెస్ ధరించి భారతీయ వారసత్వాన్ని అందంగా ప్రదర్శించారు అలియా.

వెండి కట్‌వర్క్ పల్లూతో నీతా



ఇటీవల బ్రిటిష్ మ్యూజియంలో జరిగిన పింక్ బాల్ వేడుకల్లో నీతా అంబానీ లైట్ పింక్ కాంచీవరం చీర ధరించి మెరిసిపోయారు. ఈ చీరను స్వదేశీ చేనేతకారుడు ఆర్. వరదన్ రూపొందించారు. చీర కొంగును మాత్రం వెండి కట్‌వర్క్‌తో మనీష్ మల్హోత్రా డిజైన్ చేశారు. బెజ్వెల్డ్ బటన్స్‌తో కూడిన కోర్సెట్ బ్లౌజ్ ధరించి కుడి చేతి మీదుగా కొంగు వేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు నీతా.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రోల్ 2	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 01
స్టీఫెన్	తమిళ చిత్రం	డిసెంబర్ 05
అమెజాన్ ప్రైమ్		
థామా	హిందీ చిత్రం	డిసెంబర్ 02
ఆహా...		
ధూల్‌పేట్ పోలీస్ స్టేషన్	తెలుగు సిరీస్	డిసెంబర్ 05
జీ 5		
ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో	తెలుగు చిత్రం	డిసెంబర్ 05
ఈటీవీ విన్		
కరీముల్లా బిర్యానీ పాయింట్	తెలుగు చిత్రం	నవంబర్ 30

నిబంధనలు పాటించని.. స్లీపర్ బస్సులను పక్కన పెట్టండి

అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు

వరుస బస్సు ప్రమాదాలపై కమిషన్ ఆందోళన

మానవ హక్కుల రక్షణ చట్టం కింద విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ బస్సుల్లో భద్రతపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను పక్కన పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. తెలంగాణ, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలపై అందిన ఫిర్యాదులపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. ఇందులో ఓ పిటిషన్‌పై మానవ హక్కుల రక్షణ చట్టం-1993, సెక్షన్ 12 కింద మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కనూంగో విచారణ చేపట్టారు. ఈ పిటిషన్‌లో, "ప్రైవేట్ స్లీపర్ బస్సుల రూపకల్పనలో లోపాల వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. కొన్ని బస్సుల్లో డ్రైవర్ క్యాబిన్ ప్రయాణికుల కంపార్ట్‌మెంట్ నుంచి పూర్తిగా వేరు చేయబడి ఉంటోంది. దీనివల్ల ప్రమాదాల సమయంలో డ్రైవర్ తప్పించుకుంటుండగా.. ప్రయాణికులు మాత్రం మంటల్లో చిక్కుకుని మరణిస్తున్నారు. ప్రమాదాన్ని ప్రయాణికులు సకాలంలో గుర్తించకుండా అడ్డంకిగా మారుతోంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. జీవించే ప్రాథమిక హక్కును కాలరాయడమే. ఈ ఘటనలు బస్సులను తయారుచేసే కంపెనీలు, వాటి ఫిట్‌నెస్‌ను ఆమోదించే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పెంపొందించడంతోపాటు బాధిత కుటుంబాలకు పరిహారం నిర్ణయించేలా జోక్యం చేసుకోవాలి" అని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిని విచారించిన ప్రియాంక్ కనూంగో.. ఇందుకు సంబంధించి కేంద్ర రోడ్డు, రవాణా శాఖ కార్యదర్శి, పుణెలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అలాగే, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాద ఘటనలకు సంబంధించి తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు.

నాపై ఆరోపణలు అవాస్తవం

వర్సిటీ ప్రతిష్ఠ పెంపునకే ప్రయత్నించా.. అతి త్వరలో వెళ్లిపోతాడన్న వారే అసత్య ఆరోపణలు

- పీజీ పరీక్షల రీ వాల్యుయేషన్‌పై ఏ ఫోరెన్సిక్ పరీక్షకైనా రెడీ
- నిన్న రాజీనామా.. నేడు చాంబర్‌లో ప్రత్యక్షం
- కాళోజీ వర్సిటీ వీసీగా రాజీనామా చేసిన నందకుమార్‌రెడ్డి
- వీసీ న్యాయం చేశారు: విద్యార్థిని హిమజ



డాక్టర్ నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి (వైస్ చాన్స్‌లర్)గా రాజీనామా చేసిన డాక్టర్ నంద కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తాను విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ పెంచడానికే పలు ప్రయత్నాలు చేశానని చెప్పారు. 8 నెలల క్రితం వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే 'అతి త్వరలో వెళ్లిపోతాడు' అని ప్రచారం చేసిన వారే తనపై తప్పుడు ఆరోపణలు చేయించారని ఆయన పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణల్లో ఒక్కశాతమూ వాస్తవం లేదని, విజిలెన్స్ కమిటీ విచారణ అన్న అంశం పత్రికల్లోనే చూశానని, ఎవరూ తనను విచారించలేదన్నారు. పరిపాలన గాడి తప్పిందన్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీగా రాజీనామా చేసిన డాక్టర్ నంద కుమార్ రెడ్డి శనివారం యూనివర్సిటీకి వచ్చారు. తాను చేసిన రాజీనామాను గవర్నర్ ఇంత వరకు ఆమోదించలేదని చెప్పారు. అధికారికంగా సమీక్షించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీజీ వైద్య పరీక్షా ఫలితాలపై ఓ కళాశాల విద్యార్థిని లిఖిత పూర్వక ఫిర్యాదు మేరకు ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రీ వాల్యుయేషన్ చేయించాలని సూచించిందని వెల్లడించారు. ఆ కళాశాలలోని ప్రత్యేక పరిస్థితుల వల్లే సదరు విద్యార్థిని ఫెయిల్ అయిందని, తాము రీ వాల్యుయేషన్ చేయించడం వల్లే ఉత్తీర్ణురాలయ్యారన్నారు. దీనిపై ఏ ఫోరెన్సిక్ విచారణకైనా సిద్ధమేనని నంద కుమార్‌రెడ్డి తేల్చి చెప్పారు. ప్రస్తుత కంట్రోలర్ సహా ఇతర అధికారులంతా గత ప్రభుత్వంలో నియమితులైన వారేనని తెలిపారు. గత సర్కారు హయాంలోనే ఒక ప్రశ్న పత్రానికి బదులు మరో ప్రశ్నా పత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారని ఆయన వివరించారు. విశ్వ విద్యాలయ ఉప కులపతిగా తన నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతను పాటించిందన్నారు. బోర్డు సమావేశాలకు ఉపయోగ పడుతుందనే హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేశానన్నారు. కేవలం 20శాతం సిబ్బందితోనే యూనివర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లానన్న నంద కుమార్ రెడ్డి.. వారంలోనే పీజీ వైద్య విద్య పరీక్ష ఫలితాలు వెల్లడించామన్నారు.

విచారణ కమిటీ వల్లే న్యాయం

రీ వాల్యుయేషన్ ఆరోపణలతో వైస్ చాన్స్‌లర్ రాజీనామా చేయడంతో శనివారం యూనివర్సిటీకి వచ్చిన పీజీ వైద్య విద్య ఫైనలియర్ విద్యార్థిని డాక్టర్ హిమజ స్పందిస్తూ.. 'నేను ఆరోగ్యం సహకరించకున్నా చదివి 4 పేపర్లు బాగానే రాశాను. ఒక పేపర్‌లో ఫెయిల్ కావడంతో ప్రత్యక్షంగా కలిసి నేను చేసిన ఫిర్యాదు మేరకే కమిటీని వేసిన వీసీ నంద కుమార్ రెడ్డి నాకు న్యాయం చేశారు' అని చెప్పారు.

- పీజీ ఫైనల్ విద్యార్థిని హిమజ

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంబురాలు

ఉపకులపతిగా డాక్టర్ నంద కుమార్ రెడ్డి రాజీనామా చేశారన్న వార్తతో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం సంబురాలు చేసుకున్నారు. యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి.. పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పి.ప్రభాకర్ మాట్లాడుతూ.. 'వీసీగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నన్ను హైదరాబాద్‌కు రావాలని ఒత్తిడి చేశారు. తక్కువ వేతనాలకు పని చేస్తున్నాం. నా తండ్రి ఆరోగ్యం బాగా లేదని తెలిసినా బలవంతంగా హైదరాబాద్ తీసుకెళ్లారు. 3 నెలల్లో 24 గంటలు ఇతర పనులు చేయించుకున్నారు. నా ఆరోగ్యం సహకరించడం లేదని చెప్పడంతో ఉద్యోగం నుంచి తొలగించారు' అని చెప్పారు.

కరేబియన్ దీవుల్లో ఐ బొమ్మ ఏజెన్సీలు!

- కాంట్రాక్టు పద్ధతిలో ఏర్పాటుచేసిన రవి
- ఐ అంటే ఇంటర్నెట్.. బొమ్మ అంటే సినిమా
- 'బలపం'లో 'ఎల్' తీసి బప్పం టీవీ.. విచారణలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని రెండో విడత కస్టడీలోకి తీసుకున్న సైబర్ క్రైం పోలీసులు 3 రోజుల పాటు ప్రశ్నించారు. విచారణలో రవి దందా గురించి పూర్తి వివరాలు సేకరించారు. రవి లాప్‌టాప్, ఫోన్లలోని సమాచారాన్ని రిట్రీవ్ చేసిన సైబర్ క్రైం అధికారులు... దాని ఆధారంగా ప్రశ్నలు అడిగి వివరాలు రాబట్టారు. రవి ఇచ్చిన సమాచారం మేరకు క్లౌడ్ సర్వర్‌ను తెరవగా 21 వేల సినిమాలు ఉన్నట్లు గుర్తించారు. విచారణ పూర్తి చేసి రవిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. సినిమాలను ఎన్‌క్రిప్ట్ చేసే అధునాతన సాఫ్ట్‌వేర్, టెలిగ్రాం ద్వారా పైరసీ సినిమాల కొనుగోళ్లు, క్రిప్టో చెల్లింపులు, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల ప్రచారం గురించి పూర్తి సమాచారం సేకరించారు. కరేబియన్ దీవుల్లో కాంట్రాక్టు పద్ధతిన ఏజెన్సీలను ఏర్పాటు చేసినట్లు రవి విచారణలో తెలిపినట్టు సమాచారం. ఈ విచారణలో ఐ బొమ్మ, బప్పం టీవీల పేర్లకు సంబంధించి సమాచారం తెలిసింది. ఐ అంటే ఇంటర్నెట్, బొమ్మ అంటే సినిమా.. రెండింటిని కలిపి ఇంటర్నెట్ సినిమా అని పేరు పెట్టాడు. బలపం టీవీ అన్న పేరుకు సాంకేతిక సమస్య రావడంతో 'ఎల్' అక్షరం తొలగించి బప్పం టీవీగా మార్చినట్లు దర్యాప్తులో తెలిసింది.

పౌల్ట్రీ రంగ ప్రముఖుడు చిట్టూరి జగపతిరావు కన్నుమూత



హైదరాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ఆధునిక పౌల్ట్రీరంగ పితామహుల్లో ఒకరు, నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ వ్యవస్థాపకులు, శ్రీనివాస ఫార్మ్స్ అధినేత చిట్టూరి జగపతిరావు(92) కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో ఇబ్బందిపడుతున్న సీజే రావు శనివారం తెల్లవారుజామున జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కూళ్ల. కోల్‌కతా జాదవ్‌పూర్ వర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. జగపతిరావు సతీమణి మంగాయమ్మ. వీరికి ముగ్గురు సంతానం. కుమారుడు సురేష్ రాయుడు, కుమార్తెలు పద్మ, ఉషాలక్ష్మి ఉన్నారు. సురేష్ ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉన్నత విద్య అనంతరం స్వస్థలానికి వచ్చిన సీజే రావు.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 1965లో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో చిన్న పౌల్ట్రీఫామ్‌తో వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించారు. శ్రీనివాస హాచరీస్ పేరుతో వ్యాపారాన్ని విస్తరించారు. అనతికాలంలోనే కోళ్ల పరిశ్రమలో అంచెలంచెలుగా ఎదిగిన జగపతిరావు.. కోళ్ల పరిశ్రమలో ప్రముఖుడిగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. భారతదేశ ఆధునిక పౌల్ట్రీ రంగానికి పితామహుడిగా పేరు గడించారు. జగపతిరావు భౌతికకాయాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.


చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మా' ఎన్నికలు అప్పుడే

శనివారం 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) జనరల్ బాడీ మీటింగ్ జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కొన్ని కీలక విషయాలను చర్చించినట్లు టాక్. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లో ఆర్థిక లావాదేవీలు అన్నింటినీ పరిశీలిస్తారట. మేలో ఎన్నికలు నిర్వహించాలని సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటారని సమాచారం. ఎవరైనా అగ్రహీరో కార్యనిర్వాహణ బాధ్యతలు తీసుకోవడానికి ముందుకువస్తే ఆ వ్యక్తిని 'మా' ప్రెసిడెంట్‌గా ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

పెద్ది ఫైట్ సీక్వెన్స్



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ కీలక అప్డేట్‌ను మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ ఫైట్‌ను ప్రముఖ బాలీవుడ్ స్టంట్ డైరెక్టర్, హీరో విక్కీ కౌశల్ తండ్రి శ్యామ్ కౌశల్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆయన గతంలో సూపర్ హిట్ చిత్రం 'దంగల్'కు యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. సినిమాలో ఈ ఫైట్ సీక్వెన్స్ ఎంతో కీలకమైనదని మేకర్స్ తెలిపారు. చిత్రానికే ప్రధానాకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు వస్తోందీ చిత్రం.

డిసెంబర్ 1 నుంచి సావిత్రి మహోత్సవ్



తెలుగు చలన చిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానటి సావిత్రి. డిసెంబర్ 6న ఆమె 90వ జయంతి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 'సావిత్రి మహోత్సవ్' పేరుతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6 వరకూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సంగమం సంస్థతో కలసి నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో సావిత్రి నటించిన చిత్రాల ప్రదర్శనలు, పాటల పోటీలు నిర్వహిస్తామనీ, చివరి రోజున సావిత్రి స్మారకార్థం 'మహానటి' చిత్ర దర్శకుడు నాగ్‌అశ్విన్, నిర్మాతలు ప్రియాంకదత్, స్వప్నాదత్, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ముగింపు వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.

ప్రేమ, కుటుంబ విలువలతో



రాజు వెడ్స్ రాంబాయి ఫేం అఖిల్ రాజ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'అర్జునుడి గీతోపదేశం'. వరలక్ష్మి శరత్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సతీశ్ గోగాడ దర్శకత్వంలో ఫస్ట్ కట్ ఫిలిం బేనర్‌పై త్రిలోక్‌నాథ్ కాశిశెట్టి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. చివరి షెడ్యూల్‌ను డిసెంబర్ తొలి వారంలో ప్రారంభిస్తామని నిర్మాత తెలిపారు. 'స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది, ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, వసంతిక మచ్చ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: చైతన్య కందుల

'అఖండ'ను మించిన సన్నివేశాలుంటాయి

ఆది పినిశెట్టి



'అఖండ'ను మించిన భారీ సన్నివేశాలు 'అఖండ 2: తాండవం'లో ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, తమన్ మ్యూజిక్, ఎలివేషన్స్‌ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది' అని అన్నారు నటుడు ఆది పినిశెట్టి. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రను పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. సినిమా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు వస్తోన్న సందర్భంగా ఆది పినిశెట్టి చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'అఖండ 2'లో ఓ పోరాట సన్నివేశాన్ని ఎండాకాలంలో 15 రోజుల పాటు నిర్విరామంగా చిత్రీకరించారు. చాలా మంది ఎండ వేడికి తట్టుకోలేకపోయారు. కానీ బాలయ్య మాత్రం కనీసం గొడుకు కూడా లేకుండా ఎండలోనే నిల్చునేవారు. సినిమా పట్ల ఆయనకు ఉండే ప్రేమ, పిచ్చి నాకు అప్పుడు అర్థమైంది. బోయపాటి గారి మీద నాకు నమ్మకం ఎక్కువ. ఆయన సత్తా ఏమిటో నాకు తెలుసు. అందుకే నేను కథ వినకుండానే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించాను. సెట్‌కి వెళ్లిన తర్వాతే కథ, నా పాత్ర గురించి తెలిశాయి. ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర నటుడిగా నాకు ఓ ప్రయోగం లాంటిది. ఇలానే ఉండాలి...ఇలానే కనిపించాలి..ఇలానే ప్రవర్తించాలి అని బోయపాటి గారు నాకు ముందే కొన్ని రిఫరెన్స్‌లు ఇచ్చారు. బాలకృష్ణ గారు సెట్‌లో ఉంటే పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. పనిలో ఆయనను అందుకోవడం చాలా కష్టం' అని ఆది పినిశెట్టి చెప్పారు.



సోగ్గాడుకు స్వర్ణోత్సవం

'సోగ్గాడు'గా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు శోభన్‌బాబు. ఆయన నటించిన 'సోగ్గాడు' చిత్రానికి డిసెంబర్ 19కి యాభై ఏళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో ఆ చిత్ర స్వర్ణోత్సవాన్ని సురేశ్ ప్రొడక్షన్స్, అఖిలభారత శోభన్‌బాబు సేవాసమితి సంస్థలు భారీ స్థాయిలో నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ పోస్టర్‌ను పలువురు ప్రముఖులు రామానాయుడు స్టూడియోలో జరిగిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ శోభన్‌బాబుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అలనాటి 'మానవుడు దానవుడు' చిత్రం తనకు ఎప్పటికీ ఇష్టమైన చిత్రంగా పేర్కొన్నారు. శోభన్‌బాబు తమ సంస్థలో పది చిత్రాల్లో నటించారనీ, వాటిల్లో 'సోగ్గాడు' స్థానం ప్రత్యేకమైనదని నిర్మాత సురేశ్‌బాబు పేర్కొన్నారు.


ట్రెండ్‌కు తగ్గట్లుగా ఉంటుంది

సందీప్ రాజ్



'నాకు ఇచ్చిన బడ్జెట్‌లో సినిమాను ఎంత గొప్పగా తీయగలనో చూసుకుంటాను. 'మోగ్లీ'ని అనుకున్న బడ్జెట్‌లో అద్భుతంగా తీశానని అనుకుంటున్నాను' అని అన్నారు దర్శకుడు సందీప్ రాజ్. రోషన్ కనకాల కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. డిసెంబర్ 12న విడుదలవుతున్న సందర్భంగా సందీప్ రాజ్ మీడియాతో ముచ్చటించారు. 'ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగానే 'మోగ్లీ' సినిమా ఉంటుంది. సినిమా ఫస్ట్ హాఫ్ ఆద్యంతం నవ్వించేలా సాగుతుంది. మొత్తం ఐదు పాటలుంటాయి. అన్ని రకాల అంశాల్ని చూపించేలా వాటిని చిత్రీకరించాం. బండి సరోజ్ పాత్రను చూసి అందరూ షాక్ అవుతారు. గత కొన్నేళ్లుగా తెలుగులో ఇలాంటి పాత్రను చూసి ఉండరు' అని చెప్పారు.

క్రీడా నేపథ్యంలో



సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'గోట్'. దివ్య భారతి కథానాయిక. ఎం. చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవలే చిత్రబృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'క్రికెట్ క్రీడ నేపథ్యంలో వినోదం ప్రధానాంశంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వినోదంతో పాటు సంగీతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. లియోన్‌జేమ్స్ స్వరపరిచిన పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం మా సినిమాకు ప్రధానాకర్షణ. త్వరలోనే 'గోట్' విడుదల తేదీని ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

అద్భుతమైన ప్రేమకథతో...



నవీన్, కుసుమ చందక జంటగా సురేశ్ లంకలపల్లి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. మాదాల వెంకటకృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'గీతాంజలి', 'తొలిప్రేమ', 'అందాల రాక్షసి' లాగా ఈ సినిమా కూడా ప్రేక్షకుల హృదయాల్లో ఓ అద్భుతమైన ప్రేమకథలా నిలిచిపోతుంది' అని అన్నారు. సురేశ్ లంకలపల్లి మాట్లాడుతూ 'భావోద్వేగాలు, వినోదం నిండిన సరికొత్త ప్రేమకథ ఇది' అని చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,820 ▲	1,19,000 ▲	1,92,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,73,000 ▲
విశాఖపట్నం	1,29,820 ▼	1,19,000 ▲	1,92,000 ▲
రాజమండ్రి	1,29,820 ▲	1,19,000 ▲	1,74,000 ▲
ప్రొద్దుటూరు	1,27,000 ▲	1,16,840 ▲	1,73,000 ▲
ముంబై	1,26,591 ▲	1,15,957 ▲	1,64,359 ▲

బిజినెస్ ప్లస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	650
వరంగల్	632	గోదావరి	625
చిత్తూరు	663	విశాఖపట్నం	615
		డజను గుడ్లు రూ. 90	

ప్రమోషనల్ స్కీములపై జీఎస్టీ ఉంటుందా..!



రాంబాబు గొండాల

సద్గురు ఎలక్ట్రానిక్స్ అనే సంస్థకు పలు పట్టణాల్లో మొబైల్ షోరూమ్స్ ఉన్నాయి. మార్కెట్లో ఎదురయ్యే పోటీని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులను ఆకర్షించేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రూ.20,000 విలువ గల మొబైల్ కొనుగోలు చేస్తే రూ.3,000 విలువ చేసే ఒక లెదర్ బ్యాగ్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఇంకా కొన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల మీద ఒకటి కొంటే మరొకటి ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీనికి గాను ఉచితంగా ఇచ్చే వస్తువులను సద్గురు ఎలక్ట్రానిక్స్ పెద్దఎత్తున కొనుగోలు చేయటంతో పాటుగా వాటి మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కూడా తీసుకుంది.

అయితే ఇక్కడ వీరికి వచ్చిన సమస్య ఏమిటంటే ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద జీఎస్టీ చెల్లించాలా? లేదంటే సంబంధిత ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా? నిజానికి ఇలాంటి పథకాలను చాలా వ్యాపార సంస్థలు అమలు చేస్తూ ఉంటాయి. ఇంత మొత్తంలో బట్టలు కొనుగోలు చేస్తే గోల్డ్ కాయిన్ ఉచితం అని, అలాగే బంగారం కొనుగోలు చేసినప్పుడు వెండి ఉచితం అని చెబుతుంటారు. ఇవన్నీ ప్రమోషనల్ స్కీమ్స్ విభాగానికి చెందుతాయి. మరి వీటికి సంబంధించి జీఎస్టీ నిబంధనలు ఏమి చెబుతున్నాయో తెలుసుకుందాం.

పన్ను చెల్లించాలా..?

ముందుగా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద జీఎస్టీ చెల్లించాలా? ఏదేనీ అమ్మకం లేదా ఇతర లావాదేవీ, జీఎస్టీ కిందకు రావాలంటే ముందుగా అది 'సరఫరా' నిర్వచనంలోకి రావాలి. అలా రావాలంటే ఆ లావాదేవీకి సంబంధించి ఏదేనీ 'మొత్తం' అంటే డబ్బు లేదా ఇతర కన్సిడరేషన్ ఏదైనా సరఫరాదారునికి రావాలి. అప్పుడు మాత్రమే అది సరఫరా కిందకు వస్తుంది. అలాగే జీఎస్టీ వర్తిస్తుంది. పైన తెలిపిన ఉదాహరణలో ఆయా వస్తువులను ఉచితంగా ఇస్తున్నారు కాబట్టి అది 'సరఫరా' కిందకు రాదు. దీంతో జీఎస్టీ చెల్లించనవసరం లేదు. (అమ్మకందారుడికి, కొనుగోలుదారుడికి మధ్య ఇతర సంబంధ బాంధవ్యాలు ఏమైనా ఉంటే. అంటే ఈ ఇరువురు రిలేటెడ్ పర్సన్స్, డిస్టింక్ట్ పర్సన్ విభాగంలోకి వస్తే ఆ నిబంధనలు వేరే ఉంటాయి).

ఐటీసీ రివర్స్ చేయాలా?

ఇకపోతే, ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద తీసుకున్న ఐటీసీ రివర్స్ చేయాలా? ఇది మరొక సందేహం. జీఎస్టీ నిబంధనల ప్రకారం ఏదేనీ వస్తువును గిఫ్ట్ కింద ఉచితంగా ఇస్తే సంబంధిత ఐటీసీ రివర్స్ చేయాలి. మరి ఇలా ఇచ్చే వస్తువులు గిఫ్ట్ కింద భావించాలా అంటే, దీనికి ప్రభుత్వం ఒక వివరణ ఇచ్చింది. ఒక వస్తువు కొన్నప్పుడు మరొక వస్తువు ఇవ్వటం అనేది గిఫ్ట్ కిందకు రాదు. ఎందుకంటే ఆ వస్తువును ఉచితంగా ఇచ్చినట్లు కనిపించినప్పటికీ.. మరొక వస్తువును కొనుగోలు చేసినప్పుడు మాత్రమే ఈ వస్తువును ఇవ్వటం జరుగుతుంది. అంటే, రెండు వస్తువులకు కలిపి బిల్ చేసినట్లు భావించాలి. కాబట్టి ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు. అలా కాకుండా కొనుగోలుతో సంబంధం లేకుండా పూర్తి ఉచితంగా ఒక వస్తువును ఇస్తే అప్పుడు మాత్రమే ఐటీసీ రివర్స్ చేయాలి. అంటే మందుల తయారీదారులు.. డాక్టర్లకు ఉచిత శాంపిల్స్ ఇవ్వటం లాంటిది.

పైన చెప్పిన ఉదాహరణలో రూ.15,000 మొబైల్ కొనుగోలు చేస్తే ఒక బ్యాగ్ ఇవ్వటం అంటే నిజానికి మొబైల్, బ్యాగ్ రెండు కలిపి రూ.15,000కు ఇస్తున్నట్లు.. అంతేకానీ బ్యాగ్ ఉచితంగా ఇచ్చినట్లు భావించనవసరం లేదు. కాబట్టి ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు.

అయితే ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల వివరాలు కూడా బిల్లులో కూడా చూపాలి. అంటే తీసుకునే మొత్తం రెండింటికి కలిపి అని అర్థం కావాలి. అలాగే జీఎస్టీలో కాంపోజిట్ లేదా మిక్స్‌డ్ సరఫరా అనే రెండు రకాల సరఫరాలు ఉంటాయి. ఎప్పుడైతే రెండు వస్తువులను ఒకటే ధరకు అమ్ముతారో అప్పుడు ఆయా వస్తువుల మధ్య ఉన్న సంబంధాన్ని బట్టి అది ఏ సరఫరా అనేది నిర్ధారణ అవుతుంది. ఒకవేళ మీరు అమ్మే వస్తువు.. ఉచితంగా ఇచ్చే వస్తువు మిక్స్‌డ్ సరఫరా కిందకు వస్తే మాత్రం.. ఎక్కువ జీఎస్టీ ఏ వస్తువు మీద ఉందో అదే జీఎస్టీ మొత్తం బిల్లుకి వర్తిస్తుంది. కాబట్టి వ్యాపారస్తులు ఈ విషయం మీద అవగాహన కలిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



ఐటీ రిఫండ్స్ ఇంకా రాలేదా!

పెద్ద మొత్తంలో ఆదాయ పన్ను చెల్లించిన చాలా మందిలో ఇప్పుడు ఒకటే టెన్షన్. తమకు రావాల్సిన రిఫండ్ ఎప్పుడు వస్తుందా? అని. రిటర్నులు దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ ప్రారంభమై ఆయా వ్యక్తుల రిఫండ్స్ మొత్తం వారి ఖాతాల్లో జమ అయ్యేది. అయితే ఈసారి మాత్రం రిఫండ్స్ ఆలస్యమవుతుండటంతో చాలా మందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ విషయంలో చాలా మంది తమ బాధను వెళ్లగక్కేందుకు సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు డిసెంబరు నెలాఖరు కల్లా రిఫండ్స్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఐటీ శాఖ అంటోంది. ఇంతకీ ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి రావాల్సిన రిఫండ్స్ ఎందుకు ఆలస్యం అవుతున్నాయో ఒకసారి తెలుసుకుందాం. అంతే కాదు రిఫండ్ స్టేటస్‌తో పాటు ఎలా చెక్ చేసుకోవాలో తెలుసుకుందాం.

ఎవరు అర్హులు? టీడీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ లేదా సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా చెల్లించాల్సిన పన్ను కంటే అధిక ఆదాయ పన్ను చెల్లించిన ఆదాయ పన్ను చెల్లింపుదారులు అందరూ ఐటీ రిఫండ్స్‌కు అర్హులు.

కాలపరిమితి ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 143 (1) ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసిన తొమ్మిది నెలల్లోగా ఐటీ శాఖ ఐటీ రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే నెలాఖరు వరకు ఇందుకు గడువు ఉంది. అయితే ఎప్పటిలోగా రిఫండ్ ప్రక్రియ పూర్తి చేయాలనే దానిపై మాత్రం ఎలాంటి స్పష్టత లేదు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నుల ఫైలింగ్ ఈ ఏడాది సెప్టెంబరు 16తో ముగిసింది. దీంతో ఐటీ శాఖ ఈ ఏడాది డిసెంబరులోగా రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అన్నీ సజావుగా ఉన్న రిఫండ్స్ క్లెయిమ్స్‌ను కూడా ఆ లోగానే పూర్తి చేస్తామని ఇటీవల సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ ప్రకటించడం విశేషం.

వడ్డీతో సహా ఎలక్ట్రానిక్ -వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే రిఫండ్ ప్రక్రియ ప్రారంభమై మీ బ్యాంకు ఖాతాలో రిఫండ్ మొత్తం జమ అవుతుంది. అన్నీ సజావుగా ఉన్నా రిఫండ్ ఆలస్యమైతే, రిఫండ్ మొత్తంపై ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి నెలకు అర శాతం (0.5%) చొప్పున వడ్డీ చెల్లిస్తారు. అయితే ఇది గడువులోగా ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారికి మాత్రమే వర్తిస్తుంది. మిగతా వారికి రిటర్న్ ఫైల్ చేసిన గడువు నుంచి చెల్లిస్తారు.

ప్రక్రియ వేగవంతం చేయడం ఎలా?

- ఐటీ శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో లాగినై రిఫండ్/రిటర్న్ స్టేటస్ తెలుసుకోవాలి
- రిఫండ్.. బ్యాంకు ఖాతాలో జమ అయినది లేనిది చెక్ చేసుకోవాలి
- నిర్ధారణ కోసం ఐటీ శాఖ జారీ చేసే నోటీసులు, విజ్ఞప్తులకు వెంటనే స్పందించాలి
- ఐటీ శాఖ పోర్టల్‌లోని ఈ-నివారణ్ సెక్షన్ ద్వారా మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు రావాలి
- ఫాలో అప్ కోసం ఐటీ శాఖకు చెందిన సీపీసీ హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించాలి
- ప్రాసెసింగ్ పూర్తయిన తర్వాత కూడా సరైన కారణం లేకుండా రిఫండ్ ఆలస్యం చేస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలి

ఆలస్యానికి కారణాలు

- పెద్ద మొత్తంలో ఉన్న రిఫండ్స్ క్లెయిమ్స్‌ను సమగ్రంగా పరిశీలించాల్సి రావడం
- కొన్ని రిటర్నుల్లో పేర్కొన్న అనుమానాస్పద డిడక్షన్లను ఐటీ అధికారులు వ్యక్తిగతంగా సమీక్షించాల్సి రావడం
- కొన్ని రిటర్నుల్లో తప్పుడు లేదా అధిక డిడక్షన్లు పేర్కొనడం
- రిఫండ్ జమ కావాల్సిన బ్యాంకు ఖాతా చెల్లుబాటులో లేకపోవడం
- ఎలక్ట్రానిక్ (ఈ)-వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండడం
- ఐటీ శాఖ నోటీసులకు పన్ను చెల్లింపుదారులు సరిగా స్పందించక పోవడం
- ప్రస్తుత రిఫండ్ క్లెయిమ్‌ను గత ఆర్థిక సంవత్సరానికి బాకీ ఉన్న పన్ను చెల్లింపునకు జమ చేయడం

ధ్రువ స్పేస్ రూ.52 కోట్ల సమీకరణ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్పేస్‌టెక్ స్టార్టప్ ధ్రువ స్పేస్ వ్యాపార విస్తరణలో భాగంగా ప్రీ-సిరీస్ బీ ఫండింగ్ రౌండ్‌లో రూ.51.76 కోట్ల నిధులను సమీకరించింది. ఈ ఫండింగ్ రౌండ్‌కు అడిటమ్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ (ఏవీసీఎఫ్ఐ) యాంకర్ ఇన్వెస్టర్ వ్యవహరించగా, మరో 33 మంది ఇన్వెస్టర్లు ఇందులో పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	110	విజయవాడ	113
వరంగల్	110	గుంటూరు	118
కరీంనగర్	110	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	112	అనంతపురం	112
గోదావరి	113		

ఎయిరిండియా మా బాధ్యత కూడా..

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

ముంబై: టాటా గ్రూప్‌నకు "ఎయిరిండియా కేవలం వ్యాపార అవకాశం మాత్రమే కాదు. బాధ్యత కూడా" అని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. విమానయాన రంగంలో సవాళ్లు కొనసాగుతున్నాయని, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలోని సమస్యలు విమానాల విడిభాగాలు, మౌలిక సదుపాయాలు, కొత్త విమానాల లభ్యతను అనిశ్చితిలోకి నెట్టాయన్నారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకులు జేఆర్‌డీ టాటా 121వ జయంతి కార్యక్రమంలో చంద్రశేఖరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఎయిరిండియాను 2022 జనవరిలో రూ.18,000 కోట్లకు టాటా సన్స్ దక్కించుకుంది. అప్పటి నుంచి ఎయిరిండియాను ప్రపంచ స్థాయి ఎయిర్‌లైన్స్‌గా తీర్చిదిద్దేందుకు టాటా గ్రూప్ తీవ్ర కసరత్తు చేస్తోంది.

ఐవీఆర్‌సీఎల్ లిక్విడేషన్ మళ్లీ మొదటికి!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ (ఈపీసీ) కంపెనీ ఐవీఆర్‌సీఎల్ లిమిటెడ్ లిక్విడేషన్ (ఆస్తుల అమ్మకం) ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. ఐవీఆర్‌సీఎల్‌ను రూ.1,200 కోట్లకు దక్కించుకున్న బిడ్డర్ పీ. ప్రసాద్ రెడ్డి నిర్దేశిత సమయం లోగా కంపెనీ రుణదాతలకు చెల్లింపులు జరపడంలో విఫలమయ్యారు. దాంతో ఎస్‌బీఐ నేతృత్వంలోని రుణదాతల కన్సార్షియం ఆరేళ్లుగా (2017 నుంచి) సాగుతున్న ఐవీఆర్‌సీఎల్ దివాలా పరిష్కార ప్రక్రియను పునఃప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, గత లిక్విడేటర్‌ను కూడా మార్చేసింది. ఐవీఆర్‌సీఎల్ రుణదాతలకు రూ.14,500 కోట్లకు పైగా బకాయిపడింది.

స్పోర్ట్స్

'కోచింగ్‌ను వదిలెయ్'

రాంచీ: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను కోల్పోవడంతో భారత కోచ్ గంభీర్‌పై అభిమానులు ఆగ్రహంతో ఉన్నారు. రెండో టెస్టు ముగిశాక ప్రేక్షకులు అతడిని గేలి చేయడం కనిపించింది. తాజాగా తొలి వన్డేకు ముందు రాంచీ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లోనూ గౌతీకి చేదు అనుభవం ఎదురైంది. 'న్యూజిలాండ్ చేతిలో 0-3, సౌతాఫ్రికా చేతిలో 0-2 తేడాతో ఓడిపోయాం. గంభీర్ నువ్వు కోచింగ్‌ను వదిలేయ్. సొంతగడ్డపైనే సఫారీలపై గెలవలేమని భావిస్తే.. ఇక 2027 వరల్డ్‌కప్‌ను మర్చిపోవాల్సిందే' అని స్టాండ్స్ నుంచి ఓ ప్రేక్షకుడు గట్టిగా అరిచాడు.



గచ్చిబౌలిలో రేసింగ్ పోటీలు

గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ రౌండ్-2 పోటీల పోస్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. వచ్చే నెల ఆరో తేదీన ఈ పోటీలు జరగనున్నాయి. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ఈ పోటీలకు అతిథిగా హాజరవనున్నాడు.




అంధుల టీ20 ప్రపంచకప్ గెలిచిన తెలుగమ్మాయి దీపిక సారథ్యంలోని భారత మహిళల జట్టు సభ్యులు శనివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. తాము సంతకాలు చేసిన బ్యాట్‌ను రాష్ట్రపతికి అందజేశారు.

గంగూలీ భార్య డోనాకు ఆన్‌లైన్ వేధింపులు



పోలీసులకు ఫిర్యాదు

కోల్‌కతా: టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ భార్య, ప్రముఖ నృత్య కళాకారిణి డోనా గంగూలీ ఆన్‌లైన్‌లో వేధింపులకు గురయ్యారు. ఇటీవల కోల్‌కతా ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా డోనా నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించి కొందరు ఆకతాయిలు ఆమెను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో.. ప్రధానంగా ఫేస్‌బుక్‌లో అసభ్యకరమైన కామెంట్లు పోస్టులు చేశారు. ఈ ఘటనపై డోనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


రోహిత్

ఆ ఇద్దరిపైనే..

రోహిత్, కోహ్లీపై దృష్టి ● వరల్డ్‌కప్ బెర్త్ ఆశిస్తున్న ద్వయం

- నేటి నుంచి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్
- కోచ్ గంభీర్‌కూ కీలకమే
- గెలుపే ధ్యేయంగా టీమిండియా

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో


ప్రాక్టీస్‌లో రాహుల్, కోహ్లి

రాంచీ: దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ పరాభవం తర్వాత భారత జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌పై దృష్టి సారించింది. ఆదివారం నుంచి ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరుగనున్నాయి. చాలా రోజుల తర్వాత వెటరన్ స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ స్వదేశంలో భారత్ తరఫున ఆడనుండడంతో ఈ సిరీస్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. అలాగే రానున్న రెండు నెలల్లో భారత జట్టు కేవలం ఆరు వన్డేలు మాత్రమే ఆడనుంది. దీంతో 2027 వరల్డ్‌కప్‌లో చోటు దక్కించుకోవాలనుకుంటున్న ఈ ఇద్దరికీ ఇందులో రాణించడం కీలకంగా మారింది. ఒకవేళ అంచనాలను అందుకోలేకపోతే మెగా టోర్నీలో వారికి చోటు దక్కడం క్లిష్టంగా మారుతుంది. అయితే 2013లో రోహిత్ ఇదే రాంచీ మైదానంలో తొలిసారి ఓపెనర్‌గా అవతారమెత్తి జట్టు ఆటతీరునే మార్చేశాడు. ఆసీస్ పర్యటనలో పర్వాలేదనిపించిన రో-కో సొంతగడ్డపైనా అదరగొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. అటు టెస్టు సిరీస్‌ను 0-2తో కోల్పోవడంతో కోచ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ సిరీస్‌ను గెలవడం అతడికి కూడా అత్యంత ఆవశ్యకంగా మారింది. దీనికి తోడు ఆసీస్ పర్యటనలో 1-2తో భారత్ వన్డే సిరీస్ ఓడిన విషయం తెలిసిందే. పాతికేళ్ల తర్వాత ఇక్కడ టెస్టు సిరీస్‌ను గెలిచిన ఆనందంలో ఉన్న సఫారీలు ఆత్మవిశ్వాసంతో వన్డే బరిలోకి దిగనున్నారు.

కీలక ఆటగాళ్లు లేకుండానే..

గాయాలతో కెప్టెన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయాస్.. విశ్రాంతి పేరుతో పేసర్ బుమ్రా, సిరాజ్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. దీంతో బ్యాటింగ్ ఆర్డర్ బలహీనంగా కనిపిస్తుండగా.. బౌలింగ్‌లోనూ ప్రధాన పేసర్లు లేకపోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు అనుకూలించే వీలుంది. అలాగే జట్టు కూర్పు కూడా సమస్యగా మారింది. ఓపెనర్‌గా గిల్ స్థానంలో రుతురాజ్, జైస్వాల్ మధ్య పోటీ నెలకొంది. ఇక శ్రేయాస్ స్థానంలో ఎవరు బరిలోకి దిగనున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ అతడి స్థానంలో రుతురాజ్‌ను ఆడిస్తే పంత్ స్థానం చేజారినట్టే. అప్పుడు కెప్టెన్ రాహుల్ కీపింగ్ బాధ్యతలు తీసుకుంటాడు. తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్ సైతం బెర్త్ ఆశిస్తున్నప్పటికీ వీళ్లు రిజర్వ్ బెంచీకే పరిమితం కావచ్చు. జడేజాకు తోడుగా స్పిన్‌లో కుల్దీప్‌ను కాకుండా మరో ఆల్‌రౌండర్ సుందర్ వైపు కోచ్ మొగ్గు చూపవచ్చు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నితీశ్‌ను కూడా బరిలోకి దింపే అవకాశం ఉంది. అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ పేస్ బాధ్యతలు తీసుకోనున్నారు.

పిచ్ వాతావరణం

రాంచీలో మూడేళ్ల క్రితం జరిగిన చివరి వన్డేలోనూ భారత్-దక్షిణాఫ్రికాలే తలపడ్డాయి. ఓవరాల్‌గా ఇక్కడ ఆడిన ఆరు వన్డేల్లో ఒక్కసారి మాత్రమే 300+ స్కోరు నమోదు కాగా, పిచ్ స్పిన్‌కు అనుకూలించనుంది. వర్షం నుంచి ఎలాంటి ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, విరాట్, రుతురాజ్/పంత్, సుందర్, రాహుల్ (కెప్టెన్), జడేజా, నితీశ్, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, డికాక్, బవుమా (కెప్టెన్), బ్రీట్‌స్కే, బ్రెవిస్, హెర్మన్, యాన్సెన్, బాష్, కేశవ్, బర్గర్, ఎన్‌గిడి.

ఆత్మవిశ్వాసంతో సఫారీలు

భారత్‌లో కీలక ఆటగాళ్లు లేకపోగా.. దక్షిణాఫ్రికా మాత్రం పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగబోతోంది. దీనికి తోడు సిరీస్ క్లీన్‌స్వీప్‌తో బవుమా సేన ఆత్మవిశ్వాసంతో ఉంది. ఓపెనర్‌గా మార్‌క్రమ్‌కు జతగా అనుభవజ్ఞుడు డికాక్ జట్టులో చేరాడు. మిడిలార్డర్‌లో హిట్టర్లు బ్రీట్‌స్కే, బ్రెవిస్‌తో పటిష్ఠంగా కనిపిస్తోంది. ప్రధాన పేసర్లు రబాడ, నోకియా దూరమైనా.. యాన్సెన్, కొట్జీ, బర్గర్, ఎన్‌గిడి భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.


బవుమా



ఫైనల్లో భారత్

అజ్లాన్ షా హాకీ కప్

ఇపోహ్ (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత జట్టు ఫైనల్లో ప్రవేశించింది. శనివారం జరిగిన ఆఖరి పూల్ మ్యాచ్‌లో భారత్ 14-3తో కెనడాను చిత్తుగా ఓడించింది. భారత ఆటగాళ్లలో జుగ్‌రాజ్ సింగ్ నాలుగు గోల్స్ (12వ నిమిషం, 26వ, 39వ, 50వ) నాలుగు గోల్స్‌తో చెలరేగగా.. అభిషేక్ (57వ, 59వ) రెండు గోల్స్ చేసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆట తొలి 15 నిమిషాల్లోనే భారత్ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. ప్రథమార్ధం ముగిసేసరికి 7-1తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మూడు, నాలుగు క్వార్టర్స్‌లో కలిపి ప్రత్యర్థి రెండే గోల్స్ చేయగా భారత్ మరో ఏడు గోల్స్ చేసి ఘన విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో బెల్జియంతో భారత్ తలపడనుంది.

మన కుర్రాళ్ల గోల్స్ వర్షం

- ఒమన్‌పై భారత్ భారీ విజయం
- జూనియర్ హాకీ ప్రపంచకప్

చెన్నై: పురుషుల జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో చిలీని చిత్తుచేసిన టీమిండియా.. శనివారం జరిగిన పోరులో ఒమన్‌పై 17-0తో భారీ విజయం సాధించింది. ఆరంభం నుంచే దీటుగా చెలరేగిన భారత కుర్రాళ్లు గోల్స్ వర్షంతో ప్రత్యర్థిని బెంబేలెత్తించారు. భారత ఆటగాళ్ల ధాటికి ఒమన్ ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయింది. అర్ష్‌దీప్, మన్‌మీత్, దిల్‌రాజ్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించగా.. అజీత్ యాదవ్, ఇంగ్‌లెంబా, గురుజోత్య తలా రెండు గోల్స్‌తో సత్తా చాటారు. అన్మోల్, శర్దానంద్ చెరో గోల్ కొట్టారు. పూల్-బీలో భాగంగా భారత్ తన మూడో మ్యాచ్‌ను స్విట్జర్లాండ్‌తో మంగళవారం ఆడనుంది.


ట్రీసా, గాయత్రి

టైటిల్‌కు అడుగుదూరంలో..

- ఫైనల్లో శ్రీకాంత్, గాయత్రి జోడీ
- సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్ టోర్నీ

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 21-15, 19-21, 21-13తో భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్ సెమీస్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-11, 21-15తో మలేసియా జంట ఓంగ్ గ్జిన్ యీ/కార్మెన్ టింగ్‌పై గెలిచింది. ఉన్నతి 15-21, 10-21తో నెలిషాన్ ఆరిన్ (టర్కీ) చేతిలో, తన్వీ శర్మ 17-21, 16-21తో హినా అకెచి (జపాన్) చేతిలో ఓడారు. మిక్స్‌డ్‌లో భారత జంట ట్రీసా/హరిహరన్ 17-21, 19-21తో ఇండోనేసియా జోడీ వార్దానా/పెర్దినాష్యా చేతిలో పరాజయం పాలైంది. ఫైనల్స్‌లో జాసన్ గునవాన్ (హాంకాంగ్)తో శ్రీకాంత్, జపాన్ జంట ఒసావ /తనబెతో గాయత్రి జోడీ అమీతుమీ తేల్చుకోనున్నారు.

చికిత డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో తెలుగమ్మాయి చికిత రావు రెండు పతకాలు కొల్లగొట్టింది. రాజస్థాన్‌లో శనివారం జరిగిన కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించింది. అదితి గోపీచంద్ స్వర్ణం దక్కించుకుంది. ఇక, టీమ్ విభాగంలో ఎల్‌పీ విశ్వవిద్యాలయం తరఫున బరిలోకి దిగిన చికిత, సునైనా, మధుర వర్షిణి త్రయం స్వర్ణం కైవసం చేసుకుంది.

జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్

ఫిబ్రవరి 5న ఫైనల్
నవీ ముంబై, వడోదరలో మ్యాచ్‌లు

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదలైంది. మొత్తం 5జట్లు పాల్గొనే డబ్ల్యూపీఎల్ వచ్చే జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరుగనుంది. వాస్తవానికి తొలి మూడు సీజన్లు ఫిబ్రవరి-మార్చిలో జరిగాయి. కానీ ఈసారి ఫిబ్రవరి 7 నుంచి స్వదేశంలో టీ20 వరల్డ్‌కప్ జరుగుతుండడంతో డబ్ల్యూపీఎల్‌ను ముందుకు జరిపారు. ఇక.. 28 రోజుల పాటు జరిగే ఈ లీగ్‌లో తొలి 11 మ్యాచ్ (ఇందులో రెండు డబుల్ హెడర్లు)లకు నవీ ముంబై, మిగతా 11 మ్యాచ్ (ఎలిమినేటర్, ఫైనల్)లకు వడోదర ఆతిథ్యం ఇవ్వనున్నాయి. డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య ఆరంభ మ్యాచ్ జరుగనుంది. ఇక, తొలిసారిగా ఫైనల్ మ్యాచ్‌ను వీకెండ్‌లో కాకుండా గురువారం నిర్వహిస్తున్నారు.

ప్రైవేట్ వైద్య కళాశాలల్లో పెరిగిన ఉన్నత విద్యా కోర్సుల సీట్లు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి ఉన్నత విద్యా కోర్సుల(పీజీ బ్రాడ్ స్పెషాలిటీ) సీట్లను పెంచినట్లు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ)లో భాగమైన మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్(ఎంఎఆర్‌బీ) వెల్లడించింది. ఈమేరకు శనివారం తన వెబ్‌సైట్‌లో పెంచిన సీట్ల వివరాలను అప్‌లోడ్ చేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉన్నత విద్యా కోర్సుల సీట్ల పెంపు వివరాలను ప్రకటించింది. తెలంగాణలో ఈ ఏడాది సైన్స్ టీచింగ్, సీఎంఆర్, నీలిమ, సురభి వైద్య కళాశాలలకు కొత్తగా ఉన్న విద్యాకోర్సుల సీట్లను మంజూరు చేశామని తెలిపింది. ఇప్పటి వరకు 12 ప్రైవేటు కాలేజీల్లో 188 పీజీ బ్రాడ్ స్పెషాలిటీ సీట్లుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 543కు చేరింది.

డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలతో ఉద్యోగుల బిల్లులు 707.30 కోట్లు విడుదల

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించి ఆర్థిక శాఖ శనివారం రూ.707.30 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాల మేరకు నవంబరుకు సంబంధించి ఈ నిధులను మంజూరు చేసినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతి నెలా రూ.700 కోట్లకుపైగా నిధులను విడుదల చేయాలని గతంలో ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు విడుదల చేసినట్లు వివరించింది. దీంతో 4 నెలలుగా వరుసగా నిధులు విడుదల చేసినట్లయిందని తెలిపింది.

గవర్నర్‌ను కలిసిన ప్రొబెషనరీ ఐపీఎస్‌లు

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేటాయించిన నలుగురు ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిశారు. కొత్తగా సర్వీసులో చేరిన వీరికి గవర్నర్ అభినందనలు తెలిపారు. 77వ బ్యాచ్‌కు చెందిన నలుగురు ఐపీఎస్ అధికారులను తెలంగాణకు కేటాయించగా, వారు రాష్ట్ర పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులను గవర్నర్ వద్దకు తీసుకెళ్లారు.

బంజారా భారత్ సలహాదారులుగా బలరాం నాయక్, రవీంద్ర నాయక్

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంజారా భారత్ పదాధికారుల కేంద్ర కమిటీకి సలహాదారులుగా ఎంపీ బలరాం నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ నియమితులయ్యారు. శనివారం ఢిల్లీలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సభ్యులతో కోర్ కమిటీ నియామకం జరిగింది. జాతీయ అధ్యక్షుడిగా పృథ్వీసింగ్ రాథోడ్, జాతీయ కో ఆర్డినేటర్‌గా రవి నాయక్, జాతీయ కన్వీనర్‌గా జేపీ పవార్, మహిళా కన్వీనర్‌గా నాగమణి నాయక్‌లతోపాటు 21 మందిని జాతీయ కమిటీ సభ్యులుగా నియమించారు. 16 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురితో బంజారా భారత్ విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ కమిటీలో తెలంగాణకు చెందిన విశ్లావత్ జగన్ నాయక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భీమా నాయక్‌లకు అవకాశం కల్పించారు.

ఐఈఎల్‌టీఎస్, స్కాలర్‌షిప్‌లపై శిక్షణ తరగతులు: బీసీ స్టడీ సర్కిల్

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటున్న బీసీ తదితర వర్గాల అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లపై అవగాహన, ఐఈఎల్‌టీఎస్(ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్) శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల గ్రాడ్యుయేట్ అభ్యర్థులు డిసెంబరు 1 నుంచి 21లోగా ఆన్‌లైన్‌లో(www.tgbcstudycircle.cgg.gov.in)దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

రఘునాథపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఆంధ్రా తండాకు చెందిన మాలోతు రమేశ్(39) తనకున్న 9 గుంటలకు తోడు మరో నాలుగు ఎకరాల కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో సాగు సక్రమంగా చేయకపోవడంతో రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన రమేశ్ శనివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జనగామ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జుల నియామకం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. మొత్తం 38 మంది బీజేపీ జిల్లా ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు.

మరో మైలురాయికి చేరిన బీహెచ్‌ఈఎల్

» 4/175 మెగావాట్ ఎయిర్ కూల్డ్ జనరేటర్‌కు రూపకల్పన

బెల్‌కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ విద్యుత్ పరికరాలు, టర్బైన్‌లు, జనరేటర్ల తయారీలో భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) సంస్థ మరో మైలురాయి చేరుకుంది. నిర్దేశిత సమయంలో అత్యాధునిక గాలి శీతలీకృత జనరేటరును తయారు చేసి బోట్స్వానా దేశానికి తరలించింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్‌రావు శనివారం జెండా ఊపి జనరేటర్ యూనిట్‌ను తరలించారు. బోట్స్వానా దేశంలో జిందాల్ మమాబుల ఎనర్జీ ప్రాజెక్టు కోసం 4/175 మెగావాట్ ఎయిర్‌కూల్డ్ జనరేటర్ తయారీకి తొలి ఆర్డర్ దక్కించుకున్న బీహెచ్‌ఈఎల్ దానిని ఆర్‌సి.పురం యూనిట్‌లో తయారు విజయవంతంగా రూపొందించింది. దూసాన్ స్కోడా సంస్థ ఆ ఆర్డర్‌ను పొందిన నాటి నుంచి 14 నెలల్లో పూర్తిచేసి ఇవ్వాలనే గడువు ప్రకారం.. జనరేటర్‌ను సకాలంలో పూర్తిచేసి శనివారం ఆ దేశానికి పంపించింది.

ఇందిరమ్మ చీరల పంపిణీ నిలిపివేత

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేశారు. కోడ్ ముగిసిన వెంటనే ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించగా.. వారం రోజుల్లోనే 43.32లక్షల మంది మహిళలకు చీరలు అందించారు. మొత్తం 46,22,098 మంది సెర్ప్ మహిళా సభ్యుల్లో సుమారు 77.89% మందికి పంపిణీ పూర్తయింది. ఎస్‌హెచ్‌జీ సభ్యులు కాని దాదాపు 2లక్షల మంది మహిళలకు కూడా వెంటనే సభ్యత్వం ఇచ్చి చీరలు అందించారు.

కరెంట్ చార్జీల పెంపు లేదు.. డిస్కమ్‌ల నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంట్ చార్జీలను పెంచరాదని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈమేరకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో డిస్కమ్‌లు(టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లు) సీల్డ్ కవర్‌లో ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనల పిటిషన్లు దాఖలు చేశాయి. ఇక దక్షిణ డిస్కమ్ విషయానికి వస్తే 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.50,153 కోట్లు అవసరం ఉండగా ప్రస్తుత చార్జీల రూపంలో రూ.40,378 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఇక క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ, అదనపు సర్‌చార్జీ రూపంలో రూ.198 కోట్లు, టారిఫేతర ఆదాయ రూపంలో రూ.83 కోట్లు వస్తాయని గుర్తించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ కాకుండా రూ.9494 కోట్ల లోటు ఉంటుందని తేల్చారు. ఉత్తర డిస్కమ్ కూడా ఆదాయానికి, అవసరాలకు మధ్య లోటు లేదని పిటిషన్ వేసింది. సీల్డ్ కవర్‌లో దాఖలు చేసిన పిటిషన్లను పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తెరవనున్నారు. ఆ తర్వాత ఈ పిటిషన్లపై ఈఆర్‌సీ నోటిఫికేషన్ ఇచ్చి ఆ తర్వాత సలహాలు, సూచనలు స్వీకరించి, బహిరంగ విచారణ అనంతరం టారిఫ్ ఆర్డర్ ఇవ్వనుంది. 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి.

మెస్సీతో రేవంత్ ఫుట్‌బాల్!

స్టార్ ప్లేయర్‌తో తలపడనున్న ముఖ్యమంత్రి

13న ఉప్పల్ స్టేడియంలో విద్యార్థులతో ఆట

9వ నంబర్ జెర్సీతో మెరవనున్న రేవంత్

ఎప్పట్లాగే 10వ నంబర్ జెర్సీతో మెస్సీ

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగమెరిగిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు లయొనెల్ మెస్సీతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడా మైదానంలో తలపడనున్నారు. ఆటలో భాగంగా ఇద్దరూ ఎదురుపడే పరిస్థితి వచ్చినపుడు ఏం జరుగుతుందా? అని రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాంతో మ్యాచ్‌కు ఎక్కడా లేని క్రేజ్ వచ్చింది. డిసెంబరు 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహించబోతున్న సంగతి తెలిసిందే. సదస్సు ముగింపును పురస్కరించుకుని డిసెంబరు 13న ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఫుట్‌బాల్ డ్రీమ్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. భారత్ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వస్తున్న మెస్సీ ఉప్పల్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలతో ఫుట్‌బాల్ ఆడతారు. ఈ మ్యాచ్‌లో ఆర్ఆర్-9 టీమ్ తరఫున ముఖ్యమంత్రి ఆడతారు. ఎల్ఎం-10 టీమ్ తరఫున మెస్సీ ఆడనున్నారు. ఈ మ్యాచ్‌లో రేవంత్‌రెడ్డి 9వ నెంబర్ జెర్సీ ధరిస్తారు. ప్రత్యర్థి జట్టులో ఉన్న మెస్సీ ఎప్పట్లాగే తన క్రేజీ పదో నంబర్ జెర్సీ ధరిస్తారు. ఒక ముఖ్యమంత్రి, ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారుడు ఫుట్‌బాల్ మైదానంలో తలపడుతున్నారనే వార్త రాజకీయ నాయకుల్లోనూ ఆసక్తిని రేపుతోంది.

రేవంత్‌ను కలిసిన శుభలేఖ సుధాకర్


సీఎం రేవంత్‌ను కలిసిన నటుడు శుభలేఖ సుధాకర్, చిత్రంలో ఉత్తమ్

నటుడు శుభలేఖ సుధాకర్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రవీంద్రభారతి ఆవరణలో డిసెంబర్ 15న ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు దివంగత ఎస్పీ.బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. రవీంద్రభారతి ఆవరణలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతించినందుకు బాలసుబ్రమణ్యం కుటుంబం తరఫున ముఖ్యమంత్రికి సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

పెట్టుబడులు 'రైజింగ్'!


సమ్మిట్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నాయి. పారిశ్రామిక రంగంలో తెలంగాణ ఘన భవిష్యత్తును చాటేందుకు ప్రభుత్వం.. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సును నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సదస్సు వేదికగా విజన్-2047 ప్రణాళికను కూడా ప్రకటించనుంది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల కోసం సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ ఆసక్తి చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా సౌర, ఇతర సాంప్రదాయేతర విద్యుత్ రంగంలో పేరుపొందిన ఈ కంపెనీ.. మురుగునీటి శుద్ధీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను చేపడుతోంది. భారత్‌లో పలు రాష్ట్రాల్లో విద్యుత్ ప్రాజెక్టులు నిర్వహిస్తోంది. తాజాగా తెలంగాణపై దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వంతో సెంబ్‌కార్ప్ చర్చలు ప్రారంభించింది. ఫ్యూచర్ సిటీలో వెయ్యి ఎకరాలు కేటాయిస్తే.. తమతోపాటు సింగపూర్‌కు చెందిన మరిన్ని కంపెనీలు పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయని ప్రతిపాదించింది. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తే.. తెలంగాణ రైజింగ్ సదస్సులో ఒప్పందం కుదుర్చుకోనుంది. పెట్టుబడుల ప్రణాళిక, ఉద్యోగాల కల్పనపై అధికారికంగా ప్రకటన చేసే అవకాశముంది. ఇక ప్రఖ్యాత హిందూస్థాన్ యూనిలీవర్ సంస్థ కూడా ఫ్యూచర్ సిటీలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. సబ్బులు, టూత్‌పేస్టులు, డిటర్జెంట్‌లు, టీ, కాఫీ సహా ఇంట్లో ఉపయోగించే చాలా రకాల ఉత్పత్తులను విక్రయించే ఈ సంస్థకు హైదరాబాద్ శివార్లలోని ఉప్పల్, కొంపల్లిలో పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పుడు ఫ్యూచర్ సిటీలోనూ భారీ పెట్టుబడితో మరిన్ని ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. సదస్సులో దీనిపై ప్రకటన చేసే అవకాశముంది. ఇవేగాక పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు సైతం ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ రైజింగ్ సదస్సులో గిన్నిస్ రికార్డు డ్రోన్ షో!

9న మూడు వేల డ్రోన్లతో ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

'తెలంగాణ రైజింగ్.. రండి, భాగస్వాములు కండి'

అనే ఆహ్వానం కనిపించేలా అక్షరాల సమాహారం

హైదరాబాద్/కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 9న జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు' ముగింపు కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రపంచ రికార్డు నెలకొల్పేలా భారీ 'డ్రోన్ షో' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకేసారి 3 వేల డ్రోన్లతో ఈ ప్రదర్శన చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. 'తెలంగాణ రైజింగ్.. రండి, భాగస్వాములు కండి' అని ఆహ్వానిస్తూ అక్షరాల సమాహారాన్ని ఆకాశంలో ఆవిష్కరించనుంది. ఇప్పటి వరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అబుధాబి నగరం పేరిట ఉంది. 2025 కొత్త సంవత్సర వేడుకల్లో 2,131 డ్రోన్లతో 'హ్యాపీ న్యూ ఈయర్' అనే వాక్యాన్ని ప్రదర్శించి యూఏఈ గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. ఇప్పుడు అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లతో అక్షర సమాహారాన్ని ప్రదర్శించనున్నారు.

శరవేగంగా కొనసాగుతున్న ఏర్పాట్లు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం మీర్‌ఖాన్‌పేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. సదస్సుకు వచ్చే ప్రతినిధుల వాహనాల కోసం ఎనిమిది ప్రాంతాలను చదును చేశారు. సదస్సుకు ప్రముఖులు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు రానున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సదస్సు సమయంలో పాసులు ఉన్నవారినే ఆ రహదారుల్లో అనుమతిస్తామని స్థానికులకు సమాచారం ఇస్తున్నారు.

రేపట్నుంచి సీఎం పట్టణ బాట!

(మొదటిపేజీ తరువాయి)

మక్తల్ మున్సిపాలిటీలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే ఈ పర్యటనలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం అవుతారు. రెండో తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపాలిటీలో పర్యటిస్తున్నారు. అక్కడ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భూమి పూజలో పాల్గొంటారు. అనంతరం విద్యార్థులు, పొదుపు మహిళలతో సమావేశం అవుతారు. మూడో తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పర్యటిస్తారు. అక్కడ రూ.44 కోట్లతో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణంతో పాటు రూ.491.17 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు. నాలుగున ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటిస్తారు. పట్టణ మౌలిక వసతుల కల్పనా నిధి నుంచి రూ.18.70 కోట్ల విలువజేసే అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. అయిదో తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట్ మున్సిపాలిటీలో పర్యటిస్తారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి భూమి పూజతోపాటు సుమారు రూ.637 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆరో తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటిస్తారు. రూ.1,800 కోట్లతో చేపడుతున్న ఎద్దుల జలాశయం ప్రధాన కాలువ పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. చివరగా సిద్దిపేటలో పర్యటిస్తారు. రూ.78 కోట్ల అంచనాలతో నిర్మించనున్న జిల్లా జైలు భవన నిర్మాణంతోపాటు రూ.300 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు.

కోడ్ పరిధిలోకి రాకుండా యాత్ర షెడ్యూల్

ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలోకి రాకుండా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. కొన్ని పట్టణాల అభివృద్ధి పనులు పంచాయతీల పరిధిలోకి కూడా వస్తుండటంతో ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తాయని అనుమానం ఉన్నవాటన్నింటినీ ముఖ్యమంత్రి శంకుస్థాపనల షెడ్యూల్ నుంచి తొలగించారు. కేవలం పట్టణప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకే భూమి పూజ చేసేలా పర్యటన ఖరారు చేశారు.

అయ్యో.. సర్పంచ్ సాబ్!

సొంతంగా నిధులు సమీకరించి అభివృద్ధి పనులు.. బిల్లులు రాక రూ.లక్షల్లో పేరుకుపోయిన అప్పులు

- సాగు భూములు, ప్లాట్లు తెగనమ్ముకొని ఇల్లుగుల్ల
- పొట్టకూటి కోసం ఉన్న ఊర్లోనే కూలీలుగా కొందరు
- ఉపాధి కోసం హైదరాబాద్ బాటపట్టిన ఇంకొందరు
- దిక్కుతోచని స్థితిలో కొన్నిచోట్ల బలవన్మరణాలు
- పెండింగ్ బిల్లులపై ఆశలు వదులుకోవాల్సిందేనా?
- వేతనం 6,500 మాత్రమే.. ఎన్నిక కోసమే లక్షల్లో ఖర్చు
- అన్నీ తెలిసినా సర్పంచ్ పదవికి సై.. నేనంటే నేనంటూ పోటీ

ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ పాల వెంకటరెడ్డి ఊర్లో అభివృద్ధి పనులకు కోసం భారీగా అప్పులు చేశారు. ప్రభుత్వం నుంచి రూ.40 లక్షల మేర బకాయిలు రాకపోవడంతో అప్పులు తీర్చేందుకు తన ఏడెకరాలను అమ్ముకున్నారు. ఇదే మండలం మర్లపాడు తాజా మాజీ సర్పంచ్ వేణుగోపాలరెడ్డికి రూ. 20 లక్షల మేర బకాయిలు రావాల్సి ఉంది. అప్పులు తీర్చేందుకు వేణుగోపాల్ రెండెకరాలు అమ్ముకొని సత్తుపల్లి వచ్చి వాటర్ బాటిళ్ల వ్యాపారం చేసుకుంటున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం చెట్లతిమ్మాయిపల్లి సర్పంచ్‌గా పనిచేసిన స్వాతి అప్పులపాలై కూలి పనులకు వెళుతున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ తాజా మాజీ సాయికుమార్ రూ.35 లక్షల మేర అప్పు చేసి గ్రామ పంచాయితీ భవనం, సీసీరోడ్లు నిర్మించారు. బిల్లులు రాక కొత్తగా కట్టుకున్న ఇల్లు, కారు అమ్ముకొని అప్పులు తీర్చేసి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. సంగారెడ్డి జిల్లా ఉప్పరిగూడెంకు చెందిన నరసింహులు గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసేవారు. భార్య రేణుక సర్పంచ్‌గా ఎన్నికయ్యాక ఆ కొలువు వదిలేశారు. ఐదేళ్లలో అప్పులు చేసి ఊర్లో అభివృద్ధి పనులు చేయించారు. ఆ అప్పులు తీర్చేందుకు ఎకరం పొలం విక్రయించారు. గద్వాల జిల్లా సోంపురం తాజా మాజీ తిక్కన్న 100 గొర్రెలు అమ్మేసి అప్పులు చెల్లించారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సర్పంచ్‌గిరి కోసం నువ్వానేనా అన్నట్టు గట్టి పోటీ నెలకొన్నా ఆ పదవి 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందమేనని అనిపిస్తోంది. పదవికి ఎన్నికయ్యాక గ్రామపెద్దగా గౌరవమర్యాదలు, హోదా పెరుగుతాయి. అంతా.. 'సర్పంచ్ సాబ్' అని పిలుస్తారు. ఇదంతా నాణేనికి ఒకవైపే! పదవి చేపట్టిన కొన్నాళ్లకే మోతుబరులు కాస్తా బికారులవుతున్నారు. ఇస్త్రీ ఖద్దరు చొక్కా, జేబులో ఎప్పుడూ నాలుగు పెద్దనోట్లతో ఠీవీగా కనిపించిన సర్పంచ్ సాబులు పదవి చేపట్టిన రెండేళ్లకే కళతప్పుతున్నారు. ఆదర్శాలతోనో, వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం ద్వారానో, అధికార పార్టీ పెద్దల ఒత్తిడితోనో అభివృద్ధి పనులన్నీ భుజానెత్తుకొని అప్పులు చేసి మరీ పూర్తిచేశారు. ఆ పనుల తాలూకు బిల్లులు రాకపోవడంతో ఆస్తులు తెగనమ్ముకొని వీధిన పడ్డారు. గత పంచాయితీ ఎన్నికల్లో గెలిచి.. తాజాగా మాజీలైన సర్పంచ్‌ల్లో ఎంతోమంది లక్షల్లో అప్పులపాలై ఆర్థికంగా చితికిపోయారు. కొందరు ఇళ్లు, భూములు అమ్ముకొన్నారు. అయినా అప్పులు తీరకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నవారు ఎంతోమంది ఉన్నారు. ఆస్తులన్నీ కోల్పోయి పుట్టి పెరిగిన ఊర్లో ఉండలేక భార్యాపిల్లలతో వలస పోయిన వారూ ఉన్నారు. తాజాగా సర్పంచ్ ఎన్నికలు పూర్తయి, కొత్త పాలకవర్గాలు ఏర్పడ్డ తర్వాత రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉన్న తమ బిల్లుల గురించి పట్టించుకునేవారెవరని మాజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బిల్లులు ఇప్పించాలని కోరుతున్నారు.

ఆ మహిళా సర్పంచ్ టైలర్ షాపులో పనికి..

అభివృద్ధి పనుల తాలూకు అప్పులు తీర్చేందుకు రెండు ప్లాట్లు అమ్మానని, ఏడు తులాల బంగారం తాకట్టు పెట్టానని రంగారెడ్డి జిల్లా ఎక్వాయిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సుగుణ ఆవేదన వ్యక్తం చేశారు. బతుకుదెరువు హైదరాబాద్ వెళ్లామని.. భర్త సాయిలు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటే, తాను ఓ టైలర్ షాపులో పనిచేస్తున్నానని సుగుణ చెప్పారు పాలమూరు జిల్లా పూజారి తండా తాజా మాజీ అంజీ అప్పులకు వడ్డీలు కట్టేందుకు కూలికి వెళుతున్నారు.

ప్లాట్లు అమ్మి తీర్చేశారు

గద్వాల జిల్లా సూల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్‌కు రూ.ఏడు లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉంటే గద్వాలలో ప్లాట్‌ను అమ్మి తీర్చేశారు. గువ్వలదిన్నె మాజీ సర్పంచ్ మహాదేవి రమేశ్ ఎకరం తాకట్టుపెట్టి అప్పులు తీర్చారు. పాలమూరులోని కొండపల్లి మాజీ సర్పంచ్ మహేశ్వరమ్మ ఎకరం అమ్ముకొన్నారు. చౌడూరు సర్పంచ్ వెంకటయ్య రూ.18 లక్షల మేర బిల్లులు రాకపోవడంతో ఊరొదిలి హైదరాబాద్ వెళ్లిపోయారు. కేటిదొడ్డి మాజీ సర్పంచ్ పావని వీరేశ్ రూ.6 లక్షల మేర అప్పులకు వడ్డీలు కట్టలేక కూలి పనులకు వెళుతున్నారు. తాను అప్పులు తీర్చేందుకు మూడున్నర ఎకరాలను అమ్ముకున్నానని రంగారెడ్డి జిల్లా చిలుకమర్రి తాజా మాజీ సర్పంచ్ మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 లక్షల నుంచి రూ.70లక్షల దాకా అప్పులు చేసినవారూ ఉన్నారు. తనకు సర్పంచ్ పదవి అంటే ముళ్ల కిరీటం అనిపిస్తోందని తొమ్మిదిరేకుల గ్రామం మాజీ సర్పంచ్ సావిత్రి బాలరాజు పేర్కొన్నారు.

వేతనం కొంతే.. ఖర్చు మాత్రం కొండంత

1992కు ముందు సర్పంచ్‌లకు వేతనాలు ఉండేవి కావు. ఆ తర్వాత చిన్న గ్రామపంచాయితీల సర్పంచ్‌లకు రూ.600 చొప్పున, మేజర్ పంచాయితీ సర్పంచ్‌లకు రూ.1000 చొప్పున ఇచ్చేవారు. రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో వేతనాన్ని రూ.5వేలు చేశారు. 2021లో రూ.6,500కు పెంచారు. గతంలో ఈ వేతనంతో సర్పంచ్‌లకు ఖర్చులైనా వెళ్లేవి. ఇప్పుడు.. ఎన్నికయ్యేందుకే లక్షల్లో పెట్టాల్సి వస్తోంది. అన్నీ తెలిసినా.. ఆస్తులు మ్ముకొనైనా సర్పంచ్‌గా గెలిచేందుకు అభ్యర్థులు పోటీ పడుతుండటం గమనార్హం.



బిల్లులు రాక ఆత్మహత్య



రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కాశెగూడెం షేక్ అజారుద్దీన్(27) సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధుల కింద రూ.15 లక్షలు ప్రకటించడంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని ఆయన భావించారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాడు. నిధులు విడుదల కాకపోగా పనుల విషయంలో అధికారుల ఒత్తిడి పెరిగింది. అప్పులు తీర్చేందుకు భార్య వెండి కడియాలు తాకట్టు పెట్టడంతో ఆలుమగల మధ్య గొడవలు జరిగాయి. మనస్తాపంతో అజారుద్దీన్ 2020 నవంబరు 12న ఆత్మహత్య చేసుకున్నారు.

భర్తతో కూలి పనులకు నీలిబాయి



గ్రామంలో అభివృద్ధి పనులు చేయించడంతో రూ 40లక్షల వరకు అప్పులయ్యాయి. రూ25 లక్షల మేర బిల్లులు రావాల్సి ఉంది. అవి వస్తాయని ఆశిస్తే ఆలోపే బాధ్యతల నుంచి దిగిపోవాల్సి వచ్చింది. అరెకరం అమ్మితే రూ 10లక్షలొచ్చాయి. తాండూరులో 200 గజాల ప్లాటు అమ్మితే మరో రూ. 15లక్షలొచ్చాయి. కొంతమేర అప్పులు తీర్చి.. కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు పోయాం. భార్యభర్తలం ఇప్పుడు కూలి పనులకు వెళుతున్నాం.

- నీలిబాయి, మాజీ సర్పంచ్, బాద్లాపూర్‌తండా, రంగారెడ్డి జిల్లా

జీవితంలో మళ్లీ పోటీ చేయను



స్థాయికి మించి అప్పులు చేసి రూ.10లక్షలతో పాఠశాల భవనం నిర్మించాను. సీసీ రోడ్లు, గుళ్లు, గోపురా నిర్మాణాల కోసం లక్షల్లో ఖర్చుచేశాను. అప్పులకు వడ్డీలు పెరిగాయే తప్ప బిల్లులు రాలేదు. మూడున్నర ఎకరాలు అమ్మి అప్పులు తీర్చాను. రూ.20లక్షల బిల్లులు రావాల్సి ఉంది. వస్తే అవికూడా అప్పుల కిందకే జమవుతాయి. ఇక జన్మలో సర్పంచ్ పదవికి పోటీ చేయను.

- కంటె మాధవి, మాజీ సర్పంచ్, చిలుకమర్రి గ్రామం, రంగారెడ్డి జిల్లా

పోటెత్తిన పోటీ

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీల సర్పంచ్ పదవులకు తొలి రెండు రోజుల్లో 8,198 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రోజు 3,297 నామినేషన్లు రాగా, రెండో రోజు శుక్రవారం 4,901 నామినేషన్లు వచ్చాయి. ఇక చివరి రోజు సర్పంచులకు 20వేలకు పైగా, వార్డు సభ్యులకు 50వేలకు పైగా దాఖలయ్యాయి. రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగడంతో అర్ధరాత్రి 12.30 గంటల దాకా అధికారులు ఆ లెక్క తేల్చే పనిలోనే ఉన్నారు.

నేతల కనుసన్నల్లోనే నామినేషన్లు..

చివరిరోజు ప్రధాన రాజకీయ పార్టీల క్షేత్రస్థాయి నేతలంతా నామినేషన్ల పనిలోనే నిమగ్నమయ్యారు. వాస్తవానికి పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగానే జరుగుతున్నా.. అది పేరుకు మాత్రమే. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు నామినేషన్ల ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. మండల స్థాయి నేతలతోపాటు అవసరమైన చోట నేరుగా గ్రామస్థాయి నాయకులతోనూ మాట్లాడి.. తమ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థులుగా ఎవరు నామినేషన్లు వేయాలన్నది నిర్ణయించారు. ఒక్కోచోట ఒకరికి మించిన అభ్యర్థులు పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి పోటీ ఉంటే సర్దుబాట్లు చేశారు. అదే సమయంలో తమ తమ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీసీలకు ఎంత మందికి అవకాశం వచ్చిందన్నది కూడా నేతలు గమనంలోకి తీసుకున్నారు. అన్ని పార్టీల నేతలు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో కొన్నిచోట్ల చివరి నిమిషంలో అభ్యర్థులు మారారు. మొత్తంగా నామినేషన్ల ఘట్టం చివరి రోజు గ్రామస్థాయిలో రాజకీయ పార్టీల మధ్య సై అంటే సై అన్న వాతావరణం నెలకొంది. మరోవైపు కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమకు పట్టున్న చోట్ల ఏకగ్రీవాల కోసం ప్రయత్నించారు. ఇక మొదటి విడతలో దాఖలైన నామినేషన్లను ఆదివారం పరిశీలించనున్నారు. అనంతరం డిసెంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం ఉంటుంది. డిసెంబరు మూడో తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అదేరోజు రాత్రి బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు.

రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు..

రాష్ట్రంలో ఈసారి గ్రామ పంచాయతీలు రికార్డు స్థాయిలో ఏకగ్రీవం అవుతున్నాయి. తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు గడువు ముగిసిన శనివారం నాటికి అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు వెల్లడైంది. వికారాబాద్ జిల్లాలో 18 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో అత్యధికంగా తాండూరు నియోజకవర్గంలో 10 పంచాయతీలు ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో 8 పంచాయతీలు ఉన్నాయి. ఈ జిల్లాలో 2019లో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ 18 పంచాయతీలు ఏకగ్రీవం కావడం విశేషం. ఇక రంగారెడ్డి జిల్లాలో ఐదు పంచాయతీలను అక్కడి ప్రజలు ఏకగ్రీవం చేసుకున్నారు. కాగా, భూపాలపల్లి జిల్లాలో తొలి విడతలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ రెండూ కొత్తపల్లిగోరి మండలంలోనివే. ఇక వరంగల్ జిల్లాలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు, జగిత్యాల, కుమరం భీం జిల్లాల్లో ఒకటి చొప్పున పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. కాగా, , కరీంనగర్ జిల్లాలో ఒకే పంచాయతీ ఏకగ్రీవమైంది. చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామంలో శివాలయం నిర్మించేందుకు అంగీకరించిన వడ్లకొండ తిరుమలను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు గ్రామస్తులు అంగీకరించారు. ఇక ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ప్రత్యేకించి గిరిజన తండాల్లో ఎక్కువగా ఏకగ్రీవం చేసుకున్నారు. ఇతర గ్రామాల్లో చాలా చోట్ల ఏకగ్రీవానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11 ఏకగ్రీవమయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఐదు చోట్ల ఏకగ్రీవం కాగా, ఇందులో మిత్రపక్షాలైన కాంగ్రెస్‌కు 4, సీపీఐకి ఒకటి దక్కాయి.



కందిలోని నామినేషన్ కేంద్రం వద్ద ఏకగ్రీవమైన తునికలతండా పంచాయతీ నూతన పాలకవర్గంతో గ్రామస్థులు, నాయకులు



ఏకగ్రీవానికి అడ్డంకిగా వర్గపోరు

రాష్ట్రంలో ఏకగ్రీవం చేసుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్న పలు పంచాయతీల్లో రాత్రికి రాత్రే పరిణామాలు మారిపోయాయి. ప్రత్యేకించి గద్వాల జిల్లాలో వేలం పాటలో దక్కించుకున్న అన్ని గ్రామాలల్లో శనివారం నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందుకు వర్గపోరు ప్రధాన కారణం కగా, వేలంలో పాడిన డబ్బులు పూర్తిగా చెల్లించకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. మరి కొన్ని చోట్ల అభ్యర్థులపై గ్రామంలో చాలా మందికి ఇష్టం లేకపోవడం వంటి కారణాలతో నామినేషన్లను దాఖలు చేసినట్లు సమాచారం. ఇక రాష్ట్రంలో రెండో విడతలో జరగనున్న 4,333 సర్పంచ్‌లు, 33,350 వార్డుల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభం కానుంది. డిసెంబరు 2 వరకు నామినేషన్లకు గడువు ఉంటుంది.

'ఎన్నికలను బహిష్కరిస్తాం'

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని నర్సాపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని కుగ్రామమైన గొట్టికి చెందిన ప్రజలు పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందించారు. గొట్టి గ్రామంలో మూడు వార్డులు ఉండగా ఇక్కడ వంద శాతం ఓటర్లు ఎస్టీలు ఉన్నారు. అయితే ఈ వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. దీంతో ఇప్పటికైనా ఈ మూడు వార్డులను తమకే రిజర్వు చేయాలని, లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించారు.

ఆ 3 పంచాయతీల్లో నామినేషన్ నిల్

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం, వందూర్‌గూడ, వెంకటాపూర్ గ్రామ పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో ఆ మూడు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిలిచిపోనున్నాయి. గూడెం గ్రామంలో ఒక్కరు కూడా గిరిజనులు లేకపోయినా ఎస్టీలకు రిజర్వు చేశారు. 1987 నుంచి ఎస్టీకే కేటాయిస్తుండడంతో అప్పటినుంచీ గూడెం పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదు. ఈసారీ కూడా ఇదే పరిస్థితి రిపీట్ అయింది. ఇక నెల్కివెంకటాపూర్ పంచాయతీలో గతంలో వందూర్‌గూడ గిరిజన గ్రామం ఉండేది. 2019లో ఈ గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయితే దీనిని అక్కడి గిరిజనులు వ్యతిరేకించారు. తమ గ్రామాన్ని నెల్కివెంకటాపూర్‌లోనే కొనసాగించాలంటూ ఎవరూ నామినేషన్ వేయకుండా వదిలేశారు. మరోవైపు నెల్కివెంకటాపూర్ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి కేటాయించగా.. అక్కడ ఎస్టీలు ఎవరూ లేరు. దీంతో ఆ గ్రామంలో కూడా ఎన్నికలు జరగని పరిస్థితి నెలకొంది.

వికారాబాద్ జిల్లా సంగాయిపల్లిలో ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామస్థులు



సీఎం స్వగ్రామం సర్పంచ్‌గా మాజీ నక్సలైట్!

కొండారెడ్డిపల్లి సర్పంచ్‌గా నామినేషన్ వేసిన మల్లెపాకుల వెంకటయ్య

పోటీ లేకపోవడంతో ఆ స్థానం ఏకగ్రీవం



సీఎం రేవంత్‌తో వెంకటయ్య

వంగూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం.. నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. ఎస్సీకి రిజర్వు అయిన ఈ గ్రామంలో మొదటి విడతలో ఎన్నికలు జరగాల్సి ఉండగా సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన మల్లెపాకుల వెంకటయ్య ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో గతంలో నక్సలైట్ ఉద్యమంలో పని చేసిన వెంకటయ్య గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కొండారెడ్డిపల్లికి చెందిన వెంకటయ్య కాంగ్రెస్ నాయకుడు కేవీఎన్‌రెడ్డితో కలిసి 1994లో జలసాధన ఉద్యమంలో పని చేశారు. 2001లో పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరి కల్వకుర్తి దళంలో పని చేశారు. 2003లో జనజీవన స్రవంతిలోకి వచ్చిన వెంకటయ్య.. రేవంత్ రెడ్డి సహకారంతో హోమ్ గార్డు ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. వెంకటయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, గ్రామపెద్దలకు వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మా ఓటును అమ్ముకోము...



ఓటు మా ఆయుధం.. దానిని మేము అమ్ముకోము, అభివృద్ధిని ఎంచుకుంటాం అంటూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన కొడ ముంజ అనిల్ తన ఇంటి ముందు ఇలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు

- హుస్నాబాద్ రూరల్

తల్లీకూతుళ్ల సవాల్





నామినేషన్ దాఖలు చేస్తున్న కూతురు సుమలత, తల్లి గంగవ్వ

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లి సర్పంచ్ స్థానానికి తల్లీకూతుళ్లు నామినేషన్లు దాఖలు చేశారు. తిమ్మయ్యపల్లి స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కాగా గంగవ్వ అనే మహిళ నామినేషన్ వేశారు. గంగవ్వ కుమార్తె సుమలత అదే గ్రామానికి చెందిన పల్లెపు అశోక్‌ను కొద్ది రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన తల్లి గంగవ్వకు పోటీగా సుమలత కూడా సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు.

ఆంధ్రజ్యోతి- కోరుట్ల రూరల్

'స్థానికం'లో యువతకు కాంగ్రెస్ ప్రోత్సాహం

- విద్యార్థి, యువజన విభాగాల వారికి ఉజ్వల భవిష్యత్తు
- యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి భేటీలో మహేశ్ గౌడ్



హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో యువ నాయకత్వాన్ని కాంగ్రెస్ ప్రోత్సహిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులను యువత పోటీ పడి సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన విభాగాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. శనివారం గాంధీ భవన్‌లోని ఇందిరాభవన్‌లో జరిగిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులు ప్రజల నాడికి అనుగుణంగా పనిచేయడంతో ఉన్నత స్థానానికి ఎదగడానికి అవకాశముంటుందన్నారు. యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన నాయకులు కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు అయ్యారని చెప్పారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు.. ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా సేకరించిన సంతకాల సేకరణ పత్రాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మహేశ్ గౌడ్‌కు అందజేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణేశ్ నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు గడప గడపకు తిరిగి 30 వేల పైచిలుకు సంతకాలను సేకరించారు.

సర్పంచ్ ఎన్నికల్లో బలవంతపు.. వేలంపాట ఏకగ్రీవాలు వద్దు: మంత్రి జూపల్లి



సర్పంచ్ ఎన్నికల్లో బలవంతపు వేలంపాటలతో ఏకగ్రీవాల ఎన్నికలు చేపట్టవద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొన్ని గ్రామాలలో పదవుల కోసం వేలం పాటలు, బలవంతపు ఏకగ్రీవ ఎన్నికలు చేపడుతున్నారని, ఈ విధానం ప్రజాస్వామ్యానికి ప్రజల స్వేచ్ఛకు చైతన్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. పోటీ చేయాలనుకుంటున్న ఆశావాహులు, ప్రజలతో ఉన్నవారు ప్రజా తీర్పు కోరాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి జూపల్లి సూచించారు. పల్లెలు దేశ ప్రగతికి పట్టుకొమ్మలని, అలాంటి పల్లెల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి కానీ, ప్రజాస్వామ్య విరుద్ధంగా, ప్రజల చైతన్యాన్ని కాలరాసే విధంగా వేలంపాటల ద్వారా పదవులు పొందడం సరికాదన్నారు.

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో 200 రైళ్ల రేక్‌లకు ఆర్డర్లు

- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ వెల్లడి

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలోని అయోధ్యపురంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ (కోచ్ ఫ్యాక్టరీ)లో 200 రైళ్ల రేక్‌ల తయారీకి ఆర్డర్లు అందినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన అనంతరం సీపీఆర్వో శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. మొదటగా, ఒక మోడల్ రైలు ఇంజన్, బోగీలను తయారు చేస్తారు. ఈ మోడల్ రైలును పట్టాలపై నడిపి, అన్ని సరైనవిగా నిర్ధారించిన తర్వాతే పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తారు. ఒక్కో రైలుకు 16 కోచ్‌ల చొప్పున 200 రైళ్ల (రేక్‌లు) తయారీకి ఆర్డరు అందినట్లు శ్రీధర్ స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో వందేభారత్, ఎంఎంటీఎస్ కోచ్‌లతో పాటు అన్ని రకాల రైలు ఇంజన్లు, కోచ్‌లు తయారు చేసేందుకు నిర్మాణం జరుగుతోందని తెలిపారు.

గ్రామం కోసం ఖాకీని వదిలేసి..

సర్పంచ్ పోటీ కోసం ఉద్యోగానికి రాజీనామా చేసిన కోదాడ ఎస్సై

- ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఎన్నికల బరిలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు
- నల్లగొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ !
- ముందుజాగ్రత్త.. ఒకే సర్పంచ్ స్థానానికి భార్యాభర్తల నామినేషన్లు



ఎస్సై పులి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ సాధన అలియాస్ సంతోష్

కోదాడ రూరల్, తిప్పర్తి, జైనూర్, నవీపేట, చిట్యాల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు గ్రామాల్లో ఆసక్తికర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో ముఖ్యంగా సర్పంచ్‌గా తన స్వగ్రామానికి సేవ చేసేందుకు ఓ ఎస్సై(సబ్ ఇన్ స్పెక్టర్) ఏకంగా తన పదవికి రాజీనామా చేసేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ ఎస్సై పులి వెంకటేశ్వర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు 1989లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. ఏడాది క్రితమే ఏఎస్ఐ నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన ఆయన 2026 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే, పంచాయతీ ఎన్నికల్లో గుడిబండ గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయాలని నిర్ణయించుకున్న ఆయన మరికొన్ని నెలలు సర్వీసు ఉన్నప్పటికీ శనివారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సర్పంచ్ పదవికి ఆదివారం నామినేషన్ వేయబోతున్నారు. పులి వెంకటేశ్వర్లు కుమార్తె కూడా ఎస్సైగా పని చేస్తున్నారు. ఇక, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి సర్పంచ్ స్థానానికి ఆ గ్రామానికి చెందిన సాధన అలియాస్ సంతోష్ (26) అనే ట్రాన్స్‌జెండర్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. అలాగే, నిజామాబాద్ జిల్లా నవీపేట గ్రామ పంచాయతీ 14వ వార్డు మెంబర్ స్థానానికి గ్రామానికి చెందిన కొండపల్లి అంకిత అనే ట్రాన్స్‌జెండర్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. 2019 పంచాయతీ ఎన్నికలల్లోనూ వార్డు మెంబర్‌గా పోటీ చేసిన అంకిత 18 ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోపక్క, నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం యల్లమ్మగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ అయ్యారనే వార్త స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యల్లమ్మగూడెం సర్పంచ్ స్థానానికి బీఆర్ఎస్‌కు చెందిన మామిడి నాగలక్ష్మి నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. యల్లమ్మగూడెంకు చెందిన నాగలక్ష్మి భర్తతో కలిసి నకిరేకల్‌లో నివాసముంటున్నారు. అయితే, నామినేషన్ వేసేందుకు గ్రామానికి వెళ్లేందుకు కారు తీసుకొస్తానని శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన నాగలక్ష్మి భర్త మామిడి యాదగిరి మధ్యాహ్నమైన తిరిగి రాలేదు. భర్త ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండగా నాగలక్ష్మి ఒంటరిగా తిప్పర్తి చేరుకున్నారు. అయితే, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తనకు ఫోన్ చేసిన యాదగిరి.. నామినేషన్ వేయవద్దని చెప్పి కాల్ కట్ చేశారని నాగలక్ష్మి అంటున్నారు. నాగలక్ష్మి ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గ్రామానికి చేరుకున్న ఆయన ఆమెకు ధైర్యం చెప్పి నామినేషన్ వేయించారు. ఇక, విషయం తెలిసి తిప్పర్తి ఎస్సై శంకర్.. నాగలక్ష్మి ఇంటికి వెళ్లగా ఆమె ఫిర్యాదు చేశారు. తన భర్తను కిడ్నాప్ చేసిన వారిపై కేసు పెట్టాలని ఎస్పీని కోరుతామని నాగలక్ష్మి తెలిపారు. మరోపక్క, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం తాళ్లవెల్లంల సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన నల్లబెల్లి రమేష్, అతడి భార్య వినోద వేర్వేరుగా నామినేషన్లు చేశారు. బీఆర్ఎస్ మద్దతుదారులైన ఈ దంపతులు తమలో ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైతే మరొకరు పోటీలో ఉంటారనే ముందుజాగ్రత్తతో ఇలా నామినేషన్లు వేశారు.

ఆగని వేలంపాటలు

- నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ పదవి 51.30లక్షలకు ఏకగ్రీవం
- ఆ డబ్బుతో గ్రామంలో బొడ్రాయి, శివాలయ నిర్మాణానికి హామీ
- నిర్మల్ జిల్లా మహావీర్ తండా సర్పంచ్ పదవికి రూ.5.65 లక్షలు

కొండమల్లేపల్లి, సారంగాపూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవులకు వేలంపాటలు నిర్వహించడంపై ఎన్నికల సంఘం చేసిన హెచ్చరికలు బేఖాతరవుతున్నాయి. వేలంపాటలో గెలిచిన వారికి సర్పంచ్ పదవులు సొంతమవుతున్నాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ స్థానానికి వేలం నిర్వహించగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పందుల వెంకటయ్య రూ.51.30లక్షలకు పదవిని దక్కించుకున్నట్టు తెలిసింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మహావీర్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి రూ.5.65 లక్షలకు ఓ మహిళ సొంతమైనట్టు సమాచారం. నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ పదవి జనరల్ కేటగిరీకి రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో శనివారం సమావేశమైన గ్రామప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు.. సర్పంచ్ పదవికి వేలం వేసి వచ్చిన డబ్బుతో బొడ్రాయి, శివాలయాన్ని నిర్మించాలని తీర్మానం చేశారు. దీంతో గ్రామంలో ఓ చోట నిర్వహించిన వేలంపాటలో సర్పంచ్ పదవిని ఆశిస్తున్న దాదాపు 10 మంది ఆశావహులు పోటీపడ్డారు. ఇందులో పందుల వెంకటయ్య రూ.51.30 లక్షలకు వేలంపాట గెలిచి సర్పంచ్ పదవి దక్కించుకున్నట్టు తెలిసింది. ఈ నగదు డిసెంబరు 7న గ్రామ పెద్దలకు అప్పజెప్పాలని గ్రామస్థులు నిర్ణయించినట్లు సమాచారం. ఇక, నిర్మల్ జిల్లా మహావీర్‌తండా సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. వివిధ పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన మహిళా అభ్యర్థుల తరఫున వారి భర్తలు దిలీప్, రవీందర్, రాజు, ఉత్తమ్ ధన్సింగ్ వేలంలో పాల్గొన్నారు. అయితే, సంచిబాయి అనే అభ్యర్థి భర్త దిలీప్ రూ.5.65లక్షలకు వేలం పాటలో సర్పంచ్ పదవిని దక్కించుకున్నారని తండావాసులు చెబుతున్నారు. సంచిబాయిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానించినట్లు తెలిపారు.

ఏకగ్రీవం చేస్తే 20 లక్షలిస్తానంటూ చాటింపు

నేరేడుచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.20లక్షలు ఇస్తానంటూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామానికి చెందిన మామిడి సత్యనారాయణ డప్పు చాటింపు వేయించారు. సోమారం గ్రామానికి చెందిన సత్యనారాయణ మిర్యాలగూడలో వ్యాపారం చేస్తున్నారు. ఊరిపై మమకారంతో రూ.20లక్షలతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని అనుకుంటున్నానని, అందుకే గ్రామంలో చాటింపు వేయించానని తెలిపారు. తనను సర్పంచ్‌గా ఎన్నుకుంటే ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనాన్ని కూడా పంచాయతీ అభివృద్ధికే కేటాయిస్తానని చెప్పారు.

నిలిచిన మీసేవలు

పదిరోజులుగా ఆగిపోయిన సర్టిఫికెట్ల జారీ

- కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థుల ఆందోళన
- ఎన్ఐసీ, యూడీబీఎంఐఎస్ మధ్య సమన్వయ లోపమే కారణం!

బోయినపల్లి, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో పది రోజులుగా పలు సేవలు నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఇచ్చే జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు జీహెచ్ఎంసీలో చిన్నారుల పేర్ల మార్పు, సవరణ (కరెక్షన్) సేవలు కూడా నిలిచిపోవటంతో పిల్లల తల్లిదండ్రులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించడానికి దరఖాస్తు పత్రానికి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుంది. మీసేవ కేంద్రాల్లో బర్త్ సర్టిఫికెట్లు కొన్ని రోజులుగా రావడం లేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ అప్డేట్, పేర్ల మార్పు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్, లీగల్ ఎయిడ్, వీసాలు తదితర దరఖాస్తులైతే నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

అందినకాడికి గుంజుడే..

రాష్ట్ర డేటా సెంటర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలోని 12, 13, 17, 29, 30 సర్కిళ్లలో దరఖాస్తుదారుల అవసరాలను మీసేవ సిబ్బంది అవకాశంగా మార్చుకొని అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ చిన్నారుల పేర్ల నమోదు, సవరణల కోసం ఒక్కో దరఖాస్తుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలుచేస్తూ అక్రమ మార్గంలో ధ్రువపత్రాలు అందిస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఆరు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ), యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ రిజిస్ట్రేషన్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (యూబీడీఎంఐఎస్) మధ్య సమన్వయ లోపం కారణంగానే సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయిందని సమాచారం. సీడీఎంఏ సర్వర్ డౌన్ కావటంతో రాష్ట్ర డేటా సెంటర్‌తో కనెక్ట్ కావడంలో సమస్యలు వచ్చినట్లు తెలిసింది. యూబీడీఎంఐఎస్ పోర్టల్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేయడంతోపాటు దరఖాస్తుల స్థితిగతులను తెలుసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఎన్ఐసీ ఈ గవర్నెన్స్ అప్లికేషన్ల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తుంది. అధికారులు సమస్యను గుర్తించి వెంటనే సరిచేయకపోవటం వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

విద్యార్థుల అవస్థలు..

ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు, ఉద్యోగార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎస్సీ మినహా ఇతర కుల ధ్రువీకరణ పత్రాలు, ఈసీ, సీసీ, జీవన్ ప్రమాణ్ జారీలోని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిలోగా సరఫరా చేయాల్సిందే

- ఎమర్జెన్సీ రూట్‌లో ఆయుధ కొనుగోళ్లపై కేంద్రం నిబంధన

న్యూఢిల్లీ, నవంబరు 29: ఆయుధ కొనుగోళ్లకు సంబంధించి కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యవసర సందర్భాల్లో(ఎమర్జెన్సీ రూట్‌లో) ఆయుధాల కొనుగోళ్ల కోసం ఒప్పందం జరిగినప్పుడు.. ఆ ఆయుధాలను సంవత్సరంలోగా అందించకపోతే కాంట్రాక్టు రద్దు అయ్యేలా నిబంధనలు రూపొందించింది. ఈ విషయాన్ని రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ వెల్లడించారు. ఇది స్వదేశంలోని రక్షణ కంపెనీలతో పాటు, విదేశాలకు కూడా వర్తిస్తుందన్నారు. రష్యా ఎస్-400లను అందించడంలో చేస్తున్న జాప్యాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనిపై భారత ప్రభుత్వం, పుతిన్ పర్యటన సమయంలో స్పష్టత కోరుతుందని పేర్కొన్నారు. "ఎమర్జెన్సీ రూట్‌లో ఆయుధాల కొనుగోలుకు ఒప్పందం జరిగినప్పుడు.. ఏ కంపెనీ, ఏ దేశం అన్నదానితో సంబంధం లేకుండా అవి ఏడాదిలోగా ఆయుధాలను అందించాల్సిందే. లేకపోతే కాంట్రాక్టు రద్దు అవుతుంది" అని రాజేశ్‌కుమార్ వివరించారు.

హెచ్-1బీ వీసాల పరిమితి 1,30,000కు పెంపు?

వాషింగ్టన్, నవంబరు 29: అమెరికా ఏటా జారీ చేసే హెచ్-1బీ వీసాల పరిమితి పెంపునకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వీసాలను రెట్టింపు చేసే దిశగా హైస్కిల్డ్ ఇమిగ్రేషన్ రిఫార్మ్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్(హెచ్ఐఆర్ఈ) బిల్లును అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి ప్రవేశపెట్టారు. వీసాల వార్షిక పరిమితిని 65 వేల నుంచి 1.30 లక్షలకు పెంచాలని ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుకు అమెరికాలోని అతిపెద్ద ఐటీ సేవా సంస్థల సంఘం ఐటీసర్వ్ కూటమి మద్దతు పలికింది. ప్రస్తుతం అమెరికా రెగ్యులర్ క్యాప్ కింద ఏటా 65వేల హెచ్-1బీ వీసాలు జారీ చేస్తోంది. మాస్టర్స్ క్యాప్ కింద 20వేల వీసాలను తమ దేశంలో అడ్వాన్స్ డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఇస్తోంది.

నేడు దండకారణ్యం బంద్

- హిడ్మా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టు పార్టీ పిలుపు

చర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కీలక నేత హిడ్మా, అతడి అనుచరుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆదివారం ఛత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ నేపథ్యంలో మావోయిస్టులు ఏదైనా విధ్వంసానికి పాల్పడవచ్చన్న అనుమానంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు అప్రమత్తమయ్యాయి. బస్తర్ డివిజన్‌లోని 7జిల్లాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. నేషనల్ పార్క్, అబూజ్‌మడ్, పామేడు అడవుల్లో కూబింగ్ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం బంద్ నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ, ఏపీ పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. తెలంగాణలోని ములుగు, భద్రాద్రి జిల్లాల్లో తనిఖీలను పెంచారు.

శబరిమల యాత్రలో మరణించేవారిని అంబులెన్సులో తరలించాలి

- స్ట్రెచర్‌పై తీసుకొచ్చే పద్ధతి మానేయాలి: కేరళ హైకోర్టు

కొచి, నవంబరు 29: శబరిమల సన్నిధానం యాత్రలో ఆరోగ్య సమస్యలతో మరణించే వారిని పంబకు స్ట్రెచర్ మీద తీసుకురావటంపై కేరళ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇకపై ఈ పద్ధతి మానుకోవాలని, మరణించిన భక్తులను అంబులెన్సులో తరలించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల మృతులను సగౌరవంగా తరలించటంతోపాటు, సన్నిధానం యాత్రలో పాల్గొనే ఇతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని పేర్కొంది. శబరిమల ప్రత్యేక కమిషనర్ సమర్పించిన నివేదికపై హైకోర్టు ద్విసభ ధర్మాసనం శనివారం విచారణ జరిపింది. ప్రస్తుతం పంబలో ఒక పాత అంబులెన్సు ఉందని, దానిని మృతులను తరలించటానికి వినియోగించవచ్చని ప్రత్యేక కమిషనర్ కోర్టుకు తెలిపారు. మరిన్ని సదుపాయాలతో కూడిన వాహనం అందుబాటులోకి వచ్చేవరకూ ఆ పాత అంబులెన్సునే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఉపయోగించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది.

ర్యాపిడో డ్రైవర్ ఖాతాలో రూ.331 కోట్లు!

- బెట్టింగ్ యాప్ కేసు విచారణలో విస్తుగొలిపే విషయాలు

న్యూఢిల్లీ, నవంబరు 29: ఓ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ కేసులో ఊహించని రీతిలో ఓ ర్యాపిడో డ్రైవర్ బుక్కయ్యాడు.. కేవలం 8నెలల్లో అతడి బ్యాంకు ఖాతాలో రూ.331 కోట్లు జమయ్యాయని ఈడీ అధికారులు గుర్తించారు. 1ఎక్స్‌బెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో నిధుల మళ్లింపుపై ట్రాక్ చేస్తున్న క్రమంలో ఆ డ్రైవర్‌ను గుర్తించినట్లు వారు తెలిపారు. సదరు డ్రైవర్ ఖాతాలో గతేడాది ఆగస్టు 19నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 16వరకు రూ.331కోట్లు జమయ్యాయి. దీంతో అతడి బ్యాంకు ఖాతాల జాబితాలు పరిశీలించి.. అతడి చిరునామాను గుర్తించి నివాసంపై ఈడీ అధికారులు దాడి చేశారు. ఢిల్లీలోని ఓ మురికివాడలో 2 గదుల ఇంట్లో ఉంటున్న అతడు.. పొట్టకూటి కోసం ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. తన పేరుతో ఉన్న బ్యాంకు ఖాతా ద్వారా జరిగిన లావాదేవీలకు తనకే సంబంధం లేదని అతడు వాపోయినట్లు అధికారులు తెలిపారు. నిందితులు ఆ డ్రైవర్ ఖాతాను మ్యూల్ ఖాతాగా వినియోగించినట్లు భావిస్తున్నారు.

అణచివేత ఉన్నంతవరకు జిహాద్: మదానీ

న్యూఢిల్లీ, నవంబరు 29: జమైత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా మహమూద్ మదానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అణచివేత ఉన్నంతవరకు జిహాద్ ఉంటుందని అన్నారు. ఇస్లాంలో ముస్లింలకు జిహాద్ అనేది పవిత్రమైన విధి అని, ఇతరుల మంచి కోరి చేసే కార్యమని చెప్పారు. కానీ, మీడియా, ప్రభుత్వం దానిని హింసకు పర్యాయపదంగా మార్చాయని తప్పుబట్టారు. భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదన్నారు. ఇక్కడి ముస్లింలు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటారని తెలిపారు. సుప్రీంకోర్టు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఒత్తిడి మేరకు పనిచేస్తోందని, బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్ కేసుల్లో తీర్పులే ఇందుకు నిదర్శనమని అన్నారు.

కర్ణాటకానికి తెర!

సీఎం సిద్దు, డీసీఎం శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ భేటీ


సీఎం సిద్దరామయ్యతో కలసి అల్పాహారం స్వీకరిస్తున్న డీసీఎం శివకుమార్

- మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాల్లేవు
- ఐక్యంగానే ఉన్నాం.. సిద్దు, డీకే వెల్లడి

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో కొన్ని రోజులుగా నెలకొన్న గందరగోళానికి తెరపడింది. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ ఒకచోట సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తామిద్దరం కలిసే ఉన్నామనే సందేశం ఇచ్చేలా శనివారం ఉదయం సీఎం అధికారిక నివాసానికి వెళ్లిన డీకే అక్కడే అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సుమారు అరగంటకుపైగా మాట్లాడుకున్నారు. అనంతరం సీఎం, డీసీఎం కలిసి మీడియాతో మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని సిద్దరామయ్య స్పష్టం చేశారు. నాయకత్వ మార్పునకు సంబంధించి ఇకపై ఏ విభేదాలు ఉండవని చెప్పారు. తాము ఐక్యంగానే ఉన్నామని, 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. అధిష్ఠానం తీర్మానానికి అనుగుణంగా నడుచుకుంటామని, అల్పాహార విందులోనూ అదే తీర్మానించామని వివరించారు. నాయకత్వం మార్పుపై కొన్ని మీడియాల ద్వారానే ఎక్కువ చర్చ జరిగిందన్నారు. మరో వారం రోజుల్లో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ-జేడీఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే దీటుగా ఎదుర్కొంటామని సీఎం పేర్కొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ, ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా పనిచేస్తున్నామని అన్నారు. సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిందని, రాజకీయంగా ఇద్దరిదీ ఒకే తీర్మానమని చెప్పారు. హైకమాండ్ చెప్పినట్లుగానే కలసి ముందుకెళ్తామని తెలిపారు. తాను గ్రూపులకు అవకాశం ఇవ్వనని, నాయకత్వం విషయంలోనూ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తానని స్పష్టం చేశారు. 2028లోనూ గత ఫలితాలే పునరావృతం అవుతాయని డీకే ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై కొద్దిరోజులుగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి శివకుమార్‌ను సిద్దరామయ్య దగ్గరకు వెళ్లి కలవాలని, తద్వారా ఇద్దరూ కలిసే ఉన్నారన్న సంకేతం ఇవ్వాలని, ఊహాగానాలకు తెరదించాలని ఆదేశించింది. మరోవైపు, శనివారం డీకేను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించాలని సిద్దరామయ్యకు సూచించింది. దీనికి ఇద్దరూ అంగీకరించారు.

సీఎం పదవి పోయినప్పుడు ఏ మఠాధిపతీ మాట్లాడలేదు

- కేంద్ర మంత్రి కుమారస్వామి ఆరోపణలు

నాయకత్వ మార్పు అంశంపై ఉత్కంఠ నెలకొన్న తరుణంలో ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన పలువురు స్వామీజీలు డీకే శివకుమార్‌కు అండగా నిలిచారు. వారి తీరుపై కేంద్ర మంత్రి కుమారస్వామి శనివారం మండిపడ్డారు. రాజకీయాల కారణంగా తాను రెండుసార్లు సీఎం పదవిని కోల్పోయానని, అప్పట్లో తనకు ఏ మఠాధిపతీ మద్దతుగా మాట్లాడలేదని ఆరోపించారు. కులాల పేరు చెప్పుకొని ధార్మిక, ఆధ్యాత్మిక రంగాలను దుర్వినియోగం చేయడం, రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదన్నారు. ఒక్కలిగ, కురుబ, ఇతర సామాజికవర్గాలకు చెందిన స్వామీజీలు రాజకీయ చర్చల్లో పాల్గొనడం, ఒకరికి మద్దతు ఇవ్వడం సరికాదని తెలిపారు. మఠాధిపతులు రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు.

‘సర్’పైనే సమరం!

- రేపటి నుంచి 19వ తేదీ వరకు పార్లమెంట్
- నేడు అఖిలపక్ష, బీఏసీ భేటీలు

న్యూఢిల్లీ, నవంబరు 29: చల్లచల్లని శీతాకాలంలో అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా చర్చలకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. దీనికి సంబంధించి కేంద్రం ఆదివారం ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని పార్టీలకు విజ్ఞప్తి చేయనుంది. పార్లమెంటు సమావేశాల్లో చర్చించే అంశాల ఎజెండాను ఖరారు చేసేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు విడివిడిగా లోక్‌సభ, రాజ్యసభల బీఏసీ సమావేశాలు జరగనున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) అంశం కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంటులో చర్చకు పట్టుబట్టాల్సిన అంశాలపై చర్చించుకునేందుకు ఇండి కూటమి పార్టీల ప్రతినిధులు సోమవారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ ప్రాంగణంలోని ఖర్గే కార్యాలయంలో భేటీ కానున్నారు.

వీధి కుక్కలపై తీర్పును పునఃసమీక్షించండి

- సుప్రీంకోర్టుకు 50వేల మంది లేఖలు

న్యూఢిల్లీ, నవంబరు 29: వీధి కుక్కల బెడదపై ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ శనివారం 50 వేలకు మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టుకు లేఖలు రాశారు. చేతితో లేఖలు రాసి పోస్టు ద్వారా పంపారు. ఇందులో ఢిల్లీకి చెందిన 10వేల మంది ఉన్నారు. ఆస్పత్రులు, పాఠశాలల వంటి ప్రాంతాల్లో కుక్కలు లేకుండా చూడాలని, వాటికి జనన నియంత్రణ ఇంజెక్షన్లు ఇవ్వాలని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇది జంతువుల హక్కులకు భంగకరమని పేర్కొంటూ అంబిక అనే జంతు సంక్షేమ కార్యకర్త వినతుల ఉద్యమాన్ని ప్రారంభించారు.



వివాహ బంధంలోకి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

మెల్‌బోర్న్, నవంబరు 29: ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ (62) శనివారం నూతన జీవితంలోకి అడుగుపెట్టారు. ఆయన తన స్నేహితురాలు జోడీ హైడోన్ (46)ను వివాహమాడారు. రాజధాని కాన్‌బెర్రాలోని అధికారిక నివాసం ‘ద లాడ్జ్’ మైదానంలో నిరాడంబరంగా ఈ వివాహం జరిగింది. మంత్రులు సహా కేవలం 60 మందిని మాత్రమే ఆహ్వానించారు. అల్బనీస్‌కు ఇది వరకే వివాహం జరగగా, విడాకులు తీసుకున్నారు. ఈ వివాహానికి యువకుడైన మొదటి భార్య కుమారుడు కూడా వచ్చారు. వారి పెంపుడు శునకం టోటో పెళ్లి ఉంగరాన్ని తీసుకొచ్చి ‘రింగ్ బేరర్’గా వ్యవహరించింది. నూతన దంపతులకు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

అబద్ధాల పాక్.. అవే కుయుక్తులు!

- ఆపరేషన్ సిందూర్‌పై ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో డిబేట్‌కు ఆహ్వానం
- అబద్ధాలు చెప్పి భారత బృందం హోటల్‌లోనే ఉండేలా కుట్ర
- తర్వాత తామే గెలిచామని ప్రకటన.. ఎండగట్టిన భారత బృందం


సాయిదీపక్

లండన్, నవంబరు 29: ప్రపంచవ్యాప్తంగా అంతా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే చర్చావేదికల్లో ఒకటైన ‘ఆక్స్‌ఫర్డ్ యూనియన్’లో పాక్ కుయుక్తులకు పాల్పడింది! మనవాళ్లను డిబేట్‌కు పిలిచి.. చివరి నిమిషంలో ‘డిబేట్ రద్దు అయ్యింది’ అంటూ మనవాళ్లకు సమాచారం అందించి, రాకుండా చేసి.. ‘భారత వక్తలు భయపడి ఈ డిబేట్‌కు రాలేదు.. మేమే గెలిచాం’ అని ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టింది. కానీ.. పాక్ కుట్రలను మన భారతీయ బృందం ఆధారాలతో సహా బయటపెట్టింది!! రెండు రోజుల క్రితం లండన్ వేదికగా జరిగిన ఈ కపటనాటకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 1823లో స్థాపితమైన ఆక్స్‌ఫర్డ్ యూనియన్ సొసైటీలో ప్రతివారం నిర్వహించే చర్చలకు గొప్ప పేరుంది. చర్చిల్, దలైలామా, హాకింగ్.. ఇలా ఎందరో ప్రముఖులు ఈ చర్చల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అలాంటి ఆక్స్‌ఫర్డ్ యూనియన్.. ‘ఆపరేషన్ సిందూర్’ నేపథ్యంలో నవంబరు 27న ఒక డిబేట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆ చర్చకు.. "పాకిస్థాన్ పట్ల భారత్ అనుసరిస్తున్నది.. భద్రతా విధానంగా చెబుతున్న ప్రజాకర్షక వ్యూహం" అని భారత్ పట్ల ప్రతికూల ధోరణితో కూడిన పేరు పెట్టింది. దీని వెనుక ఉన్నది ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అధ్యక్షుడు మూసా హర్రాజ్, కోశాధికారి రజా నాజర్. వీరిలో మూసా హర్రాజ్.. పాకిస్థాన్ రక్షణ ఉత్పత్తుల మంత్రి ముహమ్మద్ రజా కుమారుడు. రజా నాజర్ కూడా పాకిస్థానీయే. ఈ చర్చలో పాల్గొనేందుకు భారత్ నుంచి సుప్రీంకోర్టు న్యాయవాది జె.సాయిదీపక్, మరో ఇద్దరు సిద్ధమయ్యారు. కానీ.. చర్చ ప్రారంభం కావడానికి మూడు గంటల ముందు.. సాయిదీపక్‌కు మూసా ఫోన్ చేసి.. ‘పాకిస్థాన్ బృందం ఇంకా రానందున, చర్చను రద్దు చేస్తున్నాం’ అని చెప్పాడు. దీంతో మన బృందం.. హోటల్‌లోనే ఉండిపోయింది. అనంతరం.. "భారత బృందం చివరినిమిషంలో ఉపసంహరించుకుని, మాకు విజయాన్ని కట్టబెట్టింది" అంటూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ‘ఎక్స్’ వేదికగా ప్రకటించింది. వెంటనే సాయిదీపక్ అదే ‘ఎక్స్’ వేదికగా.. పాకిస్థానీల అసలు స్వరూపాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారు. 16 వరుస పోస్టుల్లో పాక్ కుయుక్తిని ఎండగట్టారు. తాము ఈ చర్చలో పాల్గొనేందుకు లండన్‌కు వచ్చామని.. కానీ, మూసా ఫోన్ చేసి డిబేట్ రద్దయినట్లు చెప్పాడని పేర్కొన్నారు. అతడి ఫోన్ కాల్ లాగ్స్‌ను సైతం తన పోస్టుకు జత చేశారు. ఇప్పటికీ తాము లండన్‌లోనే ఉన్నామని.. పాకిస్థానీ బృందం కూడా లండన్‌లోనే ఉన్నదన్న విషయం తమకు తెలిసిందని.. వారికి బృందానికి వెన్నెముక ఉంటే తమతో చర్చకు రావాలని సవాల్ చేశారు. ప్రతిష్ఠాత్మక ‘ఆక్స్‌ఫర్డ్ యూనియన్’ను సైతం పాక్ తన కుట్రలకు వేదికగా చేసుకోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ ప్రియాంక చతుర్వేది కూడా స్పందించారు. ఈ చర్చకు తనను కూడా ఈ ఏడాది జూలైలోనే ఆహ్వానించారని.. ఆ సమయానికి పార్లమెంట్ సమావేశాలు లేకపోతే తాను వస్తానని చెప్పానని.. కానీ, ఆ తర్వాత తనతో ఎలాంటి సంప్రదింపులూ జరపలేదని.. చర్చకు సరిగ్గా రెండు రోజుల ముందు వారు తనను సంప్రదించారని.. దీంతో వారి నిర్వహణ సామర్థ్యంపై నమ్మకం లేక తాను రానని చెప్పేశానని ఆమె వివరించారు.

గగనయానం గందరగోళం

- ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యలు
- నిలిచిపోయిన 6 వేల విమానాలు



న్యూఢిల్లీ, నవంబరు 29: ఎయిర్‌బస్ ఏ320 రకం విమానాల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలు ప్రపంచవ్యాప్తంగా పౌర విమానయాన రంగంలో తీవ్ర అలజడి సృష్టించాయి. ఏ318, ఏ319, ఏ320, ఏ321 రకం విమానాల్లో సౌర రేడియో ధార్మికత వల్ల సమస్యలు వచ్చాయని, వెంటనే వాటిలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని విమానయాన కంపెనీలు, పౌర విమానయాన నియంత్రణ సంస్థలకు ఆ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ శుక్రవారం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 6,000 విమానాలు నిలిచిపోయాయి. అడ్వయిజరీ జారీచేసిన సమయంలో ఈ రకానికి చెందిన దాదాపు 3,600 విమానాలు గాల్లో ఎగురుతున్నాయి. అవి గమ్యస్థానాలకు చేరిన వెంటనే, వాటి తర్వాతి ప్రయాణాలను రద్దుచేసి సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కోసం తరలించారు. భారత్‌లోనూ 200 నుంచి 250 విమానాలు నిలిచిపోయాయి. దీంతో చాలాకంపెనీలు ప్రయాణాలను వాయిదా వేయటమో రీషెడ్యూల్ చేయటమో, రద్దు చేయటమో చేశాయి. అయితే, తమ విమానాల షెడ్యూళ్లలో ఏ మార్పూ లేదని ఎయిర్ ఇండియా తెలిపింది. ఎయిర్‌బస్ కంపెనీ 55 ఏళ్ల చరిత్రలో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రభావం ఇదేనని ఏవియేషన్ వర్గాలు తెలిపాయి. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ తర్వాత కూడా ఈ విమానాలను పూర్తిగా చెక్ చేసిన తర్వాతే వినియోగంలోకి తేవాలని డీజీసీఏ ఆదేశాలు జారీచేసింది.

అసలేం జరిగింది?

గత నెల 30వ తేదీన మెక్సికోలోని కాన్‌కన్ నుంచి అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న నెవార్క్‌కు వెళ్తున్న జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఏ320 విమానం గాల్లో ఉన్నట్లుండి తన మార్గం నుంచి కిందికి పడిపోయింది. పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్ అండ్ ఎయిలెరాన్ కంప్యూటర్ (ఈఎల్ఏసీ) యూనిట్ విమాన ఎలివేటర్లకు ఆదేశాలు ఇవ్వటం మొదలుపెట్టింది. అయితే, పైలట్లు విమానాన్ని నియంత్రించి యథాస్థానానికి తెచ్చారు. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులతోపాటు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. విమానాన్ని వెంటనే ఫ్లోరిడాలోని తంపా విమానాశ్రయంలో దించివేశారు. విమానంలో జరగడానికి అంతరిక్షంలోకి భారీగా వెలువడుతున్న సౌర రేడియో ధార్మికతేనని ఎయిర్‌బస్ సంస్థ శుక్రవారం ప్రకటించింది. విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అత్యవసరంగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

టీవీ రేటింగ్స్ కోసం.. 100 కోట్ల లంచం!

బార్క్ ఉద్యోగికి క్రిప్టో రూపంలో ముట్టజెప్పిన కేరళ చానల్..

- గుట్టు రట్టుచేసిన మరో చానల్

తిరువనంతపురం, నవంబరు 29: కేరళలో రూ.100 కోట్ల టీవీ రేటింగ్స్ కుంభకోణం జరిగింది! ఆ రాష్ట్రానికి చెందిన ఒక స్థానిక టీవీ చానల్.. తన రేటింగ్స్‌ను కృత్రిమంగా పెంచుకోవడం కోసం బార్క్ (బ్రాడ్‌కాస్ట్ ఆడియెన్స్ రిసెర్చ్ కౌన్సిల్) ఉద్యోగి ఒకరికి క్రిప్టోకరెన్సీలో రూ.100 కోట్లు లంచంగా ముట్టజెప్పిందంటూ ‘ట్వంటీఫోర్ న్యూస్’ అనే చానల్ సంచలన వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. బార్క్ ఉద్యోగి ప్రేమ్‌నాథ్ పేరిట ఉన్న ‘ట్రస్ట్ వాలెట్’ అనే మొబైల్ వాలెట్ యాప్‌లోకి.. స్థానిక చానల్ యజమాన్యం పలు దఫాలుగా యూఎస్‌డీటీ (టెదర్) అనే క్రిప్టో కరెన్సీ రూపంలో రూ.100 కోట్లు పంపినట్లు అందులో ఆరోపించింది. దానికి బదులుగా అతడు సదరు చానల్ యజమానికి.. టీవీ రేటింగ్స్ గురించిన కీలక సమాచారాన్ని ఒకవారం ముందుగానే పంపేవాడని, ఏయే ప్రాంతాల్లో ఏయే ఇళ్లలో బార్క్ రేటింగ్ మీటర్లు అమర్చారో పిన్‌కోడ్‌తో సహా సమాచారం అందించేవాడని పేర్కొంది. దీనికి సంబంధించి వాట్సాప్ చాటింగ్, చెల్లింపుల స్క్రీన్ షాట్లను సైతం ‘ట్వంటీఫోర్ న్యూస్’ చానల్ బయటపెట్టింది. అయితే.. స్థానిక కేబుల్ ఆపరేటర్ తమ చానల్‌ను ‘ల్యాండింగ్ పేజ్ (సెట్ టాప్ బాక్స్ ఆన్ చేయగానే వచ్చే చానల్)’లో పెట్టడం వల్లనే తమ రేటింగ్స్ పెరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న చానల్ బహిరంగ ప్రకటన ద్వారా వెల్లడించింది. కానీ, వారు పేర్కొంటున్న కేబుల్ ఆపరేటర్‌కు 20 వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయని.. 85 లక్షల కేబుల్ కనెక్షన్లున్న కేరళలో కేవలం 20 వేల మంది ఉన్నచోట ఎక్కువ మంది చూస్తే రేటింగ్స్ పెరిగిపోతాయా? అని మిగతా చానళ్లు ప్రశ్నిస్తున్నాయి. వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు ఇవ్వడానికి ‘బార్క్’ రేటింగ్స్‌నే ప్రామాణికంగా తీసుకుంటాయి. ఎక్కువ రేటింగ్స్ ఉన్న చానళ్లలో వాణిజ్య ప్రకటనలు ఇవ్వడానికి ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అందుకే టీవీ చానళ్లు ఈ రేటింగ్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ కథనంతో అప్రమత్తమైన కేరళ టెలివిజన్ ఫెడరేషన్ (కేటీఎఫ్).. సీఎం విజయన్‌కు ఫిర్యాదు చేసింది. మరోవైపు.. బార్క్ కూడా ఈ వ్యవహారంపై ఓ స్వతంత్ర ఏజెన్సీ ద్వారా ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశించింది.

సిమ్ ఉన్న ఫోన్లోనే వాట్సాప్ లాగిన్!

- వాట్సాప్ లాగిన్‌కు సిమ్ బైండింగ్ నిబంధన
- అదే నంబరు సిమ్ అదే ఫోన్లో ఉండాలి
- సైబర్ నేరాల్ని అరికట్టేందుకు కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ, నవంబరు 29: వాట్సాప్, టెలిగ్రామ్ తదితర మెసేజింగ్ యాప్‌లను స్కామ్‌స్టర్లు దుర్వినియోగం చేయకుండా అరికట్టేందుకు టెలికం శాఖ కొత్త ఆదేశాలను జారీ చేసింది. అందులో ప్రధానమైనది... సిమ్ బైండింగ్ నిబంధన. ఈ ఫోన్లో సిమ్ ఆ ఫోన్లో వాట్సాప్ ఉంచుకుంటానంటే కుదరదు. ఏ ఫోన్లో అయితే సిమ్ ఉంటుందో అదే ఫోన్లో మాత్రమే సంబంధిత నంబర్ వాట్సాప్ లేదా టెలిగ్రామ్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే వెంటనే మెసేసింగ్ యాప్‌లు కూడా పని చేయడం మానేస్తాయి. కొంతమంది డెస్క్‌టాప్‌లో, ల్యాప్‌ట్యాప్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వెబ్ బ్రౌజర్‌లో వాట్సాప్‌ను ఓపెన్ చేసి, అలాగే మరచిపోతుంటారు. ఆ డెస్క్‌టాప్ తెరిచిన వాళ్లందరికీ అందులో సమాచారం తెలిసిపోతుంటుంది. ఈ పరిస్థితిని నివారించేందుకు టెలికం శాఖ కొత్త నిబంధనను తీసుకొచ్చింది. అలా తెరిచి వదిలేసిన వాట్సాప్ ఆరు గంటల్లో దానంతట అదే లాగౌట్ అయ్యేలా చూడాలని ఆదేశించింది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరాట్టై, జోష్ తదితర మెసేజింగ్ యాప్‌లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. విదేశాల నుంచి భారతీయులకు ఫోన్ల ద్వారా కాల్ చేసి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారు ఎక్కువగా వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి మెసేజింగ్ యాప్‌లు వాడుతున్నారు. మొదట భారతీయులైన భాగస్వాముల ద్వారా ఇండియా సిమ్‌లు సంపాదిస్తున్నారు. వాటిని భారతదేశంలోనే యాక్టివేట్ చేస్తున్నారు. తాముండే దేశాల్లో మరో ఫోన్‌లో అదే నంబర్‌తో వాట్సాప్‌ను యాక్టివేట్ చేస్తున్నారు. అందుకు అవసరమైన ఓటీపీని భారతదేశంలోనే ఉండే భాగస్వామి ఫోన్ ద్వారా ఇస్తారు. వాట్సాప్ సిద్ధం కాగానే ఇండియాలో ఫోన్ స్విచాఫ్ చేస్తారు. వాట్సాప్‌తో అమాయకులైన భారతీయులకు కాల్స్ చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతుంటారు. తాజా నిబంధనలతో దేశం బయట కోట్ల సంఖ్యలో భారతీయ నంబర్లతో ఉన్న వాట్సాప్‌లు మూగబోతాయి. ఇప్పటికే బ్యాంకుల యాప్‌లు, యూపీఐ పేమెంట్ యాప్‌లు ఈ రూల్‌ను పాటిస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.